పరుగులమీదపోయి చూచి వస్తుంటారు. పైరును సన్నపిల్లను సాకినట్లు సాకాలని యిద్దరూ అనుకొంటూ మురిసిపోతుంటారు. "ఇప్పటికేమో పైరు బాగుందబ్బా" అని అంటుంటాడు గంగడు.

అనుకొన్నట్లు వర్షాలు తర్వాత పడలేదు. అయినా లేదనకుండా పండింది. సోమిరెడ్డి పెట్టిన ఖర్చులకుపోను ఐదు మూటలు కొఱ్ఱలు మిగిలినాయి. పూరికొట్టంలో వేసుకోలేక కొఱ్ఱలు వెంకటరెడ్డి యింట్లోనే కొలిచిపోసినారు. తక్కిన సెత్త రెండుబండ్లు అవుతుందని అనుకొని వెంకటరెడ్డి వామిలోనే కలిపివేసినారు. కంది అంతంతమాత్రమే పండింది. అరమూట కందులయినాయి. వాడికానికి పెట్టుకోకుండా అమ్ముకొన్నారు.

"ఒరే గంగా బాగా కష్టపడినావురా – నీకు పరావాలేదు – ఐదు మూటలు కొఱ్ఱలు మిగిలినాయి. – రెండు బళ్ళ సెత్తా మిగిలింది. తంటాలుపడి భూమి పట్టావచ్చేట్లు చూసుకోరా" అని సలహా ఇచ్చినాడు వెంకటరెడ్డి. "నాకెవరు పలుకుతారబ్బా – ఏదో మీబోటి గాళ్లు పట్టుకొంటె నెరవేరుతాది" అని గంగడన్నాడు. "ఖర్చులూ కందాయాలకు నేనే పోరాడుకుంటానబ్బా" అని కూడా వివరంగా చెప్పినాడు. "నీకొఱ్ఱలున్నాయి – సెత్తావుంది – అదంతా ఖర్చయినా పరవాలేదులేరా – పట్టావస్తే – లేకుంటే పనపడినచేను – ఎవరికైనా కన్నెఱ్ఱకావచ్చు. ఇరుక్కున్నాక పెద్దరాగం పాడాలరా'' అని కొద్దిగా భయపెట్టినాడు వెంకటరెడ్డి". సరే మీయిష్టం మీరేమన్నా చేయండి అంతా మీదయ" అని బరోసా చెప్పినాడు గంగడు.

వెంకటరెడ్డి పట్టాకై ప్రయత్నిస్తున్నాడు. గట్టిగానే ప్రయత్నించినాడని చెప్పుకోవాల. ఏక్ సాల్ పట్టా సంపాదించినాడు. గంగని పనిమనిషిగా ముఖ్యంగా ఉపయోగించుకోవాల. పైగా ఎప్పుడైనా గంగడు అప్పు అడిగితే ధారాళంగా యిచ్చేందుకు వసతి కుదరాల – అదీ వెంకటరెడ్డి ఆలోచన. ఖర్చులూ – పన్నులూ – మామూళ్లూ – అన్నీ కలసి తడిసి ముప్పందుమైంది. కొఱ్ఱలూ – సెత్తా – పోయి – రెండు వందలు వెంకటరెడ్డి చేతి నుండి పెట్టినాడు.

అప్పటికి లోలోపల బాధపడినా పనిలో కరుకుగా పోరాడినాడు – నాకు మేలే చేసినాడని వెంకటరెడ్డికి మనసులోనే కృతజ్ఞత చెప్పుకొన్నాడు గంగడు. వెంకటరెడ్డి చొరవను కొందరు మెచ్చుకొన్నారు కూడ.

లచ్చికిదంతా ఏమీ అర్థం కావడం లేదు. కొర్రలు పోయినాయే చేసిన కష్టం పోయిందే – అని బాధ "చేతులూ కాళ్లూ సచ్చుపడేట్లు కష్టం చేసినా సుఖపడేందుకు రాతలేదు" అని గంగనితో బాధగా అనింది. "పోనీ లేవే – భూమి దక్కింది. రెండు మూడేళ్లల్లో భూమి బాగా పనపడుతుంది. బాగా పండుతుంది. అన్నీ తీరుతాయిలే" అని ఓదార్చాడు గంగడు.

వెంకటరెడ్డితోనే లావాదేవీలు జరుగుతున్నాయి. గంగనికి రెండు వందలకు బాండు రాయించాడు. "ఎప్పుడు కావాలన్న పైరు ఖర్చులకు యిస్తాంటాడు. నీకేమిరా వెంకటరెడ్డి వున్నాడు అన్నిటికి ఆదుకొంటాడు" అని వూర్లో అంటూంటారు. "మొదట్లో ఎద్దుల్నిచ్చి డబ్బు నావద్దలేదని ఖచ్చితంగా చెప్పిన వెంకటరెడ్డి యిప్పుడు ఎందుకిస్తున్నాడురా" అని కొందరనకాపోలేదు.

గంగడు ఏమీ పట్టించుకోకుండా వెంకటరెడ్డికే సేద్యానికి పోతూంటాడు. తెల్లవారు జామునపోయి రాత్రికి యింటికి వచ్చే వరకూ చిన్నపనీ పెద్దపనీ, అన్నీ చేసి వస్తుంటాడు. దూరపు చూపున్నవాళ్లు "వెంకటరెడ్డి అదృష్టవంతుడు. గంగడు చిక్కినాడు. అతని వ్యవసాయం కుంటుపడకుండా అద్భుతంగా జరుగుతూంది" అని కూడా అనుకొంటున్నారు. లచ్చి కూడా వెంకటరెడ్డి ఇంట్లోనే పొద్దస్తామానం వూరుకోకుండా పని చేస్తూ వుంది. కొంతమంది, "వాళ్లు చేసేపనికి గంగనిచేను వూరక పైరు పెట్టియ్యొచ్చు. కాదంటే మేపు తీసుకోవచ్చు" అని కూడ అనుకొంటున్నారు. వెంకటరెడ్డి మనసులో ఏముందో ఎవరు చూచినారు. గంగనికి పూర్తి – అంటే శాశ్వతంగా పట్టావచ్చేదాకా పోరాడినాడు. పట్టావచ్చేతలికే నాలుగేళ్ళు పట్టింది. వర్షం వచ్చినప్పుడు బాగా పండే భూమిగా తయారైంది. అదంతా గంగని సేద్యం మేలుతో జరిగింది.

దఫాలుగా పట్టాకోసం తిరగడంలోనూ – మామూళ్ళకూ పన్నులకూ రెండువందలు బాండు బాపతు అసలు వొడ్డీలూ అన్నీ కలిసి మూడేళ్లకు ఆరు వందలయింది. పైరు రాబడిపోను అంత పెద్ద మొత్తం బాకీ అయినందుకు. గంగడు లచ్చీ చాలా బాధపడినారు. ఏం చేస్తారు. శాశ్వతంగా పట్టావచ్చిందని తృప్తి తప్పితే వారేనాడూ ఇంటి పట్టునవుండి సుఖంగా తిండి తినిందిలేదు. అడివిలో బువ్వ అడివిలో నీళ్లుగా బతికినారు. రెండేళ్ళు జరిగింది. బాకీ ఎట్లబ్బా అని గంగడు లచ్చీ బాధపడుతున్నారు. తీరుస్తారో తీర్చలేరో తెలియదు.

‘‘ఒరే గంగా అసలు వొడ్డీ చాలా అవుతుందిరా – పైర్లో చెల్లువేయలేకపోయినావు. నేనేమి చేసేది. చేసినంతా చేసినా – నా డబ్బుకు మునకలేకుండా చూడు. వొడ్డీ మొదలు యీనాటికి ఎనిమిదివందలా ఎనభై అయింది – చుంగు డబ్బు తీసుకొని – తొమ్మిది వందలకు భూమిని వొడ్డి భోగ్యం రాయించాలరా – లేకుంటే నీయిష్టం – భూమి అమ్మమని చెప్పలేను. పాపం కష్టపడి తయారు చేసుకొన్నావు అని చెప్పాడు వెంకటరెడ్డి. పిడుగుపడినట్లయింది గంగనికి. ఏం చేస్తాడు విధిలేదు గంగనికి. వొడ్డిభోగ్యంగా చేనురాయించినాడు. అసలు ఎట్లా?

# ఎంతమంచిదైతే ఏం?

ఎంత మంచిదనిపించుకుంటే ఏం దిగుళ్లతో దిక్కులేని చావు చచ్చింది ఈశ్వరమ్మ. అట్లే ఆమె మొగుడు రంగారెడ్డి కష్టాల్తో విసిగి చచ్చిపోయినాడు. అవసాన కాలంలో నోట్లో నీళ్లుపోసే దిక్కు లేకుండా చచ్చిపోయినాడు. ఏందో మానవత్వానికి మసిపూసే ఘటనలు జరుగుతుంటాయి. మన చేతుల్లో ఏం లేదు. అంతా ఆయన కృప అని అంటారు. ఆఁ అంటే దేవుని మీదికి పోతారు. నిందలన్నీ ఆయన మీద కురిపిస్తారు. దిక్కుతెలియని అజ్ఞానంలో ఎవని మీదో ఒకని మీద నిందమోపడము అందరికీ అలవాటుంది. అక్షరం ముక్కరాని అందరూ ఎవరు ఏమి చెప్పినా అదే వుంటుందిలే మన మీద దేవుని దయ తప్పింది అని అనుకొంటూ వుంటారు.

చిన్న పల్లెటూళ్లో రంగారెడ్డి ఈశ్వరమ్మ ఒక గూడ మిద్దెలో ఒదుక్కొని బతుకుతున్నారు. వాళ్లకిద్దరు పిల్లలు. ఆడపిల్ల పెద్దది. పంద్రెండేళ్లు. పిల్లోనికి పదేళ్లు. చిన్న రైతు కుటుంబం.

వాళ్లకు పదెకరాల మెట్ట, ఒక ఎకరా బావి క్రింద భూమి ఉంది. గూడమిద్దె, వామిదొడ్డి పొలమూ పిత్రార్జితమే. పొలం వున్నవానికి వామిదొడ్డి విధిగా వుండాలి.

రంగారెడ్డి తండ్రి, వామిదొడ్డిని సంపాయించడంలో నానా అవస్థలూ పడినాడు. రెండు సెంట్లు వామిదొడ్డిని సంపాదించి రంగారెడ్డి తండ్రి నిశ్చింతగా చచ్చిపోయినాడు. “ఇక పరవాలేదు. పిల్లోనికి రైతుకు కావలసినవి అన్నీ అమరించినానని యింతకంటే నేనేమి చేసేదనీ” అనుకొని దాటుకొని వుంటాడు.

రంగారెడ్డికి గట్టి కల్లం కావాల. గుండు తిరిగేంత వైశాల్యం వున్న గట్టి కల్లం విధిగా కావలసివుంది. అది లేకుంటే గింజలు తయారు చేసుకోవడం చాలా యిబ్బంది. తనకున్న రెండు సెంట్ల కల్లంలో కంకల గుండు తిరగదు. వామి వేసుకోను తరమైంది.

రంగారెడ్డికి భూమి వుంది. కాడి గిత్తలూ, రెండెనుములూ, సేద్యపు యీరముట్లూ, తాడూ తలుగూ, కాడెద్దుల సేద్యానికెన్ని వుండాల్నో అన్నీ వున్నాయి. ఒక విత్తనం గొర్రులేదు. గింజలు తయారు చేసుకోవడానికి గట్టి కల్లంలేదు. ఇది రంగారెడ్డికి ఒక సమస్య అయి కూచుంది. ప్రతి సంవత్సరం మాసూలు తయారు చేసుకొనేటప్పుడు ఎవరి కల్లంలోనో తయారు చేసుకోవాల. కల్లంలో వుసివుంటే వెంటనే తయారు చేసుకొని గింజలూ సెత్తా తీసుకొని రావాల్సిందే. ఏ కల్లంలోనో ఎప్పుడు తయారు చేసుకోవాల్నో తెలియనిస్థితి. కాపోనికి కల్లంలేకుంటే ఎట్లా అన్న దిగులు. యిల్లు ఎట్లున్నా కల్లం యిసురుగా వుండాలని ప్రతి కాపోడూ అనుకొంటాడు.

రంగారెడ్డి రైతు కష్టంలో ఆరితేరినోడు. తాళ్లూ తలుగులూ కావలసినవి స్వంతం తయారు చేసుకొంటాడు. పదెకరాల సేద్యమే అయినా అన్ని యారముట్లూ వుండాల్సిందే. ఎద్దులూ బండీ వుండాల్సిందే. అన్నీ వుంటేనే పని జరుగుతుంది. ఏయారముట్టు లేకున్నా తిరిపెం అడుక్కొని సేద్యానికి పోవాల లేకుంటే ఎద్దులను యింటికాడ గాటికి కట్టేసి శివుడా అని వూరక్కూచోవాల. ఆరు చెక్కలది విత్తనం గొర్రు మాత్రం తన హయాంలోనే చేయించుకొన్నాడు. దిండు కొయ్యా, నగలూ, గొర్రుకొయ్య చెక్కలూ, మొలలూ, అంకెన్లూ జడిగెం అన్నీ కర్చుతో కూడుకొన్నపని. డబ్బు పెట్టి కొనాల. ఒకటొకటే నాలుగైదేళ్లకు సంపాదించినాడు. వడ్ల బత్తునికి కూలిచ్చి ఎద్దులున్న యిండికాడబెట్టి స్వంతం వుండి విత్తనం గొర్రు తయారు చేయించుకొన్నాడు.

యారముట్లు తక్కువుంటే యాష్ట. సేద్యపు పనులు అనుకొన్నప్పుడు అనుకొన్నట్లు జరగవు. విత్తనం గొర్రుతోపని ఒకే ఒక రోజు అయినా అది లేకుంటే పని జరగదు. పదునారిపోకుండా విత్తనం వేయాల. అందుకే ఒంటికాడి వున్నవాడు తనకులేని యారముట్లున్నవానితో పోటీ కలుసుకొంటాడు. అంటే యిద్దరి పొలాలు ఆరిపోకతలికే సకాలంలో విత్తనం వేసుకుంటారు. పోటీలేకుంటావుంటే సాళ్ళు ఆరిపోతాయి. విత్తనంలో కాడి పోటీవుంటే ఒక

కాడి విత్తనం గొర్రుకు, ఒక కాడి సాళ్లు పాసే గుంటక్కూ సరిపోతాయి.

చిన్న రైతులకు యారముట్లు ఖర్చు ఎక్కువ. బండి, ఎద్దులూ అన్నియారముట్లూ వుంటేనే పని జరుగుతుంది. నూరు ఎకరాల భూమి వున్నవానికీ ఆయారముట్లే పది ఎకరాలున్నవానికీ ఆయారముట్లే. అందుకే ఒకరోజుకు పనికి తయ్యారయ్యే విత్తనం గొర్రు విధిగా చేయించుకోవాల్సి వచ్చింది. చిన్న రైతులు కర్చుల్లో నలిగిపోతారు. స్వంత సేద్యం అన్న ఒక తియ్యని వూహ తప్పితే ఏమీమిగలదు. రంగారెడ్డి సేద్యగాడు కాబట్టి కాడెద్దులకు సరిపోయే అన్ని యారముట్లూ సంపాదించుకొన్నాడు.

భూమిని పదునవుతూనే విత్తనం వేసుకొనేటట్లు తయారు చేసుకొంటాడు. సాధ్యమున్నంతా కూళ్ళు పెట్టకుండా పొలం పనులు చేసుకొనేందుకు చూస్తాడు. వీల్లేనప్పుడు కూళ్ళుపెట్టి పనులు చేయించుకొంటాడు. ఈశ్వరమ్మ రంగారెడ్డి అన్యోన్యంగా వుంటారు. మంచి దాంపత్యం. ఇద్దరూ ఎవరిపనివాళ్లు ఖచ్చితంగా చేసుకొంటారు. పని విభజనలో ఈశ్వరమ్మకే ఎక్కువ పని. మామూలు పనులు కాక పిల్లోల్లను చూచుకోవడం పాడెనుములపని చూచుకోవడం ఎక్కువ.

ఈశ్వరమ్మ రంగారెడ్డి కంటె ముందు లేస్తుంది. గాడి పాటలూడుస్తుంది. పొయ్యి బూడిద ఎత్తి యింట్లో పాసికసవు లూడుస్తుంది. బానలు కడిగి మొగున్ని లేపుతుంది. నీళ్ళకు పొమ్మని పురమాయించి మజ్జిగ చిలుకను మొదలు పెడుతుంది. నీళ్లు తెస్తూనే మజ్జిగ చిలికేది అయిపోతుంది. కుండలూ చట్లూ కడిగి పొయ్యి ముట్టిస్తుంది. సంగటికి ఎసరు పెడుతుంది. ఎసరు కాగుతున్నప్పుడు ఎనుముల కత చూస్తుంది. ఎనుములకు కడుగుపోసి నీళ్లు తాపి పాలు పిండుకొంటుంది. ఈలోగా ఎసరు సలసల కాగి వుంటుంది. ఎసట్లో నూకలు పోస్తుంది. యిసురురాయి పొందేసుకొని పిండి తయారు చేసుకొంటుంది. ఎప్పటికప్పుడు విసిరిన రాగిపిండితో చేస్తే సంగటి బాగుంటుంది. నూకలు మాత్రం జొన్నలుదంచి కడిగి ఆరబోసి నూకలుగా విసిరి నాలుగైదు రోజులకు తగ్గట్టుగా తయారు చేసుకొన్నా పరవాలేదు. రాగిపిండిని కూడా అట్లా తయారు

చేసుకోవచ్చు. అయినా సంగటి బాగుండదని అట్లా చేసుకోదు. నూకలుడుకుతానే పిండి పోస్తుంది. పిండి వుడికి నూకల్లో ఆవగిలినదాకా పొయ్యి వద్దనేకూచోని ఎంత మంటో అంతవుండేట్లు చేసుకొంటుంది. బాగా ఆవగిలిన తర్వాత తెడ్డుతో సంగటిని కెలుకుతుంది. ఉంటలు లేకుండా సంగటిని కెలకడం ఒకకళ. ఈశ్వరమ్మ చేసిన సంగటి మైనం మాదరి గట్టిగా కాకుండా అనుకుగా కాకుండా పక్వంగా వుంటుంది. సంగటిని బండమీద కుమ్మరించి ముద్దలు చేస్తుంది. ఈలోగా కూరకు కావలసినవి తయారు చేసుకొంటుంది. పొయ్యిలో వరిపొట్టో లేక నుగ్గులో వేసి మంట తగ్గించి పొయ్యిమీద పాలటిక పెడుతుంది. పాలమీద మీగడ దళసరిగా కట్టాలనే అట్లా చేస్తుంది. సన్నని సెగతో పొయిమీద పాలు కాగడంతో పొయ్యికాడ పని పూర్తి చేసుకొంటుంది. పళ్ళుతోముకొని మొగంకడుక్కుని పిల్లలను లేపుతుంది. మొగాలు కడుక్కోండని పురమాయిస్తుంది. పిల్లలకు అన్నాలు పెట్టి బోకీ బోలె కడిగి శుభ్రంగా ఎత్తి పెడుతుంది. పిల్లోన్ని బడికి పంపిస్తుంది. పిల్లను ఎనుములను తోలుకొని పొమ్మంటుంది. పుటికలో సంగటిని పెట్టుకొని, నీళ్లూ మజ్జిగతో సహా తీసుకొని పొలం కాడికి పోతుంది. ఇంతపనీ చేసి ఉదయం ఎనిమిది గంటలలోపల్నే పొలంకాడికి పోతుంది.

రంగారెడ్డి అప్పటికే రెండు గంటల పని చేసి సంగటికి ఎదురు చూస్తుంటాడు. ఈశ్వరమ్మను చూచి ఎద్దులు కూడా అనికాడతాపోతాయి. ఇంక నిలబెడుతాడులే అని. రంగారెడ్డీ ఈశ్వరమ్మ పొలంలోనే సంగటిని తింటారు. వెంటనే ఈశ్వరమ్మ యింటికి వచ్చి పాలు తోడంటువేసి, పాలటికను వుట్టిమీద పెట్టి గడ్డికి పోతుంది. ఒక గంటలో తోటకాడ గడ్డి పెరుక్కొని యింటికి వస్తుంది. అప్పటి కింకా ఎనుములూ, ఎద్దులూ, యింటికి వచ్చివుండవు. గింజలు చేసుకోవడం, దంచుకోవడం చేస్తుంది. రాత్రి అన్నానికి కొర్రలో ఆరికలోదంచి తయారుగా పెట్టుకొంటుంది. రాత్రిపూటల్లో సాధారణంగా సంగటి తినరు.

మధ్యాహ్నం కాడి యింటికొస్తుంది. ఎద్దుల్ని గాటకట్టేసి పొట్టా సొప్పా తెచ్చేందుకు పోతాడు మొగుడు. బయటున్న యారముట్లు సేద్యపుమోకు పగ్గాలు.

చౌలకాల, ముల్లుగట్టె, మేడితోక వగైరాలు ఈశ్వరమ్మ ఇంట్లో తెచ్చిపెట్టుతుంది. కాడికివున్న పట్టెండ్లు విప్పి, మట్టసంగ తాళ్లు ఎగగట్టి దోటీకి తగిలిస్తుంది. యారగట్టను దోటీకి తగిలిస్తుంది. యారగట్టంటే సేద్యపుమోకు, పగ్గాలూ, జల్లిబిల్ల ఉంటాయి. మూటినీ వార్నెలో వేసినపుడు మొత్తం యారగట్టంటారు.

రంగారెడ్డి ఎద్దులకు పొట్టుబోసి, కాళ్లూ మొగం కడుక్కొని, మల్లా సంగటి తిని తొక్కుడంకణంలో మంచం వేసుకొని పడుకొంటాడు. ఈశ్వరమ్మకు మాత్రం యింకా తీరిక దొరకదు. పిల్లోనికి బువ్వపెట్టి బడికి పంపుతుంది. ఎనుములకు మేతామెట్రా విచారించుకొంటుంది. ఎగాసగా పడే తలికి మళ్ళీ వంటపని సాయంత్రం గడ్డికి పోవడం వుంటుంది. రాత్రి తలమేపుకు, పిల్లను వెంట పెట్టుకొని గడ్డికి పోతుంది. సాధారణంగా పిల్లకు అంతగా పని చెప్పదు. రంగారెడ్డి సాయంత్రం పొట్టూ సొప్పా తెచ్చి, వామిదొడ్లో శుభ్రం చేసి నీల్లెత్తుకొచ్చి, యింకా పొద్దుంటే పాతవి తాళ్లూ తలుగులూ అతుక్కుంటూ సరిచేసుకొంటూ వుంటాడు. మరుసటి రోజుకు కావలసిన యారముట్లను తయారుగా పెట్టుకొంటాడు.

ఆలు మొగలకు ఎవ్వరితోనూ మాట్లాడేందుకు వీలుండదు. రాత్రిపూటల్లో ఆలుమొగలు ఏమి మాట్లాడుకొంటారో అంతే. వాళ్లపని కఠోర తపస్సుగా ఉంది. పదెకరాల మెట్ట సేద్యంలోనే బతుకులు వెల్లదీస్తున్నారు. ఉన్నంతలో యితరులకు యింతపెట్టి వాళ్ళూ తినేందుకే సరిపోతుంది.

ఈశ్వరమ్మ భూమమ్మతో సమానం అని అంటారు. ఎవరినీ ఎప్పుడూ కసురుకోదు. ఇసుగుపడదు. తనపనేమో తానేమో అంతే. కోడికూసినప్పుడు లేస్తేగాని వ్యవసాయప్పనులు జరగవు.

రంగారెడ్డికి మాత్రం గట్టి కల్లం సంపాదించుకోవాలని ఆలోచన. రొంత భూమికి పెదింత అట్టహాసం లేనిదే పని జరగదు. ఈశ్వరమ్మకు కూడా స్వంతం గట్టి కల్లం కావాలనివుంది. ప్రతి సంవత్సరం మాసూలు కాలంలో యాతన. యింతవరకూ ఎట్లో కాలం దొర్లింది. ఇప్పుడు పిల్ల పెళ్లీడుకొచ్చింది. పిల్లకు

పెళ్ళిచేయాలని ఇద్దరూ తలపోసుకొంటారు. పెళ్లి సంబంధాలకు వస్తున్నారు. దండిగా గట్టికల్లం వున్నవాళ్ళను చూచి అందులో అణాభాగమో రెండణాల భాగవెూ రాయించుకొనే ఏర్పాటుతో పిల్లను యివ్వాలనివున్నారు. మామూలుకంటే కట్నం కింద కొంత భూమిని ఎక్కువ యిచ్చి అయినా యీ సందర్భంలో గట్టి కల్లం సంపాదించాలని అనుకొంటున్నారు. పిల్లదీ బాగుంది. అందంగా పొందించినట్టుంది. యింకొకసారి చూడాలని బుద్ధి పుట్టేట్టుగా వుంది.

ఒక సంబంధం కుదిరింది. గట్టి కల్లంలో భాగం యిచ్చేట్లు మాట్లాడుకొన్నారు. కల్లం ఇచ్చేట్టుగా వుంటే కట్నం కింద ఒక ఎకరా భూమి అదనంగా రాయించాలని అన్నారు. సరేనన్నారు. సరిపోయింది. కల్లాన్ని సాకుబెట్టి కట్నం ఎక్కువ లాగేందుకు అన్ని విధాలా ప్రయత్నం జరిగింది. రెండెకరాల భూమి, రెండువేలు లెక్క ఇచ్చేటట్లు ఏర్పాటు చేసుకొన్నారు. ఒకటే పిల్లది. సొమ్ములు లేకుండా ఎట్లా అని ఈశ్వరమ్మ పోరు పెట్టింది. నాలుగు తులాలు బంగారు పెట్టినారు. పిల్లదానికి పెండ్లికొడుకు వాళ్లూ నాలుగు తులాలు పెట్టినారు. ఈశ్వరమ్మ సంతోషించింది. పెళ్లి ఘనంగానే చేసినారు. బీదా బిక్కికీ ఒకపూట అన్నం పెట్టినారు.

కడాకు రంగారెడ్డి గట్టికల్లాన్ని సంపాదించినాడు. రెండెకరాలు భూమి పోయింది. కట్నం కింద ఇచ్చిన లెక్క రెండు వేలతో కలసి మొత్తం ఖర్చు నాలుగు వేలయింది. నాలుగువేలూ అప్పుచేయాల్సి వచ్చింది. ఏమైనా గట్టికల్లంవుంది. మాసూలు తయారు చేసుకోవడానికి యిబ్బందిలేదు అన్న సంతోషంతో వున్నారు. పెళ్లి అయిపోయింది. తిరుగు మరుగులూ అయిపోయినాయి.

గట్టి కల్లంలో భాగం అంతమంచిదికాదు. మాసూలు తయారు చేసుకొనేటప్పుడు మాది ముందు మాది ముందు అనే తకరార్లు రావచ్చుననీ ఎవరెవరిది వాళ్ళ కుంటే బాగుంటుందనీ, అల్లుడూ వాళ్లు అనుకొన్నారు. గట్టి కల్లంలో భాగం వద్దులే. మాకల్లంలోనే మాసూలు తయారు చేసుకో. నీకేమి

యిబ్బంది వుందీ" అని అంటూ అల్లుని వాళ్లు సణుగుడు మొదలు పెట్టినారు. ఊరవతల బీడుకొనిస్తాలే అక్కడ గట్టి కల్లం తయారు చేసుకొందువు అని కూడా అన్నారు. మా కల్లం మాకు రాయించు. మన తర్వాత మన పిల్లోల్లు తకరారు పడకుండా వుంటుందని పోరు పెడుతున్నారు. రంగారెడ్డికిష్టం లేదు. ఒంటిగాడు. ఊరవతల కల్లం బాగుండదు అని అనుకొంటాడు. ఏం లాభం. అల్లుడూ ఆడబిడ్డ వాళ్ళ కోరిక ప్రకారమే పోవాల్సి వచ్చింది. ఎందరితో చెప్పినా "తకరార్లుంటాయి – మా కల్లం మాకు కావాల్సిందే. కావలిస్తే బీడు కొనిస్తాం" అని ఖచ్చితంగా చెప్పినారు. ఒప్పుకోకుంటే పిల్లను వాళ్లింట్లోనే విడిచిపెట్టేస్తాం అని బెదిరించినారు. చేసేదిలేక రంగారెడ్డి వాళ్ళ కల్లం వాళ్లకు రాయించినాడు.

జీవితంలో సాధించాలనుకొన్నది సాధించలేకపోయినాడు. ఇబ్బందిలో పడినాడు. గంతకు తగిన బొంత అని అనుకొంటే ఒక ఎకరా భూమి, రెండువేలు డబ్బు మిగిలివుండేది. ఒక ఎకరా భూమికే పిల్లను చేసుకొనిపోయేవాళ్లు ఆ వూరిలోనే వుండినారు. అంతా మించిపోయింది. బంధువులు ఒకొక్కప్పుడు బండలై కూర్చుంటారు. రెండు మూడేళ్లకే బాకీలోకి ఎకరా తోట బావికిందిది పోయింది. ఎనిమిది ఎకరాల్లో వచ్చే ఆదాయం చాల్లేదు. పిల్లదాని నడతపడతలకు ఎట్లాయినా అంతో ఇంతో అప్పు చేయాల్సి వచ్చింది. బాడుగ బండ్లుతోలి కొన్నాళ్ళు కాలం దొర్లించినాడు రంగారెడ్డి.

ఈశ్వరమ్మకు దిగులెక్కువయింది. ముందున్న శక్తి ఇప్పుడు లేదు. అంగబలం అర్థబలం లేదు. వ్యవసాయం కట్టిపెట్టాల్సి వచ్చింది. భూమిని కోరుకిచ్చి ఎద్దుల్ను అమ్మి బాకీకి కట్టినాడు. యింకా సిలుకుంది. ఊరక కుర్చోలేడు. ఎవరికన్నా పనికి పోవాలంటే పోలేడు. పిల్లోన్ని చదువు మాన్పించినాడు. పిల్లోడు పనికి ఎదిగేసరికి వ్యవసాయం ఎగబెట్టాల్సి వచ్చింది. వాన్ని కూలికి పంపించలేడు. గొప్పలకు పోయేవాళ్ళు కూడా కాదు. వ్యవసాయం పట్టుగా సాగించాలనే తాపత్రయంతోనే ఇన్నాల్లూ బతికినారు.

రంగారెడ్డి మానసికంగా కుంగిపోయాడు. ఈశ్వరమ్మ దిగులుతో అనారోగ్యం పాలయింది. మంచమెక్కింది. ఈశ్వరమ్మకు రంగారెడ్డికి పిల్లోనికి అన్ని వసతులు కలిగించాలనే. అనుకొన్నట్లు నెరవేరలేదు. నిర్దాక్షిణ్యంగా కట్నం రాబట్టడం గట్టికల్లంలో భాగం ఇవ్వకపోవడం లాంటి ఘటనలు జరిగినాయి. అయినా అల్లుడూ ఆడబిడ్డ ఎట్లా పోనీ వాల్లయినా బాగుండారు అని అనుకొంటారు. కానీ వాళ్ళకు జరుగుబాటు లేకుండా పోయింది.

అప్పుడింతా అప్పుడింతా అల్లునిదెగ్గర తెచ్చుకొన్న డబ్బుకు కొంత భూమి పోయింది. నోరులేనివాడు. నోరులేనివానికి వూరుండదు. పిల్లోడు కూలికిపోక తప్పలేదు. అల్లుడూ వాళ్ళ సేద్యపు పనులకు పోతూ వుంటాడు.

రంగారెడ్డి యారముట్లన్నీ అల్లుడూవాళ్ళు ఉపయోగించుకొంటున్నారు. యారముట్లు అమ్మలేకపోయినాడు. వాళ్ళ బాధ ఎవరితో చెప్పుకొంటారు. ఈశ్వరమ్మ జబ్బు ఎక్కువయింది. మందు మాకులు సరిగా తీసుకోక పునిస్త్రీగా మంచిదనిపించుకొని చచ్చిపోయింది. చనిపోయేముందు ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది. అల్లుడూ ఆడబిడ్డ పిల్లోడూ, మొగుడూ ఉన్నారు. ఆమె ఎవరిదిక్కూ చూడలేదు. పిల్లోని దిక్కూ గాడిపాట గోడకు ఆనించిన గొర్రుదిండు దిక్కూ ఒకటి రెండు సార్లు చూచింది. కళ్ళు మూసింది.

# దీనికంతెక్కడా.....

ఆస్తి అంతా కరిగిపోయింది. ఎట్లపోయిందో పోయింది. ఏమి చెప్పాల్నో ఎట్లా చెప్పాల్నో అర్థమేకాలేదు. కొండంత సంసారం కూలిపోయింది. కూటికి కూలికి పోవాల్సినపని పడింది. జీవితంలో సంపాదించలేకపోయినా పిత్రార్జితాన్ని కూడా నిలుపుకోలేక పోయినాడు కొండారెడ్డి. వావులు వావులుపోసి దంచినట్లయింది. పెద్దోడుగా చలామని అయి క్రమేనా సన్నోడుగా అయిపోయినాడు. పూలమ్మిన వూర్లో కట్టెలమ్మలేడు. పోగా చిక్కినది అమ్ముకోని టౌను చేరితే ఎట్లబతికినా బతకవచ్చు. కొంత డబ్బుతో ఎట్లబ్బా బతికేది – అని ఆసోదులేకుండా ఆలోచిస్తున్నాడు కొండారెడ్డి.

కొండారెడ్డి పిత్రార్జితం – లంకంతయిల్లు – కల్లం – ఇంటిముందు జాగా – కాడెద్దుల సేద్యానికి అన్ని యారముట్లూ – యాభై ఎకరాలు మంచి రేగడిగడ్డలూ.

కొండారెడ్డి తండ్రి పెట్టుపోతల్లో పేరుపోయినాడు. ధారాళమైనవాడు. వొంటి ఆస్తి కాబట్టి కావలసినంత పండించుకొంటూ దర్జాగానే బతికినాడు.

ఆయన కాలంలో వూరితగరార్లల్లోనో, కరువు కాటకాల్లోనో – ఐదువేలు అప్పు చేసి పోయినాడు. అంతభూమిలో ఐదువేలబాకీ – తీర్చుకోలేడా – అని – కొడుకు కొండారెడ్డి సుఖంగానే బతుకుతాడులే – అని తృప్తిగా చచ్చిపోయినాడు.

కొండారెడ్డి యింటి పెద్దగా ఐదువేల అప్పుతో మిగిలినాడు. ఆస్తిపాస్తులు వున్నవాడు. పాత కుటుంబ వాసనలతో – పరువు ప్రతిష్టలతో – సంసారం మొదలు పెట్టినాడు.

కొండారెడ్డికి భార్యాముగ్గురు పిల్లలున్నారు. అమ్మ వుంది. ముగ్గురు పిల్లలు ఇంకా ఎత్తు తెలియనోళ్ళు. ఇద్దరు మొగపిల్లలూ – ఒక ఆడపిల్ల. మొగపిల్లోళ్ళకు బడికిపోయే వయస్సు. ఆడపిల్లకు ఇంకా బడివయస్సు రాలేదు. కొండారెడ్డి

అమ్మ ఇంకా పొలం మీద పనుల్ని అజమాయిషీ చేయించేస్థితిలో వుంది. ఆమె కూలోళ్ళ వెంట పొలంమీదికి పోతూ వుంటుంది. భార్యమాత్రం పొలంమీది పనులకు పోలేదు. ఆమెకు ఇంట్లోనే సరిపోతుంది. వంటావార్పు – పిల్లోల్లను చూచుకోవడం – పాడెనుములను చూచుకోవడమే సరిపోతుంది. సేద్యానికి వొక సేద్యగాన్ని జీతానికి పెట్టుకొన్నాడు. చిల్లర పనులకు చిన్న జీతగాన్ని పెట్టుకొన్నాడు. వాళ్ళ నాయన మాదిరే కొండారెడ్డి కూడా ముప్పై ఎకరాల్లో గింజపైర్లూ, ఇరవై ఎకరాల్లో డబ్బు పైర్లూ పెట్టుకొంటాడు. ఎటొచ్చీ నాలుగు ఐదువేలు డబ్బూ పదిపుట్ల గింజలూ – అతని సంసారానికి కావాలి. లేకుంటే సంసారం జరగదు. అతని ఆస్తి విలుకట్టి ఆలోచిస్తే చిన్నదేం కాదు. పెద్ద ఆస్తిలోకే లెక్క.

ఇష్టము వచ్చినప్పుడు – ఇష్టమువచ్చినట్లు పడే వర్షాల్లో ఏదీ అనుకొన్నట్లు జరగడం లేదు. ఖర్చుమాత్రం ఇష్టమున్నా లేకున్నా ఒకటే. అది అయ్యే తీరుతుంది. అందరూ బువ్వతినాలి. బట్టకట్టాలి. అయిదువేల బాకీకి వొడ్డీరూకలు ఎల్లాల. బువ్వ తినకుండా, బట్ట కట్టకుండా వొడ్డీరూకలు చెల్లించలేడు. అందుకే వొడ్డీలు కట్టి అసలు తీర్చే ప్లానులో ఏడెనిమిది ఏళ్ళు మునాసగా కృషి సాగించినాడు.

కొండారెడ్డి కృషిలో గట్టివాడు. మూడేళ్ళకొకసారి ఎరువూ మట్టి కలిపి అన్ని చేన్లకూ – తోలి – సతవెక్కిస్తాడు. సేద్యాలు చక్కగా చేస్తాడు. గడ్డీగాదం చేలల్లో వుండకుండా చేస్తాడు. ఈతపోకుండా పైరు వడుపుకొంటాడు. అలుపులేకుండా దీక్షతో పని చేసినా వొడ్డీలు కట్టలేకపోయినాడు. కారణం యీమధ్యలో మూడు కరువులొచ్చినాయి. అదను తప్పితే వర్షాలు వచ్చినా కరువుగానే వుంటుంది. పావలా పంటయితే కరువు. అర్థపంట పండితే సేద్యపు ఖర్చులొస్తాయి. ముప్పావలా పంట పండితే కొద్దిగా వెసులుబాటుంటుంది. వొడ్డీలు ధారాళంగా కట్టవచ్చు. పూర్తి పంట పండితే అసలులోకి చెల్లు పెట్టవచ్చు. అందుకే వొడ్డీలు సరిగా కట్టలేకపోగా మూడుకరువుల్లో మూడువేలు అప్పు అయింది. బాగా

పండిన సంవత్సరాల్లో వొడ్డీలు కట్టినాడు, ఏం లాభం – యింతా చేసి – అప్పు ఎనిమిది వేలయి కూర్చుంది. మూడు కరువులూ ముచ్చైన గుంతలో గుద్దిపోయినాయి.

ఈ లోపల పిల్లది ఎదిగి కూర్చుంది. అతడూ అతని జీతగాళ్ళూ అతని అమ్మా – భార్యా – అప్పుడప్పుడు పిల్లోల్లూ – అందరూ చేయవలసినంత చేసినారు. అయితేనేం ఆడపిల్లతోపాటే అప్పు పెరిగింది. పెరిగిన అప్పునూ పెద్దదయిన బిడ్డనూ చూచి కొండారెడ్డి జంకినాడు. పిల్లదానికి పెళ్ళి చేయాలి. ఎట్ల అయినా నాలుగయిదువేలు డబ్బూ నాలుగయిదు ఎకరాల పొలమూ పోతుంది తప్పదు. ఎట్లరా భగవంతుడా అని లోపల్లోపల బాధపడినాడు.

ఎదిగిన పిల్లదాని పెళ్ళి నిలిపేందుక్కాదు. సరికాపోల్లల్లో – యాభై ఎకరాల ఆసామికి – ఎదిగిన పిల్లదాన్ని యింట్లో పెట్టుకోవడం పరువునష్టం. వెలిగడ భూముల్లో ఏమొస్తుంది. మెట్ట సేద్యంలో భూములు పెరగవు. అప్పులు పెరుగుతాయి. "చేను చేసినోడు చెడేది లేదు – మడి చేసినోడు మనేది లేదు" అన్న సామెత ఎట్ల వచ్చిందో అని అనుకొంటాడు కొండారెడ్డి. అతనికి అంతుపట్టలేదు. మామూలు తిండి తిన్నాడు. మామూలు బట్ట కట్టినాడు. జంబంగా ఎప్పుడూ పోలేదు. ఎంతోమంది ఎలియనాయాండ్లు బాగా బతుకుతున్నారు. నేనెందుకు అప్పుల్లో కూరుకుని పోతున్నానో అని కుములు కొంటున్నాడు.

ఊర్లోనే గంతకు తగిన బొంత అన్నట్లు దగ్గర సంబంధాన్ని చూచి పిల్లదాని పెళ్ళి చేసినాడు. ఉపాయంగా సంబంధం కుదిరించుకొన్నాడని కూడా అందరూ అన్నారు. అయినా కొంత భూమి కట్నం కింద రాయించింది పోవడమేకాక నాలుగువేలు అప్పు అయింది. అప్పు పదివేలు దాటింది. చెప్పాల్సివస్తే అల్లుడు వాళ్ళు కొండారెడ్డి కంటే ఆస్తిలో కొంచెం ఎక్కువవారే. కొండారెడ్డికి నలభై ఎకరాల భూమి మిగిలింది. పది పన్నెండు వేలు అప్పు నిలిచింది. లేకుంటే తనేం చేసినట్లు అని తీవ్రంగా ఆలోచించినాడు.

పది ఎకరాల భూమిలో చీనీచెట్లు వేయాలనుకొన్నాడు. చీనీచెట్లు వేస్తే బాకీలు తీరుతాయని – పైగా భూమి విలువ పెరుగుతుందని అనుకొన్నాడు. నానా యిబ్బందుల్లో బావి త్రవ్వించేందుకు అప్పు పుట్టించుకొన్నాడు. ఎండాకాలంలో మూడునెలల్లో బావితవ్వించినాడు. బావి కూడా కాలానికి పది ఎకరాలకు సరిపోయేట్లు – యిసురుగా త్రవ్వించినాడు. బావికి పదివేలయింది. బావికి యింజను వేసినాడు. ఉద్దులూ, కాలువలూ చక్కగా కట్టించినాడు.

తూగించలేనేమోనని అయిదు ఎకరాల్లోనే చీనీచెట్లు నాటినాడు. మిగతా ఐదు ఎకరాల్లో వానకాలం – తక్కువ నీళ్ళతో పండే పైర్లు పెట్టుతూ వచ్చినాడు. చీనీచెట్లు పెరుగుతున్నాయి. అప్పు పెరుగుతూ వుంది. చీనీచెట్లు – బావి – మిగతా బావికింద భూమీ లక్షరూపాయలు విలువ చేస్తుందని అనుకొంటు వుంటాడు. ఎంత బాకీ అయితేనేం తోట కాపుకాస్తే బాకీ వూపితే పోతుందిలే అన్న ధీమా.

చీనీచెట్లు మొదటిసారిగా కాపు వచ్చినాయి. పలగాపు. అప్పటికి అప్పు ముప్ఫై వేలు దాటింది. ఆస్తివుందిలే అని అప్పులోల్లు బాండ్లు ఎత్తిరాయించుకొంటున్నారు. వొడ్డీ మొదలూ కలుస్తూ వుంది. బావిలో నీళ్ళు తక్కువ వస్తున్నాయి. చెట్లు పెద్దవవుతున్నాయి. బావిని లోతు చేయడమా – లేక – బోరింగు వేయడమా – అని తీవ్రంగా ఆలోచించినాడు. ఎందుకైనా మంచిది. యింకో రెండుమట్లు లోతు చేస్తే బాగుంటుందని రెండు మట్లు లోతు కొట్టించినాడు. మళ్ళీ రెండు వేలు అప్పుయింది. పెరుగుతూన్న అప్పులకు భయపడుతూనే – చీనీచెట్లు ఎదిగినాయిలే – అని ధీమాగానే వుండినాడు.

తొలి కాపు మలికాపు అంతంత మాత్రంగానే వచ్చింది. మూడో కాపు వచ్చేతలికే మాన్లయినాయి చెట్లు. సతవలు ఎక్కువ నీళ్ళూ ఏమరకుండా వేసినాడు. తోట ఆశ్చర్యపడేట్టుగా వుంది. ఇంజనుకు వుసేలేదు. ఎద్దులకూ వుసిలేదు. మనుష్యులకు చెప్పాల్సిన పనేలేదు. అందరూ చెట్లమీద ఆధారపడినారు. అదే సమయంలో బావిలో మళ్ళీ నీళ్ళు తగ్గుతున్నాయి.

ఎడపిల్లోడు పాలు తాగినట్లుంది. ఎప్పుడూ ఇంజను ఆడుతూనే వుంటుంది. బావిలో వూటలు ఆరిపోయినాయి. మామూలుగా నీళ్ళూరడంలేదు. మళ్ళీ ఒకమట్టు కొట్టించినాడు. తెగించి బోరింగు కూడా వేయించినాడు. యెట్లనో చెట్లను బతికించుకొన్నాడు. నీళ్ళులేని కృషి కృషేకాదని బాధపడినాడు. ఏమైతేనేం చెట్లను బతికించుకోవడములోనే అతని పని సరిపోయింది యిన్నాళ్ళూ. కాపుగా సేదెప్పుడూ. బాకీలు తీరేదెప్పుడూ అన్న ఆలోచన్లు బాకీలిచ్చినోళ్ళకు కలిగింది. అయినా పోరాడుతున్నాడు. చెడ్డపని చేయలేదు – ఆస్తి విలువను పెంచినాడు అని అనుకొన్నారు.

మొగపిల్లోల్లకు పెళ్ళి చేయాలని అనుకొన్నాడు. అప్పులకు చీనీతోట సరిపోతుంది. మిగిలేది నిస్సారమైన ముప్పై ఎకరాల భూమేకదా వుండేది అని యితరులు అనుకోడం మొదలు పెట్టినారు.

ఈ ఊపులోనే పెళ్ళిళ్ళన్నా చేస్తామని ఇద్దరి కొడుకులకూ పెళ్ళిళ్ళు ఘనంగా ఖర్చుపెట్టి చేసినాడు. పెళ్ళిళ్ళు అయిపోయినాక చూచుకొంటే అప్పు నలభైవేలకు మించింది. కోడళ్ళు కాపరానికొచ్చినారు. ఖర్చు ఎక్కువయింది. సేద్యపు ఖర్చులూ ఎక్కువైనాయి. నెలకు రెండువేలు ఖర్చు అవుతుంది. సంవత్సరానికి ముప్పైవేలు ఆదాయం తగ్గకుండా రావాలి. లేకుంటే మళ్ళీ బాకీ పెరుగుతుంది. అట్లా రెండేళ్ళు చూచినాడు కుదరలేదు. చీనీతోట బేరం పెట్టాల్సి వచ్చింది. అదీకాక కోడళ్ళకు సరిపోక వేర్లు పోవాలని అనుకొంటున్నారు.

కొండారెడ్డికి దిక్కు తెలియలేదు. ఆలోచిస్తాడు. చిరాకు పడతాడు. అప్పు హనుమంతుని తోకమాదిరి పెరుగుతూ వుంది. గుఱ్ఱానికైనా అలుపూ సలుపూ వుంటుంది. వొడ్డీకి వుండదు. అలుపు లేదు సలుపు లేదు. నిలిచి నీళ్లైనాతాగదు. పగలూ లేదు. రాత్రి లేదు. పరిగెత్తింది పరిగెత్తిందే – ఎట్లబ్బా అని అనుకొన్నాడు.

దిక్కు తెలియని స్థితిలో చీనీతోట అమ్మడానికే నిశ్చయించుకొన్నాడు. అమ్మాలంటే – అందులో అప్పులోకి – ధర పలకదు. వేరే వాడు అంత డబ్బు పెట్టికొనలేడు. ఎట్లనో భయపడి బాకీలు తీర్తాయని నలభైవేల రూపాయలకు

చీనీతోటను అమ్మినాడు. బాకీలు కట్టినాడు. ఇంకా ఐదువేలుంది. ఋణశేషం మంచిది కాదు. అది తింటుందని బావికిందవున్న అయిదెకరాలు బాకీలోల్లకే ధరకట్టి పూర్తిగా బాకీలు కట్టేసినాడు. ఆ దినం అంతా వూరంతా అబగుబలుగానే వుండింది. ఏ గోడకిందకి పోయినా – కొండారెడ్డి బాకీలు – చీనీతోట అమ్మకం గురించి మాట్లాడు కొంటున్నారు. చాలా మంది అభిప్రాయంలో షావుకార్లకు మేలు జరిగింది. చీనీతోట – వృద్ధిలోకి వచ్చిన చెట్లు అని అనుకొన్నారు. ఎట్లయితేనేం కొండారెడ్డి రుణవిముక్తుడైనాడు.

మిగిలింది ముప్పై ఎకరాల భూమి – ఇల్లు – కల్లం. దాదాపు 20 సంవత్సరాలు ఎగచెక్కిన వల్లె దించకుండా కష్టం చేసి గూడా పదెకరాలు భూమిని పోగొట్టుకొన్నాడు. మిగిలిన ముప్పై ఎకరాలను అలక్ష్యం చేసి నిస్సారమైనదిగా చేసుకొని – వాటి విలువ తగ్గేట్లు చేసుకొన్నాడు. జీవితంలో అయిదువేలు బాకీ నలభైవేలకు పెరిగి రొమ్ముల కుంపటిగా మారి భూమిని మింగేసింది. కొండారెడ్డిని అకాలంగా ముసలివాణ్ణి చేసింది.

కొడుకు యాతన చూడలేక తల్లిమంచమెక్కింది. మనవండ్లకు బాకీలేకుండా పోయింది. బతకలేకుండా పోతారా అని ప్రాణమిడిసింది పాపం.

అనుభవాలపుట్టగా కొండారెడ్డి అప్పుల్లో మునిగీతేలినాడు. ఆయన అనుభవాలు కొడుకులకు పనికిరావు. వారు వాళ్ళ బతుకుల కోసం కొత్త అనుభవాలు పొందాల్సి వుంది. కొండారెడ్డికి తెలిసినదంతా కృషిలో నీళ్ళు లేని ప్రదేశాల్లో నష్టం అని. ఆ మాట ఏ కొడుక్కి చెపుతాడు. పద్దైదు ఎకరాల్లో ఏ కొడుకు బాగుపడ్తాడు. పిల్లోల్లనైనా సరిగా సాకుతారా అని కొండారెడ్డి దిగులు.

పెద్దకొడుకు భాగం పంచియిమ్మన్నప్పుడు ఎంతబాధ పడినాడో పాపం. ఏం చేస్తాడు. పంపకాలు వేసినాడు. తనకూ తన భార్యకూ అయిదెకరాలు జీవనానికి తీసుకొని మిగతా ఇరవైఐదెకరాలు సమానంగా పంచినాడు. ఇల్లూ కల్లం సెరర్ధం చేసినాడు.

పెద్దోడు యిల్లు నాకొద్దు ధరకట్టి అర్థానికి వచ్చే డబ్బు యివ్వాలన్నాడు లేదా భూమైనా యిమ్మన్నాడు. ఎంత చెప్పినా వినక తెగేసి చెప్పినాడు. "నేను ఈరోంత భూమిలో సేద్యం చేసి బతకలేను. భూమి అమ్ముకొనిపోయి టౌను చేరుకొంటాను" అని అన్నాడు. ఇంతకూ పెద్దోని ఆలోచన సబబైందేనని అంటే చిన్నోడు ఒప్పుకోడు. "ఇంటిలెక్కలోకి భూమిపోతుంది నేనెట్లా బతికేది" అని అంటాడు. ఎట్లో ఒప్పించినారు. రెండున్నర ఎకరా భూమికి యింటిని వరతట్టి పెద్దోనికి అంతా భూమినే యిచ్చినారు. యారముట్లూ ఎద్దులూ – కొద్దో గొప్పో వున్న బంగారం – అన్నీ విడిచిపెట్టి – కనిష్ట భాగం కోరులో – టౌను చేరుకొన్నాడు. అమ్మకంలో ధర తక్కువే పలికింది. ఎప్పుడెప్పుడు నరకకూపం నుండి బయటపడేది – అని 15 ఎకరాలను ఇరవైవేలకు అమ్మినాడు. టౌనులో వ్యాపారం చేయలేక డబ్బును వొడ్డీలకు తిప్పుకుంటూ లాభనష్టాలకు సిద్ధపడి జీవితాన్ని నెట్టుకొని వస్తున్నాడు పెద్దోడు.

చిన్నోనికీ 15 ఎకరాలు వుంది – తల్లిదండ్రుల జీవనం భూమిలో అంతమంది ఎట్ల బతుకుతారు. తల్లి తండ్రీ పరువుగా బతికినోళ్ళు. కూలికి పోలేరు. చిన్నోనికి అది అప్పుడప్పుడూ మెదులుతుంది. ఏం చేసేందుకూ పెట్టుబడి లేదు. వర్షాలొస్తే తిండి గింజలు పండుతే పండుతాయి – లేదా అప్పు చేయాలి. అప్పులంటే కొండారెడ్డికి భయం జీవితమంతా అప్పుల్లో మునిగితేలినాడు. వొడ్డీల పరుగు పందెం చూచినాడు. చిన్నకొడుకును గురించి విపరీతంగా ఆలోచిస్తున్నాడు. పాపం ఏం పాలుపోలేదు. పెద్దోని సంగతి అప్పుడప్పుడు విచారిస్తాడు. "వొడ్డీలు రాబట్టడంలో కఠినంగా వుండు" లేకుంటే అసలుకే ముప్పు వస్తుందని సలహా యిస్తాడు.

చిన్నోన్నీ ఆ మాదిరిగానే చేస్తామని అనుకొంటాడు. టౌను చేరితేగాని బతకలేడని అనుకొంటాడు. ఇద్దరు కొడుకులకూ తలా ముగ్గురు పిల్లోల్లయినారు. టౌనుకుపోతే పిల్లోల్లకు సదువులైనా వస్తాయని అనుకొంటాడు. ఏమీ చేయలేని స్థితి. ఇంటికి ధర రాదు. చిన్నోనికి డబ్బు తక్కువ వస్తుంది. వచ్చినంతలో

మమ్మల్ని పోషించలేడు. జీవనానికిచ్చిన భూమి అమ్మితే పెద్దోడు డబ్బు అర్థం కావాలంటాడు. యిస్తే పోతుందిలే అని అనుకొంటే ఇంటికి ధర రాదు. అది చిన్నోనికి నష్టం వేర్లుపోయేటప్పుడు విలువ కట్టినంత రాదు. యిదీ కొండారెడ్డి చింత. ఇంతకూ కొండారెడ్డి ఆ వూర్లో జీవించలేడు. బాకీల్లో వుండినా పరువుగా బతికినాడు. ఏమైనా వూర్లల్లో తంపులకు – రంపులకు – సన్నాసిపరులు తట్టుకోలేరు. టౌను చేరడమే ఉత్తమమని అనుకొంటున్నాడు.

చిన్నోన్ని అడిగినాడు. “ఏరా పదామా” అని. “టౌనులో ఏం చేస్తాం బతకలేం” అని అంటాడు చిన్నోడు. ఊర్లో వుండడానికే సహించలేదు కొండారెడ్డికి. పెద్దోడు పెద్ద సముద్రంలోపడి యీదుతున్నాడు. అందరికీ తెల్లపుల్లగా కనపడుతున్నాడు. సంపాదంచినట్లు అగుపడుతున్నాడు. పిల్లోల్లను హైస్కూల్లో చేర్పించినాడు. పెద్దోడే తెలివి పరుడు వాడు పైకి వస్తాడని కొండారెడ్డి ఆశ. చిన్నోడు ఉండూర్లో ఉంటే చెడిపోతాడనీ, చేతలకు చిక్కడనీ – వున్న భూమి పోగొట్టుకొంటాడనీ అనుకొని చిన్నోన్ని గట్టిగా మందలించినాడు. “ఏమైనా టౌనులోనే బతుకుతాం యింక ఈ వూర్లో బతకలేం” అని అంటే నేను రాను. నీ యిష్టం నీ అయిదెకరాలు అమ్ముకొనిపో. ఈ భూమిలో సంసారం జరక్కపోతే కూలికైనా పోతాను, కానీ వడ్డీ వ్యాపారం మాత్రం చేయను అని అన్నాడు చిన్నోడు. “డబ్బు కరగతినకుండా నీ యిష్టం వచ్చినపని చేసుకో – ఈ వూర్లో వుండలేంరా చిన్నా” అని ప్రాధేయపడినాడు కొండారెడ్డి.

పాపం వూరు విడిచిపెట్టేటప్పుడు ఎంతగా విలవిల్లాడినాడో కొండారెడ్డి. మళ్ళీ కత మొదలైంది.

# ఇంకానా....

"ఒరే నారిగా దిగులుపడితే ఎట్లరా. పని జరగాల, మనమేం తప్పు చేసినాం. దొంగతనం చేసినామా. కష్టం చేసుకొని బతకేవాళ్ళకు భయం దేనికిరా. లెయ్ – మొగం కడుక్కొ. ఈ దినం అటో యిటో తేలిపోతుందిలే. మొగోని మాదిరి వుండర్రా సచ్చిన్నాయాలా, మేమంతా వుండగా నీకేంరా" అని అన్నాడు నాగన్న.

"ఎందుకన్నా టౌనులోకి ఖర్చులు దండగ. మనకు పలుకుతారా పెడతారా? మనచేతనయితే మనమే కొట్టాల లేకుంటే వూరక చచ్చిండాల" అని కొంచెం కసిగా అన్నాడు నారిగాడు.

"మనం కొట్టేదెందుకురా మనల్ని కొట్టకుండా వుండేందుకురా యీపవంతా. నీకు తెలియదులేరా. ఇప్పుడెట్లుందనుకొన్నావు. ఇన్నాళ్ళ మాదిరికాదురా. కేసులు పెట్టుకోవచ్చు. అరెస్టు చేయించవచ్చు. తప్పుతప్పే అని ఎంతమంది అంటుండారని. వాళ్ళంతా వుండార్రా. కులస్తుల్ని తప్పు పట్టకూడదని యింతకుముందు కాలాల్లో వుండేది. ఇప్పుడు కాదు. ఆస్తులున్నోళ్ళు తప్పులు చేస్తారు. మిడిమేలంగా పోతారు. దర్పంతో జరుపుకోవాలని చూస్తారు. అదంతా తల్లకిందలైందిరా. చెప్తేవినవే. వూరువూరంతా మన్ని తప్పుపట్టడం లేదు. లోలోపల వాళ్ళసాయం వుంటుందిలేరా. పైగా టౌన్లో పేదోళ్ళ మీద అభిమానం వున్నోళ్ళు చాలా మంది వుండారు. న్యాయంగా వుండాల – న్యాయంగా కూలి ఇవ్వాల – కూలికి రాకుంటే కొట్టేందుకు – కొట్టికూలికి యీడ్చుకొనిపోయే యవారం పోవాలని ఎప్పుడూ పోరాడుతుండేవాళ్ళు వున్నార్రా యెర్రిమొగమా" అని నారిగానికి ధైర్యం చెప్పినాడు నాగన్న".

"మనం పోతుంటే కొట్టినోళ్ళూ, వాళ్ళ బంధువులూ కళ్ళు పులపొడిచి చూస్తున్నారు చూడ్రా. ఎంచేస్తారు. కేసు రిజిస్టరు చేసుకొన్నారు. పోలీసోళ్ళు వాళ్ళను అరెస్టు చేసి బేలు మీద విడిచిపెట్టినారు. ఏదో ఒకటి తేలుతుందిలేరా" అని అన్నాడు నాగన్న.

నారిగానికి బయంపోలా – బితుకుబితుగ్గా నడుస్తున్నాడు. "డాక్టరు సర్టిపికెట్టు ఎట్లిచ్చినాడంట" – అని నారిగాడే అడిగినాడు.

"ఎట్లిస్తేఏంరా. కొట్టినారని యిచ్చినాడు. కొట్టింది నిజమేకదా! పోలీసోళ్ళనో, సదువుకొన్నోళ్ళనో అడిగితే అంతా వివరంగా చెప్పుతారు. ఒకరితో పనేంరా. మనమంతా ఒకటిగా వుండాలి. ఎవరొచ్చినా ఎదురుకొందాం. అన్యాయంగా కొడ్తావుంటే ఎన్నాళ్ళిట్లా బతకాలి" అని అన్నాడు నాగన్న.

"అదిగాదన్నా. నాగిరెడ్డికి బాకీవున్నాను. ఏడెనిమిదేళ్ళయింది. ఆ బాకీ తీరలేదు. బాకీ చెయ్యకూడదని అనుకొంటే ఏం లాభం. పనికి రమ్మంటే పోలేదు. ఎక్కువ కూలీ వచ్చేదుంటే పోయినాను. అదీ ఆయన బాకీ తీర్చాలనే పట్టుదల. కంకర లారీకి పోయినాను. వాళ్ళు కూలి ఎక్కువిస్తారు. ఒక నెలపాటు వరసగా లారీపనికిపోతే నాగిరెడ్డి బాకీ తీరుతుందని అనుకొన్నాను. అంటే మధ్యమధ్యలో ఇతర పనికిపోతే లారీ వాళ్ళు రానీరు. ఎక్కువ కూలిపోతుంది. నాగిరెడ్డి బాకీ తీర్చలేను. ఆయనకియ్యాల్సింది నిజమే. ఆయన పనికి పోతే రెండు రూపాయలకంటే ఎక్కువ చెల్లేసుకోడు. ఎక్కడ చచ్చేది. "బాకీ వున్నాక పనికిపోకుంటే ఎట్లరా" అని కొంతమంది అంటారు. ఏమన్నా అంటే "నీ యిబ్బందుల్లో మేముండాలి – మా యిబ్బందుల్లో మీరుండుకూడదు. ఇదేం న్యాయంరా" అని అంటాడు రెడ్డి. అప్పు చేయకుండా బతికేదెట్లా? పిల్లదాని పెళ్ళికి బాకీ చేయాల్సి వచ్చింది. నా సంగతి నీకు తెలియదా – పెళ్ళిలో బిగబట్టుకొని ఖర్చు చేసినాను. మొత్తం పెళ్ళి రెండువందల్లో చేసినాను. అదీ వచ్చేపోయేవాళ్ళకు తిండికే ఖర్చయింది. పిల్లకు కాళ్ళ గొలుసులు కూడా తీయించలేదు. "వడ్డానం లేకుంటే బాగుండదు పెడదాం" అని పోరింది నా పెళ్ళాం. దానికేం తెలుస్తాది ఇట్లుంటాదని. నేనూ నా పెళ్ళాం కష్టపడి పనిచేసినాం. మాకు సంగటికిపోనూ నాగిరెడ్డి బాకీకి అసల్లోకి చెల్లు పడనేలేదు. వొడ్డి వేసుకొంటాడు. కూలి తక్కువ ఇస్తాడు. అంతా వొడ్డీలోకే సరిపోతుంది. ఇంకెట్ల తీరుతుంది. తీర్చలేనని ఎక్కువకూలిచ్చే లారీపనికి పోవాలని

ఒప్పుకొన్నాను. అక్కడికీ నా పెళ్ళాం ఆయనపనికే పోతూ వుంటుంది. బాకీ తీర్చనీడే ఎట్లబ్బా" అని వూపిరి ఎగపీలుస్తూ నొప్పిగా మాట్లాడినాడు నారిగాడు.

"అంతేరా వాళ్ళకు బాకీ తీర్చేది ముఖ్యం కాదు. పనికొచ్చేది ముఖ్యం. అందులో కూలి తక్కువకు వచ్చేది మరీ ముఖ్యం, అట్లయితేనే వాళ్లకు బాగా పని జరుగుతుంది. పంటల్లో బాగా లాభాలు వస్తాయి. అందువల్లనే మనబోటివాళ్ళకు బాకీలు ఇచ్చి ఇరికించుకొంటారు. గిట్టుబాటు కూలికి పోయి బాకీ తీరుస్తామంటే కుదరనీరు. "మకురునాయాళ్ళు యిబ్బందుల్లో ఆదుకొన్నోళ్ళను చూడరు. నేను యీకుంటే వాని పెళ్ళాం బతికేదా జబ్బుతో చచ్చేది. వాని పిల్లకు పెళ్ళి అయేదా – ఎవర్నో తగులుకొని లేచిపోయేది వాడూ మిడి తేలుతున్నాడు. వాన్ని చావగొట్టాల లేకుంటే మాటింటాడా" అని వూరకూరకనే కోపం తెచ్చుకొంటారు. కొట్టారు పూర్వం కొట్టి బాకీలు వసూలు చేసుకొన్నోడిని "మొగొడు" అని అన్నారు. పెద్దాడు, కొద్దాడురా అని అట్లాటోళ్ళనే పొగిడేవాళ్ళు. పెట్టి కొట్టేదాంట్లో యింత ప్లానుందని ఎవరికి తెలుసు. యిప్పుడు తెలిసింది. తెలిసింది చెప్పినోళ్ళను – బీదోళ్ళను వెనకేసుకొచ్చే వాళ్ళనీ యిప్పటికీ ఆడిపోసుకొంటుంటారు. పేదోళ్ళను ఎగదోసి వీళ్లేమి పాముకొంటారు అని కూడా అంటుంటారు. ఎక్కువ కూళ్ళిచ్చే వాటం వున్నప్పుడు ఎవడైన తక్కువ కూళ్ళకు వస్తాడా అన్న జ్ఞానం కూడా లేదు. ఏం చేస్తాం. మనం మన బతుకు చూసుకోవాలి. వాళ్ళూ వాళ్ళ బతుకు చూసుకొంటారు. మనం ఎదురు తిరక్కపోతే మనకే నష్టం. బాకీలు తీరవు. ఉపరాగపని చేసేది తప్పదు" అని తనకు తెలిసిందీ, వినిందీ చెప్పినాడు నాగన్న.

పెళ్ళాం పిల్లోల్లను పనికి పిలిస్తే ఏమీ. వాళ్ళేమి చేసినారు. వాళ్ళతో పని చేయించుకోవచ్చు. వచ్చినంతా కూలి యియ్యవచ్చు. పనులకు పిలవక వాళ్ళు అస్తులు పస్తులు పడి వుండారు. ఎట్టయినా నా పెళ్ళాము ఎర్రిబాగుల్ది. నేను చూల్లేనబ్బా యీ బాధ, ఆసుపత్రిలో వున్న పదిరోజులూ నాకింటిదిగులే. మేమెట్లా అనే దిగులు, మూగదెబ్బల్లో బాధవున్నా పెళ్లాం పిల్లోల్లను చూడాలని

ఎంతగా వుండిందో. నడిచి రావాల్సిందే, వాళ్ళకు ఆసుపత్రికి రావడానికి లెక్క లెవరిస్తారు. ఆడికీ – నడిచి వచ్చింది. ఏడ్చింది. నేనేం చేసేది, నాకాడ డబ్బులేదు. వీళ్ళను వాళ్ళను అడుక్కొని తినిందంట పాపం. వాళ్ళగతి వాళ్ళది. నాగతి నాది. ఇంతకూ నేను కేసు పెట్టినాననేకదా యిదంతా. ఏదో మీయట్లా వాళ్లుండబట్టి నేను బతికినాను. ఆసుపత్రిలోనైనా చేర్పినారు. లేకుంటే పస్తులున్న పెళ్లాం పిల్లోల్లను తలుచుకొని వళ్ళు తెలియని ఆలోచనల్తో గుండె పగిలి పోయేవాణ్ణి. వళ్ళు నొప్పులతో పండుకొని మాదాపనగా కన్నంటినప్పుడు తప్ప తెలివిగా వున్నప్పుడు ఆలోచనల్తో వళ్లంతా వుడికి ఆవిరయినట్లుంది. ఎంత అనుకొంటే ఏం. పెళ్ళాం పిల్లలు పస్తులు, ఆకలి బాధేకాక అవమానంతో చస్తున్నాను. మొగమెత్తుకొని తిరగలేకుండా వున్నాను. 'ఛ' అన్నాడు నారిగాడు ఆవేశంగా.

"పోలీసు ఆఫీసుకు పోతే అన్నీ తెలుస్తాయి పారా. వీళ్ళకతేందో తేల్చుకొందాం. వీళ్ళది జాస్తి అయింది. అదో మన బీటు పోలీసు ఆయన యిల్లు దగ్గరకు వచ్చింది. ఇంట్లో వుంటాడో స్టేషన్‌లో వుంటాడో విచారించి పోదాం" అని అన్నాడు నాగన్న.

"వద్దులే అన్నా స్టేషన్‌కే పోదాం. అక్కడే సర్కిలుంటాడు. ఆయన్నే అడుగుదాం. వివరంగా చెప్తాడు" అని అన్నాడు నారిగాడు.

లేదులేరా నీకు తెలియదు పెద్దాపీసర్లకు లంచము ముట్టుంటుంది. చిన్నోళ్ళకు ముట్టుండదు. వాళ్ళయితే అక్కసుతోనయినా నిజం ఎల్లకక్కుతారు" అని నాగన్న పోలీసు సుబ్బన్న యింటికిదారి తీసినాడు.

సమయానికి సుబ్బన్న ఇంట్లోనే వుండినాడు. నాగన్న నారిగాళ్ళను చూస్తానే "ఏరా వచ్చినారు" అని అన్నాడు.

"ఏం లేదబ్బా కేసు సంగతి నీకైతే తెలుస్తాది అని అడగాలని వచ్చీనామబ్బా. మీకు తెలియందేముంది అన్నీ విచారించి వుంటారు" అని అన్నాడు నాగన్న.

“మీ కేసు పోతుందిరా. వాళ్ళకు ఫైను కూడా పడదు. కాదంటే వాళ్ళకు ఖర్చువుతుంది అంతే” అని అన్నాడు పోలీసు సుబ్బన్న.

“ఏందబ్బా ఎంతగా కొట్టినారు. పదిరోజులు ఆసుపత్రిలో వుండి చచ్చి బతికినాడే యింత అన్యాయమా” అని అన్నాడు నాగన్న.

“అన్యాయమేముంది. డాక్టరు ‘సింపుల్’ అనీ ‘బాకూ చాకూ లాంటివి ఉపయోగించలేదనీ’ సర్టిఫికెట్టు యిచ్చినాడు. పిడిగుద్దులతోనూ, మెట్లతోనూ కట్టె కంపలతోనూ రక్తగాయం లేకుండా కొట్టిన దెబ్బలకు అంతే యిచ్చేది. కోర్టులో అది చిన్న కోట్లాట అనుకొని ఉద్దేశపూర్వకంగా కొట్టిందికాదని – తాత్కాలిక ఆవేశంతో కొట్టి వుండవచ్చుననీ – పరస్పరం కొట్టాటల్లో మీరు వాళ్ళను కొట్టివుంటారని – వూహించుకొని కొట్టేస్తారు” అని తనకు తెలిసింది చెప్పినాడు పోలీసు సుబ్బన్న.

“అట్లయితే కేసు కాదంటావా, పోనీలే. వాళ్లు పెట్టేకేసులు తగులు కుండేట్లు పెడ్తారే అదెట్లా” అని అన్నాడు నాగన్న.

“వాళ్ళకూ మీకూ పోలికా. వాళ్లైతే కేసు పెట్టేటప్పుడు వీపు మీదనో తొడలమీదనో బుజాల మీదనో అపాయం లేనిచోట – రక్త గాయం చేసి – బాకుతో పొడిచినాడనీ – చాకుతో కుమ్మినాడనీ – చంపాలనే వుద్దేశంతోనే వచ్చి యీ పని చేసినాడనీ సాక్ష్యాధారల్తో కేసు పెడ్తారు. పెట్టి వూరుకొంటారా. పెద్దోళ్ళకు లంచాలిచ్చి కేసు బాగా రాయిస్తారు. డాక్టరుతో కూడా మంచి సర్టిఫికెట్టు ఇప్పిస్తారు. ఇంకొంచెం తెగివుంటే ప్రాణం పోయేది. సీరియస్ యింజురీ అని రాయిస్తారు. బంధువులనూ కావలసి నోళ్లనూ కూడగట్టుకొని ఒకరికొకరు కట్టుబాటుగా వుండేందుకు పార్టీగా ఏర్పాటు చేసుకొని, ఖర్చులకు తలాయింత వేసుకొని, ఎవరికొచ్చినా యిట్లనే చేసి శత్రువులను నాశనం చేయాలని పకడ్బందీగా ఆలోచించి చేస్తారు. కట్టుబాటు చెదరకుండా బాండ్లు రాయించుకొంటారు. వాళ్ళ ఆలోచనలు మీకేం తెలుస్తాయి. యుక్తిగా చేసుకొంటారు పనులు. మీతో ఏమవుతుందిరా. లెక్కలేదు. పార్టీగానూ

వుండలేరు. నిజంగా ఎంత జరిగింటే అంతే అట్లే కేసురాయిస్తారు. పోరాపోండి. మా యింటికి రావద్దు. నేనూ సన్నోన్నే. నాకెందుకీ పీడ పాపం" అని యీ విషయం చెప్పినాను. ఏదో ఒకటి ఏడ్చుకోండి ఒరే స్టేషన్‌లో సర్కిలుంటాడు చెప్పుకోపోండి. అయినా మీరే పోతే ఎట్లరా. తెలిసినోళ్ళను పిలచుకపోండిరా. తెలిసేదిలేదు పెట్టేదిలేదు. వూరక కేసులు రాయిస్తారు. మీ మొగాలకింతేపోండి" అని కొంచెం జాలి, కొంచెం విసుగు – కొంచెం కోపం అన్నీ కలసి అన్నాడు పోలీసు సుబ్బన్న.

నారిగానికి దిక్కు తెలియక "వెనక్కు పోదాం పద. ఇది అయ్యే పని కాదన్నా, మనకు ఎవరు పలుకుతారు. అయ్యేదేదో అయితాది. లెక్కలేనోళ్ళకు యింతే. ఎవ్వరూ ఏమీ చేయ్యలేరు" అని అన్నాడు.

"ఒరే నారిగా సచ్చుపడాకురా. మనకేంరా. సాయం చేసే వాళ్ళున్నారు. ఇట్టయితే ఎట్లా. మంచీ చెడ్డా విచారించేవాళ్ళు లేనే లేరంటావా. నాకు తెలుసుపారా ఎవరు సాయం చేసేది. ఈ వూర్లో కూలోల్ల నాయకుడున్నాడు. ఆయనతో మొన్ననే మాట్లాడినా. ఆయన కలుగ జేసుకొంటాడు. పారా తప్పక సాయం చేస్తాడు" అని నాగన్న తనకు తెలిసిన కూలోల్ల నాయకుని యింటికి దారి తీసినాడు.

కూలోల్ల నాయకుని యింట్లో కోలహలంగా వుంది. అక్కడ చేరిన హరిజనులంతా "బాగా జరిగింది మనవాన్ని కొట్టితే వూరుకొంటారా – కొట్టినోన్ని పెద్దరెడ్డి అనన్నా అనుకోకుండా యస్.ఐ. స్టేషనుకు యీడ్చుకొని పోయినాడు. శిక్ష పడేట్లుంది. కూలి సంఘంమంటే యిప్పడర్థమైంది వాళ్ళకు" అని రకరకాలుగా వుత్సాహంగా కూలోల్ల నాయకునితో చెప్పుతున్నారు.

"వాన్ని నేను కొట్టలేకపోయినా యస్.ఐ. అయినా జైలుకు యీడుస్తాడు. కూలోల్ల నాయకులు కలగజేసుకొంటే కేసులో అన్యాయం జరగదు" అని అనుకొంటూ నాగన్న వెనక దిట్టంగా నిలుచుకొన్నాడు నారిగాడు.

# ఇంటి మాదిగోడు

రామునికి తొంబైఏళ్ళు. ఇంట్లోకీ బయటికీ తిల్లాడుతాడు. చూపు పరవాలేదు, దగ్గరగా వుంటే గుర్తుపడతాడు. బాగా ముసలివాడయినాడు. వయసులో ఎంతో బలంగా వుండి వుంటాడు. శరీరంలో ఎక్కడ తోలు పట్టుకొన్నా బెత్తెడారేళ్ళు సాగుతుంది. వంగిపోయి కూడ ఆరడుగులుంటాడు. కట్టెసాయం లేకుండా నడుస్తాడు. గంగమ్మ అరుగుకాడ కూచొని నులక పేడతావుంటాడు. యాలకింత పెడితే తింటాడు. గంగమ్మ అరుగుమీదే పడుకొంటాడు. పొలం పనులకు పోలేదు. కొడుకూ, కోడలూ మనవండ్లూ పొలం పనులకు పోతారు. మొత్తం కుటుంబం పదిమందిదాకా వున్నారు. మనవండ్లక్కూడా ఇద్దరికి పెళ్ళిళ్ళయి పిల్లోల్లయినారు.

రామునికి చదరం పదిమూరల కొట్టం వుంది. అందురూ అందులో యిరుక్కో లేరు. కొంతమంది రైతులిళ్లకాడ వసారాల్లో గంగమ్మ అరుగుమీదా పడుకొంటారు. రామునికింకా రెండు కొట్టాలైనా వుండాలి. కొడుకూ కోడలూ బాగానే పనులు చేస్తున్నారు. చాలినంత కొట్టం – వొదుక్కొని పండుకొనేందుకు సంపాదించలేక పోయినాడు. చేసిన కష్టమంతా తిండికే సరిపోయింది.

రాముడు 10,15 ఏళ్ళ నుండి పనికి పోలేకుండా వుండాడు. ఆయాసంలేని పనులు మాత్రం చేస్తాడు. నులకపేడడం రైతులకు మంచాలల్లడం – సేద్యపు మోకులు – పగ్గాలు – పట్టేండ్లు వేయడం చేస్తూ వుంటాడు. బువ్వాగుడ్డ సంపాదించుకొంటాడు. ఆకు వక్క పొగాకు పుల్లలు సంపాయించుకొంటాడు. తొంబై ఏళ్ళు వచ్చినా రామునికి పని తప్పలేదు. తనకు ఆకలి అయినప్పుడు ఒక్కొక్క సారి బువ్వ వుండదు. ముఖ్యంగా వళ్ళు మీద గుడ్డ సరిగా వుండదు. దసిలిపోయిన శరీరం చలికాలంలో బాగా అవస్థపడతాడు. ఎక్కడో ఎట్టనో కప్పుకోను లేకుండా పండుకోవాలి. రాముడికి కోడి నిద్ర. ఎప్పుడూ మెలకువగానే వుంటాడు. కళ్ళాల్లోకి కావలి కూడా అప్పుడప్పుడు పోతూ వుంటాడు. ఎంతముసిలోడైనా చేతిలో పని వుంది. కాబట్టి వూరిలో ఎవరింటికాడైనా యింత

బువ్వ దొరుకుతుంది. ఎక్కువ తినలేడు. తిన్నా అరగించుకోలేడు. పేదోళ్ళకు ముసలితనంలో పించనీ యిస్తారట. రాముడికీ రెందుకో. రాముని కొరకు ఎవరో ఒకరు పోయి అందరి కాళ్ళూ పట్టుకుంటే కానీ అదిరాదు. అరవైఏళ్ళవుతానే కొట్టాన్ని చూచి ఎవరి సిఫార్సు లేకుండా యీవచ్చునే అని అనుకొంటాడు రాముడు. నెలకింతవస్తే బాగున్ను అని అనుకోవడంలోనే రామునికి తొంభైదాటుతున్నాయి. నులక పేడడం. మంచాలల్లడం పాతతాళ్ళూ తలుగులు అతకడం తప్పలేదు. తాను వయస్సులో వున్నప్పుడు ఎన్నో పనులు గొప్పగా చేసినానంటాడు. పనుల్లో రైతుల్ను మెప్పించినాననీ చెపుతూ వుంటాడు. రామునికి రానిపనేముంది.

"ఏరా రాముడూ బాగున్నావా. చూపులు బాగున్నాయా" అని అడిగితే "ఏముందబ్బా అంతా అయిపోయింది. కట్టె నిలిచింది. ఎప్పుడుపోతాదో యేమో. ఉన్నన్నాళ్ళు వూరకుంటే ఎట్లబ్బా" అని నులక పేడేది నిలిపి తృప్తిగా చెప్పినాడు.

"హరిజనులకు కొట్టాలకు జాగా లిస్తున్నారంటనే నీ కొడుకుతో సెప్పి అర్జీ పెట్టుకోకూడదా" అని అంటే "ఏందబ్బా మాకెవరిస్తారు. పెద్దోళ్ళు పట్టుకొంటే అయ్యే పనులు. గంగమ్మ అరుగుకాడనే నాకట్టెపోతాది. యిప్పుడెందుకులేబ్బా – అది మావాడు చూచుకొంటే చూచుకోనీలే అని – అనుకుంటే! మొన్న ఒకాయన – మాదిగోళ్లది జాస్తి అయింది. గవర్నమెంట్ డబ్బంతా వాళ్ళకే అని విసుక్కున్నాడు. ఏమి ఇచ్చినారబ్బా అని నేను అనుకొంటుండా" – అని కొంచెం నొప్పిగా మాట్లాడినాడు. "ఇస్తే వాళ్లదేం పోయిందనీ" అన్నాను.

"పోయిందో పోలేదో – రైతులకు కొంచెం యాష్టగా వుందబ్బా. మా కాలం యిట్లా కాదబ్బా రైతులు మాకూ – మేము రైతులకూ అని అనుకొన్నాం. మావూర్లో మాదిగోళ్ళల్లో నేను పెద్ద భాగస్తుని. చాకిరీకి రైతుల యిళ్ళను మూడేళ్ళకొకసారి పంచుకొనేవాళ్లం. నాకు అణా బాగముండేది. నాకు మూడు నాలుగిళ్ళు వచ్చేవి. నేనూ నా పెళ్ళామూ పనికి పోగా యింకా మిగిలిన ఇండ్లను సన్న బాగస్తునికి ఆయిళ్ళు చూచుకోమని చెప్పేవాన్ని. ఆ కాలంలో యింటి

మాదిగోడంటే అన్ని పనుల్లో మునుము పట్టినట్లు ముందుండాలి. మా పని గాలికాలం నుండి ఉగాది వరకు ఉంటుంటాది. వరపు పాపనాల కాలం నుండి కళ్లాల కాలందాకా, రైతుకు బావికింద తోటా దొడ్డీ వుంటే తీరికే వుండదు. మా కాలంలో కవిలె (కపెల) తోలేవాళ్ళం, కవిలె అంటే అబ్బా రొమ్ముల కుంపటిపని. వరుపువస్తే అడుగు నీళ్ళకు కవిలె తోలాలంటే అదిరిపోతాది. అందులో బావులకు వంతులుంటాయి. వంతులోనే తోటపారాలి. లేకుంటే పైరు ఎండగాలిపోతాది. కోడికూసేటప్పుడుపోతే చీకటిపడేవస్తాం. ఈ వూర్లోనాతోపాటి కవిలె తోలేవాడు ఒక్క బాలిరెడ్డేనబ్బా. ఆయన మొన్ననే చచ్చిపోయినాడు” అని బాధగా అన్నాడు.

“ఏం కపిలె తోలేదంత కష్టమా” అన్నాను. చెప్పుతావాబ్బా. రెండుకాండ్లకు పొద్దుగూకులు కొనబారికీ మొదటి బారికి చిల్లపోటు పట్టుకొని పరిగెత్తినట్లుండాలి. లేకుంటే ఎద్దులు నెమరు వేసుకొంటా వూరుకుంటాయి. నీళ్ళు తక్కువగా పోతాయి. తోట పారదు. అదీగాక మాకు బొక్కెనకుట్టేపని వుంటాది. బొక్కెనబాన చిల్లిపడినా – వలిగెంకాడ కుట్లూడినా – ముక్కర తొలికాడ తెగిపోయినా – తొండానికి సావు కుట్టూడినా – మాదిగోని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడ్తారు. ఏమంటే వంతులబావి కవిలె. యుద్ధంలో పనిచేసినట్లు వుంటాది. మోకు తెగచ్చు – గుదిమోకు తెగచ్చు – దాపుతాడు తెగచ్చు – తొండానికి దాపుతాడుకూ లంకెగావున్న ముక్కరసిల్ల పోయినా పని యిబ్బందే. అంతా కట్టుదిట్టంగా వుండాల రెండు కాండ్లు ఎద్దులూ నలుగురు మాంచి మోటకష్టం చేసేవాళ్లుంటే – అన్ని యారముట్లూ – మోకూ బొక్కనా – వగైరాలు – పద్ధతిగా వుంటే – మాపుటేలకు ఎకరన్నర తోట పారుతుంది. లేకుంటే పారదు. అడుగునీళ్ళయితే ఎకరానే పారేది. ఏమన్నా చెప్పబ్బా – కవిలె పోయింది. మాదిగోనికి కష్టాలొచ్చినాయి. ఇంజన్లు మోటార్లు వచ్చి మానోటికాడికూడు పోయిందబ్బా మాతో అవసరమేముంది. బొక్కెనతోపని లేదు. మోకుతో పనిలేదు. ఎద్దులు కూడా అనవసరం. స్వంతం చేసుకోవచ్చు. ఇప్పుడు ఇంజన్లు మోటార్లు రిపేరు చేసేవాళ్ళ కాలం బాగుందబ్బా మా వృత్తి

పోయిందబ్బా. అందుకేనేమో మాదిగోళ్ళకు సాయం చేయడం. మా కుల వృత్తి పోయింది. ఏమన్నా చేలల్లో తోటల్లో పనులుంటే – ఇంత వస్తాది. లేకుంటే లేదు. మా కాలంలో ఇంటిమాదిగోని పని అంటే ఒకటా – బొక్కెన కుట్టాల – గొడ్డు చస్తే ఆ చర్మం కఱ్ఱవేసివ్వాలి. బిళ్ళ మోకులు వార్నెలు చిల్లపోట్లు – ఇంటి అందరికీ చెప్పులు – సోలకాళ్ళకు వార్లూ – ఎద్దులకు తలతాళ్లూకొమ్ముతాళ్లూ – మెడవార్లూ – అన్నీ అమిరించాలి. ఇవన్నీ చర్మం లేకుంటే కొనకచ్చి అయినా అమిరించాలి. పొద్దున్నే గాడిపాటలూడ్చాలి. గింజలు దంచాలి. రైతు ఇంట్లో ఎవరైనా చనిపోతే బంధువుల వూర్లకుపోయి చెప్పిరావాలి. శవాన్ని పూడ్చడానికి గుంత తొగాలి. మూడురోజులు గుంతకాడికి కావిలీ పోవాలి, నక్కలు గుంతెల్లెయ్యకుండా. యిదంతా అనుకుంటే – రైతులకు మాదిగోళ్ళు చేయని పనేముందబ్బా. ఆవులూ బఱ్ఱెగొడ్లూ యీనిపుడు – ఎద్దులు పాలుమాలినప్పుడు మాదిగోడు చేయాల్సిన పనులు పురమాయింపులు – ఎన్నో వుంటాయి. ఇవన్నీ యిపుడేమున్నాయి. రైతులు గింజపైర్లు పెట్టరు. డబ్బు వచ్చే పంటలు పండిస్తారు. డబ్బు చేసుకొంటారు. ఎద్దులుండవు. ఎనుములుండవు కొందరికి. యిప్పుడు మావూర్లో ఐదుపుట్ల గింజలు పండించేవాడే లేడు. అన్నీ సంతలో కొనుక్కుంటారు. యీ నులకైనా కొనుక్కోవచ్చు. నేను పేటే నులక అగ్గువకు వస్తాది. అందుకే నారిచ్చి నులక పేడిచ్చుకొంటారు" అని బుసయిడసకుండా చెప్పినాడు.

"ఇంతపనీ చేస్తే నీ కాలంలో నీకేమాత్రం గిట్టుకొనేది" – అని అన్నాను.

"ధారాళమైన రైతుంటే బాగా గిట్టుకుంటుంది. ఎంతయినా తిండికి లోటుండేది కాదు. ఎక్కడ చూచినా గింజ పైర్లు బాగా పండుతూ వుండినాయి. మా కష్టానికి కళ్ళాల్లో రాశిగింజలే – అంటే రైతు యిష్టపడి – చేసిన కష్టాన్ని అంచనావేసి, రాశిని విడిచిపెట్టి ఎత్తకపో అని చెప్పితే వచ్చే గింజలు రాశిగింజలు. ధారాళంగా పెట్టేవారు. మేము లేకుంటే వాళ్ళకు జరిగేది కాదు. తలసమురు కాన్నుంచీ అన్నీ ఎక్కువ లేకపోయినా తక్కువ వుండేది కాదు.

సోలకాలకు వార్లు పెట్టుకొనిపోతే – గిన్నె నిండుకూ తలసమురు – ఆముదం వండింది – పోసేవారు. మాకు ఎంత లేదన్నా పుట్టెడూ పుట్టెన్నర – ఒకసారి రెండు పుట్లు కూడా వచ్చినాయి. నిరుకులేరు. రైతులకొద్దీ. ఉగాది నుండీ గాలి కాలం వచ్చేంత వరకూ ఆ గింజలు సరిపోతాయి. రైతుపనికి పోయేప్పుడంతా – బువ్వ పెట్టారు. రాత్రిపూట గుంత మూకటినిండాకు కొర్రన్నం పెడ్తారు.

ఒకప్పుడేమైందంటే మహన్నబావుడు – మా రైతు ఇంట్లో అలుపూ సలుపూ లేకుండా పని చేసినా. ఎంతపనో చెప్పడానికి కాదు. ఆ సంవత్సరందండిగా గింజలు పండినాయి. కళ్ళంలో జొన్నలు రాశి పోసినాము. సాయంత్రం గింజలు రైతింటికి మోస్తున్నాం. గాదెలు కందనాలు అన్నీ ఒకటొకటే నిండుతున్నాయి. అందరితోపాటీ నేను నాభార్య గింజలు మోస్తున్నాం. రాశిగింజలు రైతు పోనిచ్చినవి మేమెత్తుకొని పోవాలి. ఆనాడు అందాజుగా నాకష్టానికి యిప్పుడు మిగిలిన రాశిగింజలయితే సరిపోతాయి అని మోసేగంప కల్లంలో కింద పెట్టినాను. మా పెద్దరెడ్డి నాదిక్కు చూచినాడు. ఏరా గంపకింద పెట్టినావు – అన్నట్లు చూచినాడబ్బా – నేను నసుగుతా మళ్ళీగంప తీసుకొన్నాను మోయాడానికి. అంతలోనే నవ్వుతూ – మహన్నబావుడు యాడుండాడో చచ్చిపదేళ్లైంది యింకొద్దులే అని అన్నాడు. – అన్నీ ఎత్తుకపోయినాం. నాయింట్లో పట్టక తావులేక రైతింట్లోనే కొలిచి పోసినాం పుట్టెన్నరగింజలైనాయి. నా జీవితంలో అది పెద్ద కల్లం. రైతును గురించి కూడా వూర్లో అందరూ ఎముకలేని చెయ్యి – మాదిగోనికి గింజలు బాగా పోనిచ్చినాడు అని అన్నారబ్బా. అదో అట్లా వుంటుందబ్బా – రైతు మాదిగోని సంబంధం మా కాలంలో” అని అబ్బిళ్ళు కోరుకుతూ చెప్పినాడు. రాముడు మళ్ళీ వుత్సాహంగా చెపుతున్నాడు. ఆ సంవత్సరం ఆ రైతు యిల్లు విడిచి పెట్టేటపుడు ఆ యిల్లు నాకు ఎప్పుడు నా బాగానికి వస్తాదో అని – సంతోషం పట్టలేక – పేరుండేందుకు ఏదన్నా చెయ్యాలనుకొన్నా – ఒకరోజు పందెం వేసుకొన్నట్లు ఒంటి రోకట – యిద్దుము

కొ్రలు – వండుకునేందుకు తరమయ్యేట్లు – సడింపులు చేసినాబ్బా – చీకట్లోలేసి చీకటి పడేతలికే – పేరుజెప్పి అన్ని కొ్రలూ దంచినాను. ఆ రాత్రికి మా తల్లి మెచ్చుకొని పరమాన్నం పెట్టింది. అది యిప్పటికీ మరిచిపోలేను. ఆయన పేరూ నిలబడింది. నా పేరూ నిలబడింది. యిప్పుడెవరుండారులే ముండనాయండ్లు ఊసుకాళ్ళ దాసప్పలు – యిద్దుం కొ్రలు అంటే 64 సేర్లు ఒంటిరోకటితో సాయంత్రానికి వండుకొనేట్లు దంచమను తెలుస్తాది" అని మీసం మీదికి చెయ్యి పోనిచ్చినాడు రాముడు.

ఇప్పుడు రైతుల్నుంచి మా మాదిగోళ్ళూ యాష్టపడుతూ వుంటారు. పెట్టుపోతలు లేవు. రాశిగింజలు లేవు. చాలినంతపని దొరకదు. పైపనులు, మెట్లుకుట్టేది కూడా లేదు. ఆదాయం తగ్గింది ఉప్పుతో ముప్పైమూడూ మాదిగోడు కొనాలంటే అవుతుందా అబ్బా నువే చెప్పు. రైతు పండించిందాంట్లో మాదిగోనికి కొద్దో గొప్పో యింటికి వస్తే అదో అప్పుడే రైతుకూ మాకూ కుదురుతాది లేకుంటే ఎట్లబ్బా అని అన్నాడు రాముడు.

మాదిగోళ్ళకు అప్పులిచ్చి, పనుల్లోకి రాబెరుక్కుంటూ వుంటారు. అప్పులివ్వడం, వాన్ని బాదించడం ఎక్కువయింది. వాళ్ళు కూళ్ళు సరిగా యివ్వరంట – మావాడు మొత్తుకొంటూ వుంటాడు. ఈ నడమన బంజరు భూములకు పెట్టుకొంటూ వుంటే అదేపనిగా కొందరు రైతులు చెడగొట్టినారంట – ఏందబ్బా – వాళ్ళివ్వరు – యిచ్చేవాళ్ళకు అడ్డం పోతారు – అన్నీ వున్నవాళ్ళకే చెందాలంటే ఎట్లబ్బా. మాబోటి పేదనాయిండ్లు ఎట్ల పోవాలి. ఊరకుంటే వుండూరు అచ్చిరాదంట, ఎట్లనో ఒకట్ల కావల్సినది సంపాదించుకోవాలి. లేకుంటే గడవదు.

ఈ మధ్య దేవర్లు చేయరు. దేవలాలకాడికి రానీరు. అడవిలో కూడా కుంటల్లో – కూడా ఎవరూ చూడకుండా నీళ్ళ తాగాలి. పెళ్ళిళ్ళలో కూడా ముందు మాదిరి అన్నాలు పెట్టరు. ఇంతకూ అద్దమానం కాలం వచ్చిందబ్బా.

పిల్లనాకొొడుకులు ఎట్ల సంపాయించుకొొంటారో ఎట్ల బతుకుతారో పాపం అనిపిస్తుంది.

మావాడు ఎందుకో దినమూ యాడికో ఒకసాటికి పోతావుంటాడు. "ఏంపనిరా అంటే ఏదోలే ముసిలోడా నీకెందుకు – ఊరకుండు మనకు నాలుగు రాళ్ళు సంపాదించుకొనే పనే, నేను పోతూండేపని" అని అంటాడు. సామీ నీకు తెలిసినోళ్ళుంటే మావానికేదన్న సాయం చేయి సామి. నీకు పున్నెం ఉంటుంది. వాడూ పిల్లలు గల్లోడు. నేదకుడు. వాని పెళ్లాం అంటేనో – దానిని చెప్పేందుకు లేదు చెవిటి మాలోకం. తనకు తెలియదు ఒకరు చెప్తే వినదు. నామన వండ్లందామా రైతుల్తో పాటీషాపు చెప్పులు కొనకచ్చుకుంటారు. పైన పోయే నాయాండ్లు, ఎట్లన్నకానీ మావానికి సాయం చేయి సామీ" అని, "ఏందోయిదంతా నాకర్థం కాలేదు. ఎవరికీ ఎవరూ చిక్కకుండా పోవాల" అన్నాడు. అంతలోకే కొడుకు ఆడికి వచ్చి నాయనా మనకు బంజరు వచ్చింది. పట్టావచ్చిందని చెప్పినాడు. ముసిలోడు ముసి ముసి నగుతో నులక పేడడం మొదలు పెట్టినాడు. తకరార్లుండక పోతాయా బంజరైనా భూమి – భూమే – రైతులాశిస్తారు – అడ్డం పడ్తారు. వశపరచుకోవాలని చూస్తారు. అన్న భావం వచ్చిందేమో – రాముని మొగంలో దిగులావరించింది.

# పనికిరానోళ్లు

గొల్ల చిన్నక్కను తెలియనివాళ్ళు వూర్లో ఎవ్వరూలేరు. ఊర్లోనేకాదు ఇరుగు పొరుగు వూర్లల్లో కూడా ఆమెనుగురించి అనుకొంటుంటారు. చిన్నక్కను గురించి పాతకతలు ఎన్నింటినో చెప్పుకొంటారు. ఆవె జీవిత విశేషాలు పాతవైపోయినాయి. కొత్తోళ్లకు కూడా పాతకతలంటే ఇష్టమే. పాతకతల్లో కొత్త బాటలుంటాయి. అందుకే చిన్నక్కనూ చిన్నక్క కతల్నూ ఇప్పుడు కూడా అనుకొంటూ వుంటారు.

చిన్నక్కకు పెళ్లి అయి వుండిందంట. పిల్లలులేరంట. ఆమె ఎప్పుడు మొగున్ని పోగొట్టుకొనిందో కానీ – ఆమెకతలు ఎక్కువగా చెప్పుకొంటారు. చిన్నక్కకు ఓ పూరిల్లు వుండింది. పూరింటిలోనే బహుకాలం బతికింది.

ఆమె కష్టజీవి. కూలిపనులూ నాలిపనులూ చేస్తుంది. మేలిపనులు కూడా నేర్పుగా చేస్తుంది. మేలిపనులంటే పెద్దొళ్ళళ్ళిల్లో కార్యాలు జరుగుతూవుంటే పిండి వంటలూ అవీ చేయడం. ఆమె ఆ పనులన్నీ ఎట్లా నేర్చుకొందో ఆశ్చర్యమేస్తుంది.

చిన్నక్కకు నాగులచవితి పండగదినాల్లో రాత్రీపగలూ తీరిక వుండదు. కర్జికాయలల్లను అప్పలు చేయనూ పోవాల్సివచ్చేది. ఒక్కొక్క కర్జికాయ తూకానికి సేరు బరువుంటుంది. అప్ప – అంటే అత్తిరసం ఒకసేరు తూగుతుంది. అంతపెద్దసైజు కర్జికాయలూ అప్పలూ నూనెలోనూ నేతిలోనూ – పక్వంగా కాలుస్తుంది. అప్పల పాకు చెడిపోవడంగానీ – కర్జికాయ అల్లింది విచ్చిపోవడంగానీ ఆమె చేతిలో ఎప్పుడూ జరగలేదు. ఊరువూరంతా ముఖ్యంగా ఆడోళ్లల్లో చిన్నక్కకు మంచి పలుకుబడి వుంది. మొగోళ్ళు కూడా చిన్నక్కతో కర్జికాయలూ అప్పలూ చేయించుకోకపోతే దిగులు పడతారు. కారణం అవి బాగుంటాయి. ఆరుచికి అలవాటుపడినారు పాపం.

చిన్నక్క తెల్లవారు జామున లేస్తుంది, కసువులూడుస్తుంది. కుండలూ, గిన్నెలూ

కడుగుతుంది. నీళ్లబాన, పంతకాగు కడుగుతుంది. తనకు కావలసినన్ని నీళ్లు బావికిపోయి తెచ్చుకొంటుంది. ఇంటికి చిన్నబీగం వేసి మజ్జిగ ముంత చేతపట్టుకొని ఊరిలోకి పోతుంది.

ఊరులో ఏ ఇంటికి పోయినా చిన్నక్కను ఆదరంగా చూస్తారు. చిన్నక్కకు అందరూ ఒకటే. అందరిపనులూ సాధ్యమైనంత తొందరగా కావాలనే ఆరాటపడుతుంది. ఒంటి సంటిగా వున్న ఇళ్లల్లో మజ్జిగ చిలకడం, సంగటికి ఎసట్లో నూకలు పోయడం, సమయానికి వుంటే సంకటి కెలకడం – సంకటిని ముద్దలు చేయడం – ఒక ముద్ద అక్కడే తినిరావడం – ఆమె నిత్యనైమిత్తికం. మధ్యాహ్నంపూట ఏదో ఒకటి వుడకపెట్టుకోవడం చేస్తే చేస్తుంది – లేదా వూరిలోకి పోతుంది. ఊరిలోకిపోతే చిన్నక్కకు బువ్వకు కొదవలేదు. చిన్న చిన్న పనులు చేస్తుంది. బువ్వ తింటుంది.

గడ్డి తీసేకాలంలో అందరితో పాటీ గడ్డి తీసుకపోతుంది. కళ్లాల్లో చెనక్కాయలు పెరకను పోతుంది. చేలల్లో కాయలు ఏరనుపోతుంది. సులభంగా వుండే పొలంపనులకు పోతుంది. కొంత సంపాదించుకొంటుంది. "పిల్లా మేకాలేనిదానివి నీకెందుకు కూలీ తినరాదా? పని చేయరాదా?" అని ఎప్పుడన్నా ఏగతాళిగా కొందరంటుంటారు. "ముక్కూ మొగమూనొస్తే నువ్వు చూస్తావేమోపాపం" – అని ముక్కు సూటిగానే మాట్లాడుతుంది. కూలీ డబ్బులు ఇప్పించుకొంటుంది.

కూలిలెక్క రాబట్టుకొనేందుకు ఆమె కొన్ని ఎత్తులు వేయాల్సి వస్తూ వుండేది. ఇదంతా ఆమెకు చిరాకుగాను ఒక్కొక్కప్పుడు వుంటుంది. తను కష్టం చేస్తుంది. తనకు గుడ్డా గుసురూ అవసరం. ఇంట్లోనే వుండి ఇష్టం వచ్చినపుడు, ఇష్టం వచ్చింది తినాలంటే స్వంత డబ్బు అవసరం. అందుకే ఆమె కూలీ డబ్బు అప్పు పెట్టకుండా – చాలా యిబ్బందిగా వుందనీ – అంగట్లో అప్పుందనీ – ఇంటికి సున్నం కొట్టించుకోవాలనీ పూరింటికి బోదకావాలనీ – ఏవేవో చెప్పి ఎప్పటికపుడు కూలీ డబ్బులు వసూలు చేసుకొంటుంది. "నేనంటే వీళ్ళకు అంత

అలుసెందుకో" అని కూడా అనుకొంటుంది.

"పిల్లా మేకాలేకుంటే నాకూ పున్నెం పాపం లేదూ. పాపం అని అనాల్సినోళ్ళు ఎంతోమంది వున్నారు. వాళ్లకేమైనా చేయవద్దా. చిన్నక్క మంచిదని అనిపించుకోవద్దా – అదీగాక అందరితోపాటీ పని చేస్తాను. పైగా కొన్ని పనులు ఎక్కువ నేర్పుగా చేస్తాను, సాయపడతాను. నాకెందుకీరు కూలి. ఏం పోగొట్టుకొంటారు" అని అనుకొంటుంది.

చిన్నక్కకు కూలిడబ్బులు అప్పుపెట్టి ఎగ్గొట్టిన పుణ్యాత్ములూ వున్నారు. పాపం – చిన్నక్క కొన్నాళ్లు అడుగుతుంది. రేపు మాపు తిప్పుకొంటారు. ఉసిలేకపోతే కాటుకు తిరుక్కుంటారు. అంతలేదులే ఇంతేలే అని ఏదోకొంత యిస్తారు. చిన్నక్కకు విసుగుపుట్టి "నా రుణంలో పడిపోతారు పోండి" అని గొనుక్కొంటూ పోతుంది.

అది చెప్పి ఇది చెప్పి కడాకు కాటుకు తిరుక్కొని కూలి డబ్బులు ఎగొట్టేవాళ్లని చూస్తే, చిన్నక్కకు కడుపులో మంట. "చేసినకష్టానికి చేతనైనంతన్నా యివ్వకుంటే ఎట్లా" అని విసుక్కుంటుంది. "ముసలీ ముతకా – కుంటి సంటీ – బీదా – బిక్కి – అనాథులకు కబోదులకు తన చేతనైనంతా చేయద్దా. నాకాడ డబ్బుంటే యిస్తాను. లేకుంటే ఎట్లా అని అనుకొంటుంది. కూలి డబ్బులకు పేచీలు పెద్దగాపడదు. రంపులు చేయడం చిన్నక్కకు ఇష్టముండేది కాదు. "పోనీలే నా సొమ్ము వాళ్లకంతరుచి" అని తృప్తిపడుతుంది. చిన్నక్క సంపాదన చిన్నదేం కాదు. తన ఖర్చు దాదాపు ఏమి లేకుండా చేసుకొంటుంది. సాధ్యమున్నంత కూలి డబ్బులు మొత్తం కూడబెట్టుకొంటుంది.

మిగిలిన కూలి డబ్బులు దాచిపెట్టుకోవడం ఆమెకు పెద్ద సమస్య అయికూచుంది. ఎట్లా అని ఎన్నో ఆలోచన్లు చేస్తుంది. పెద్దరెడ్ల దగ్గర డబ్బు దాచుకొంటే సమయానికి తిరిగియివ్వరు. "ఇస్తాంలే యిప్పుడు నీకెందుకూ" వుండనీలె అని అంటారు. అర్ధరూపాయ వొడ్డీ కూడా యీరు. పాపం అని సన్నోళ్లకు యిస్తాంలే అని పావలా వొడ్డీ వేసుకొని యిస్తే అది తిరిగి యీలేరు.

కొంతమంది దిక్కు తెలియక కాటుకు తిరుక్కొంటారు. ఎంతోకొంత ఎగ్గొడ్తారు. "ఎట్లబ్బా – ఒంటి సంటిగా బతకడంలో యిన్ని ఇబ్బందులుంటాయే" అని అనుకొంటుంది. ఏమైనా చిన్నక్క పనికిపోకుండా వుండదు. మిగులుతా వుంది.

నగదు రూపాయలుగా చేసుకొని పూరింట్లో – వాసాలకు రంధ్రం వేసి – ఒక్కొక్క రూపాయను వాసంలోకి ఎక్కిస్తుంది. కొంతపొయ్యి వద్దనో రోటి వద్దనో బూడుస్తుంది. నమ్మకస్తులకు కొంత యిస్తుంది. దాపుడు రూపాయలు – ఒకటిరెండుసార్లు పోగొట్టుకొంది. ఎవరైనా కనిపెట్టికొని వుండి చూచిన వాళ్లు – కల్లంగళ్ళ కాతాదార్లు – తెలియకుండా మోసినారు. పాపం – ఏది పొద్దుపోయీ దినానికి కనీసం అర్ధరూపాయ అయినా సరాసరి మిగుల్చుకొంటుంది. వంటలూ, పిండివంటలూ చేసినప్పుడూ కొంచెం ఎక్కువ సంపాదించుకొంటుంది. సంతోషంగా ఆడోళ్లు యిస్తుంటారు. తన డబ్బు ఎంతుందని ఎంచి లెక్క పెట్టుకొనడానికి కూడా భయపడుతుంది. డబ్బుందని తెలిస్తే బదులనో – అప్పుగానో – యిబ్బందిగా వుంది ఆడపిల్లను పయనం చేసి పంపాలనో నిష్టూరంగా అడుగుతారు. జాలి గుండెల చిన్నక్క తప్పించుకోలేదు. ఇస్తే యిచ్చిన డబ్బులో ఎంతో కొంత పోనేపోతుంది.

ఎన్నో ఏళ్లుగా ఎంతగానో కష్టపడి కూడ పెట్టుకొన్న డబ్బులో యిట్లా అకానాకు వూరక పోవడం యిష్టంలేదు. ఏదన్నా వొకమంచి పని చేయాలని అనుకొంది. పదిమంది తిరిగేదోవలో సేదబావి తొగిస్తే అని అనుకొంది. ఆ భావం మనసులోకి వచ్చిందో లేదో శరపరంపరలుగా ఆలోచించింది. పెద్దపని – తూగిస్తానా లేదా అని కూడా అనుకొంది. ఏమైనా సరే నాలుగు కాలాలపాటు పేరుండేపని బావి తొగించడమే అని గట్టిగా అనుకొంది. ఆ పని ఎవరితో ఆలోచిస్తే బాగుంటుందని ఆలోచించి కడకు కష్టం చేసేవాళ్లతోనే ఆలోచిస్తే బాగుంటుందని నిర్ణయానికి వచ్చింది. పదిమందికి వుపయోగపడే కార్యం – వాళ్లూ నమ్మకంగానే చేస్తారు అని అనుకొంది.

నారాయణకు కూలోల్లల్లో పలుకుబడి వుంది. అతన్ని పట్టుకొంటే బావిపని నెగ్గిస్తాడని వెంటనే నారాయణ్ను పిలిపించింది. నారాయణ వచ్చినాడు. చిన్నక్కంటే అందరికీ ప్రీతే.

“నారాయణా! బావి తొగించాలని అనుకొంటున్నా బావిపని పట్టుకొంటే నీవు తూగిస్తావా” అని అడిగింది చిన్నక్క.

“ఏందమ్మా నీతో అయితుందా. దండిగా డబ్బు కావాల్నే” అని అన్నాడు నారాయణ.

“ఎంతయితే సరిపోతుందో చెప్పు నారాయణ – నీవైతే సరిపోతావని – పని తూగిస్తావని – పిలవనంపినాను” అని అన్నది చిన్నక్క.

ఎంతలేదన్నా బావి తొగి పూర్తిజేయాలంటే “యెయ్యిరూపాయలన్నా పడ్తాయి!” అని అంత డబ్బు నీతావున వుందామ్మా” అని అన్నాడు.

“అంతలేకపోయినా ఒకటి రెండు నూర్లు తక్కువుంటుందిలే. నారాయణా – వుంటే వూరక పోతాది – పదిమందికి తరమయ్యే పని చేస్తామని వుంది – అంతగా అయితే నా పూరిల్లు అమ్మి అయినా మిగితాది పురమాయిస్తాలే” అని పట్టుగా చెప్పింది చిన్నక్క.

నారాయణకు ఉత్సాహం బుగ్గపుట్టినట్లు లేచింది. దిక్కులేంది. ఆడకూతురు. అంతగట్టిగా అనుకొని పూనడం ఆశ్చర్యంగా వుంది. మనసులో చిన్నక్కను మెచ్చుకొన్నాడు.

“మంచిపనమ్మా నాచేతనైనంతా చేస్తాను. నాకున్న పలుకుబడినంతా బావి పనిలో పెడ్తాను నీకేం బయం లేదు. నీకు యీ బుద్ధి పుట్టడమే గొప్ప యీ పనిలో చేతనయిన సాయం చేస్తాలేమ్మా” – అని మరీ మరీ ధీమాగా చెప్పినాడు నారాయణ.

మంచిరోజు చూచి అయ్యను పిలుచుకొని వచ్చి మంచిస్థలాన్ని ఎన్నుకొని పూజాపునస్కారాలు చేయించి టెంకాయకొట్టి – నారాయణే ముందుగా

దండంపెట్టి గడ్డపారతో మూడేట్లు వేసి పని ప్రారంభించినాడు. కూలోల్లు అందరు దండం పెట్టుకొని పనిలోకి దిగినారు. చిన్నక్క మాత్రం దండం పెట్టుకోలేదు. అయ్య చిన్నక్కను బావి పనికాడికి రావద్దన్నాడంట. "విధవరాలు శుభకార్యాల్లో అంత మంచిదికాదు" అని చెప్పినాడంట. బావి పనిలో అన్ని పనులూ నారాయణకే అప్పచెప్పింది. చిన్నక్క డబ్బులు మాత్రం యిస్తూ వుంటుంది.

"నారాయణ కూలోల్లను పిలిచినప్పుడంతా" ఒరే మామూలు కూలికంటే రెండణాలు తక్కువ యిస్తారా – వస్తారా – రారా – పాపం చిన్నక్క వున్నదంతా వూడ్చి పెడ్తావుంది. ఆడకూతురు త్యాగం మనకు లేకుంటే ఎట్లరా" అని అన్నాడు.

నారాయణ చెప్పినట్లే కూలోల్లు బావి పనిలో సహకరిస్తున్నారు.

రెండణాలు తక్కువ అందరికీ వర్తించేట్టు కరారుగా కూడా అనుకొన్నారు. చిన్నక్క బావి ఆ విధంగా తయారు అవుతూవుంది. బావి పనికి కావలసినవి – గంపలు – పారలూ – గడ్డపారలూ – తాళ్ళూ – ఏవి కావలన్నా నారయణే పురమాయించుకొంటున్నాడు.

నారాయణకు పట్టుదల ఎక్కువైంది. పదిరోజుల్లోనే మూడుమట్లు తొగినారు. చెమ్మపడింది. ఆ దినం కూలోల్లు సంతోషంగా యిళ్లకు వచ్చినారు. ఆ రాత్రి చిన్నక్క మంచి మంచి వూహాలతో తృప్తిగా నిద్రపోయింది. తెల్లారి లేచి 'బావికాడికి రావద్దంటారే' అని బాధపడింది. కానీలే బావిపని బాగా జరుగుతూ వుందని తృప్తిపడింది. పెద్దూట పడేవరకూ తొగండని కరువుల్లో బావిగా వుండాలనీ గట్టిగా చెప్పింది.

నారాయణ – కూలోల్లు అలుపూ సలుపూ అనుకోకుండా బావి పనిలో పోరాడుతున్నారు. మూడున్నరమట్టులో బండపండింది. కూలోల్లకు గుండె చెదిరింది.

నారాయణ చిన్నక్కతో "బయపడకమ్మా దపాలుగా కూలోల్లతో కూలి లేకుండానే పని చేయించి యీ పని పూర్తి చేస్తాలేమ్మా" అని పట్టుదలగా చెప్పినాడు. బండపడినాదని చెప్పినాడు చిన్నక్కకు. చిన్నక్కకు దిక్కు తెలియలేదు. ఎట్లబ్బా అని బాధ పడింది. భయపడింది. అనుకొన్న పని సరిగా జరక్కపోతే నలుగురూ ఏటుపోటుగా మాట్లాడుతారని దిగులు పడింది.

చిన్నక్క డబ్బు అయిపోతూవుంది. ఊర్లో పాత బాకీలన్నీ వసూలు చేసింది. బావిపనికంటే ఎట్లో యిచ్చినారు. తన శక్తినంతా ధారబోసింది. బావిలో బండ ఒక మట్టు తెగింది. ఇంకా బండ ఎంతుందో అంతు చిక్కలేదు. మొండిగా పని చేస్తున్నారు. కూలోల్లు ఐక్యంగా పోరాడుతున్నారు. కూళ్లు కూడా కొంత అప్పు పెట్టుకున్నారు. కూలోళ్లను యిబ్బందులు పెడ్తున్నానని చిన్నక్కకు దిగులెక్కువయింది. మోతుబరి రైతుల్ను డబ్బు అప్పుగా అడిగింది. కుదరలేదు. "పైగా చేతావాతా కాకున్నా పెద్ద పని పెట్టుకొన్నావు అని యీసడించినారు. నారాయణ ధైర్యంగా వున్నాడు. కూలోళ్లు ఎట్లయినా బావి పూర్తి చేయాలనే పట్టుదలతోనే వున్నారు. చిన్నక్క కులస్థులు పొట్లిని యితర తిండిసంబారాలిచ్చి కూలోళ్లకు విందు పెట్టినారు. వాళ్ళూ బీదోళ్లే, అయినా పేదరాలు పెద్దపని పట్టుకొంది సాయం చేయాలనే సహకరించారు.

కడసారి కీటుగా మూరెడులోతు కీటు వచ్చేట్టుగా పెద్దఘాతం వేసి మందు కూరి పేల్చినారు. ఘాతం పేలినప్పుడు బావి అంతా దద్దరిల్లిపోయింది. పగిలినరాళ్ళు ఒకొకటి మణుగు బరువున్నవి కూడా – బావిలో నుంచి పైకి ఎగిరి దూరంగా పడినాయి. అంత పెద్ద కాల్పు కాల్చినారు అంతే పెద్ద ఊట పడింది. అదొకబుగ్గ.

కూలోళ్లంతా ఒక్క పెట్టున పైగుడ్డలు ఎగరేసి కోలాహలంగా కేకలేసినారు. వొకరిద్దరు సంతోషంగా పట్టలేక పరుగుల్తో వూరిలోకి పోయి చిన్నక్కబావిలో బుగ్గపడింది అని చెప్పినారు. చిన్నక్క సంతోషంతో ఉక్కిరిబిక్కిరైంది. మనసులోనే కూలోళ్లకు కృతజ్ఞత చెప్పుకొంది. వాళ్ళులేకపోతే నాతో ఏమవుతుందని

అందరితోనూ అనింది. పెద్దోళ్లే సమయానికి సాయం చేయలేదని చెప్పింది.

కూలోళ్లకు ఇవ్వాల్సిన కూలి డబ్బులు వొక్కసంవత్సరం వరకూ అప్పుడింతా అప్పుడింతా ఇస్తూ చెల్లు పెట్టింది. చుట్టుబావి కాబట్టి రాతి కట్టకం కొద్ది కర్చులోనే ముగిసింది. ఉన్నంతలోనే ముగిసింది. ఉన్నంతలో బావిపని పూర్తిచేసినాడు నారాయణ. కూలోళ్లకు తృప్తిగా విందుపెట్టింది. చిన్నక్క బావి నీళ్ళు రుచిగా వుంటాయి. అది కరువుల్లో బావి అని అంటారు.

గొప్పోళ్ళను ఆశ్రయించినప్పుడు వాళ్లు ఏ విధంగానూ సాయపడలేదు. సన్నోళ్లే ఎంతోమేలు. వాళ్ళ ఐక్యతా – త్యాగం – నాకు సాయపడింది అని అనుకొంది చిన్నక్క.

ఇన్నాళ్ళూ అనుకొన్న గొప్పోళ్ల గొప్పతనం చిన్నక్క మనసులో విరిగి తుంటలైపోయింది.



# గట్టిగింజలు

"సినిమాకు పిలుచుకొని పోతావా నేను పొయ్యేదా చెప్పు" అని మొగుణ్ని చనువుగా అడిగింది వెంకటమ్మ.

"ఏం జోరుగా వుందేబ్బా – లెక్కుందా – యాడిదీ" అని కొంగు పట్టుకొని లాగినాడు మొగుడు దుగ్గన్న.

"మరీ మిడిమేలంగా వుందే – వస్తే వస్తానను లేకుంటే లేదను – పొద్దటి నుండి పిల్లోల్లతో పోరు పడలేకుండా వుండా" అని కొద్దిగా మూతిసాగ పెరికింది – వెంకటమ్మ.

"సరేలే కొంగుముడి పెద్దదిగా వుందే – అంతా చిల్లరగా వుందే అని లెక్క పెట్టినాడు. మొత్తం రెండున్నర రూపాయలుంది. "వరే వరే – దండిగా వుందే యిద్దరం పోవచ్చునే – పదామా. ఏ సినిమాకో" – అని మురిపెంగా అన్నాడు దుగ్గన్న.

"యాదో ఒకటి తమాసాగా వుండే దానికి పోదాం – వస్తావా – ఊరకనే అంటుండావా" – అని పైట కొంగ సవరించుకొంది వెంకటమ్మ.

"నాకు తెలియకడుగుతాను. ఏందో ఈ మధ్య నువు సినిమాలకే రావడంలేదే మామా. ఎక్కడెక్కడ పోతావో ఏం చేస్తుండావో తెలియడంలా. పిల్లోల్లతో మనిద్దరం సినిమాకుపోక ఎన్నాళ్లయిందో పదాం పద" అని మొగునితో సినిమాకు పోవాలన్న ఉబలాటం మొగంలో కనపరచింది వెంకటమ్మ.

"యియాల ఎవరెవరు సినిమాకు పోతాండారో, ఏ సినిమాకు పోతుండారో చెప్పు ఎంకీ – వస్తే వస్తాను" అని కొంచెం ఆశపెట్టినాడు.

"ఓయబ్బా ఎంతమందొచ్చేది చెప్పాల. ఏం సినిమాకు పోయేది చెప్పాల. యిట్లయితే అయ్యేపనా. దోవలో ఎవరెవరు వచ్చేది బాగా తెలుస్తాది. సినిమాలో కూచుంటే ఏ ఆటయింది యింగా బాగా తెలుస్తాది" అని ఎంతసేపటికీ వచ్చేందుకు ఒప్పుకోడే అన్న భావం వచ్చేట్టు మూతిని రెండు మూడు సొట్టలు

తిప్పింది.

దుగ్గన్నకు భార్యను ఏడిపించాలని లేదు పాపం అతనికెన్నో పనులు సినిమాకు వెంకటమ్మతో పాటీ పోలేడు.

"ఎంకీ నేనొకటి చెప్పుతాను గమనించుకో యీమధ్య సినిమాల్లో ఎగుల్లాడేది ఎక్కువగా వుంటాంది. పెద్దపెద్ద మిద్దెలు పెద్ద పెద్ద టౌన్లు - బజార్లూ - కార్లూ ఏందో చూపిస్తావుంటారు. పెద్దమిద్దెల్లో ఆడుతూ పాడుతూ వున్నట్లూ - పనీపాట లేకుండా ఎగుల్లాడుతూ వున్నట్లూ చూపిస్తారు. రోడ్లల్లో పోయేవాళ్లకు - ఆ పాటలూ - ఆ ఎగుల్లాటల్తో ఏం సంబంధం. ఎవరి బతుకు వారిది. పొట్టకూటికి సంపాదించేదే బరువైనప్పుడు - కూటికి లేనోళ్లు - కూలికి పోయేవాళ్లు - అర్థంపర్థం లేకుండా కులికే సినిమాలకు పోవడం ఏం లాభం. లెక్క దండగ. మనబోటోళ్ల కతవుంటే పోయినా పరవాలేదు అర్తమయితాది. అయ్యో అనో, ఎట్లా అనో, ఏం చేస్తాం అనో మనసులోకి వస్తాది. మా కూలి సంగంలో ఒక పెద్దాయన చెప్పినాడు. గొప్పోళ్ళ విలాసాలు - దానాలు, వాళ్ళు పెద్ద పెద్ద మేడలు కట్టించడాలూ వాళ్లు కట్టించకుంటే - కూలొళ్ళు బతకలేరు అన్నట్లు - సన్నోళ్ళ కోసమే యిదంతా చేస్తావుండారు అన్నట్లూ సినిమాలో చూపిస్తారు. ఎక్కడన్నా షావుకార్లపిల్ల సన్నోన్ని ప్రేమిస్తుందా. పెళ్లి చేసుకొంటుందా. నువ్వే చెప్పు. మనల్ని వూరించేందుకిదంతా. నువు కూడా గొప్పోని వెందుకు కాకూడదు నువ్వు ఎంతోని వైపోతావో - ఎవరి అదృష్టం ఎట్లుందో అని వుబ్బించడము తప్పితే ఈ సినిమాల్లో. అందుకే నాకీ మధ్య సినిమాలకు పోవాలంటే యిష్టముండదు. మంచిదని అందరూ చెప్పితే పోతా. నువ్వేపో యియాల రాలేను. పనుంది. పిల్లోల్లు జాగ్రత్త" అని చిన్న వుపన్యాసం యిచ్చినాడు దుగ్గన్న. వెంకటమ్మకు సినిమా లోకం తప్ప యితర లోకం కనపడలే. "సరేలే నీకతంతా యీమద్య జాస్తిగా వుంది ఎక్కడెక్కడనో పోతుండావు. ఏమేమో చేస్తుండావు. నీకతనీదే" అని సాగదీసింది వెంకటమ్మ.

"కూలి దండు లేచే - కార్మిక వీరదండు లేచే" అని పాడుకొంటూ నెత్తిగుడ్డ తీసుకొని లేచిపోయినాడు దుగ్గన్న. అదేపనిగా ఆశ్చర్యంగా మొగున్ని చూచింది

వెంకటమ్మ. యితగాడు తరమయితాడాబ్బా అని అనుకొంది. అతని వుత్సాహానికీ – పాట పాడుకొంటూ గునక పరువున పోతున్న మొగున్ని చూచిచూచి – మురిసిపోయింది కూడా. గబగబ పిల్లోల్లను తయారు చేసుకొని సినిమాకు పోయింది.

సినిమాలో మొగుడు చెప్పినట్లే – మంచి మంచి పెద్ద చీరెలు కట్టుకొని – పెద్ద పెద్ద కార్లల్లో – పడ్డదూడల మాదిరీవున్న ఆడపిల్లోల్లు – వాళ్లతో పరాచికాలాడేందుకే వున్నట్లు – కోడెదూడల మాదిరీ ఎగుల్లాడే మొగపిల్లోల్లూ – తిరిగిందే తిరగడం చూపించినారు. వాళ్లయిళ్లల్లో ఎట్ల బతుకుతాన్నారో చూపలేదు. ఎంతసేపూ తిరగడం. ఎగుల్లాడడం చూపినారు. వాళ్లు ఏమేమి తింటారో అనన్నా చూపలేదు. ఎట్లా తింటారో – ఎట్లా సంపాయించుకొంటారో – వాళ్లకు ఎవరెవరు ఎంతెంత యిస్తారో – అసలు వాళ్ళు ఏంపని చేస్తారో – అని తెలియకుండా చూపినారు. మామ యిందుకేనేమో సినిమాకు రాంది ఎవరెట్లా పోతేమనకేం– మన పని మనం చేసుకోవల్సిందే అని ఇంతకు ముందు అంటుండేవాడు. ఈ మధ్య మన హక్కుల్ను మనం రాబట్టి కోవాల్సిందే. మనం చేసిన పనికి ఎంతకూలి రావాల్నో అంతా రాబట్టుకోవాల్సిందే. ఏరే దేశాల్లో కూలోల్లకు ఎంతెంత యిస్తుంటారో – అసలు కూలోల్లేలేని చోట్లుండాయంట" అని దినమూ చెపుతాడు. 'సోదెనీది' అని విసుక్కుంటూ వుండాను యిన్నాళ్ళూ. మామ నన్ను తప్పుగా అనుకొంటాడేమో పాపం. మామ ఏందేందో అనుకొంటాడు. రాత్రిపూటల్లో ఎక్కడెక్కడికో పోయి వస్తుంటాడు. ఏం తిప్పలు పడుతున్నాడో" అని అనుకొంటూ యింటికి వచ్చింది. చంటి పిల్లోలకు బువ్వ పెట్టింది. వాళ్లను పండుకోబెట్టింది. మామ యింకా రాలేదే – బువ్వతిని పోలేదు. "ఏందో మాట్లాడుకోవాల అందరూ వస్తారు నేను పోతుండా" అని పోతాడు. దినమూ ఏం మాట్లాడుకొంటారు. దినమూ కాగితాలు తెస్తుంటాడు. అవి ఎవరెవరికో యిస్తుంటాడు. "ఏం దోరాసినారే. ఏం రాసినారు అని అడిగితే – మీటింగుదిలేయే – నీకెందుకూ – నువు వస్తావా పెద్తావా – అని తనలోతను నవ్వుకొంటాడు. ఏందబ్బా యిదంతా – అని అనుకొంటూ

యీతసాపమీద కూర్చుంది. కునుకుపడుతుందేమో – కుక్క లొస్తాయి – వాకిలి వేస్తామని లేచి వాకిలి కాడికి పోయింది. దుగ్గన్న అప్పుడే యింట్లో అడుగు పెట్టినాడు. యాలా పాలా లేకుండా ఏందిదంతా – బువ్వ సల్లారి పోయింది. తినన్నా పోకూడదా. ఎట్లబ్బా నీతో – ఏంపనబ్బా – బువ్వనీళ్ళు లేకుండా ఎయ్యాలప్పుడంటే అయ్యాలప్పుడు పోతావు. మొబ్బునా మోడాన పురుగు పుట్రా వుంటాయి. నాకు బయం" అని దీనంగా అనింది వెంకటమ్మ.

"ఎర్రిమొగమా ఏంపరవాలేదులే. యింకా బువ్వ తినకుండా వుండావా. నాకోసం చూపెట్టుకోవద్దని ఎన్నిసార్లు చెప్పినాను. నీమతం ఇడిచిపెట్టవు. నేవచ్చినక తింటాలే అంటే ఇనవే. ఎంకీ. పిల్లోల్లతో ఏగేపని – యాలకు బువ్వతిని – వల్లు కాపాడుకోకపోతే ఎట్లా? నువ్వు సరిగా లేకపోతే నేనేంపనీ చేయలేను – బువ్వపెట్టు ఇద్దరం తిందాం పొద్దుపోయింది" అని అన్నాడు దుగ్గన్న. మొగున్ని మనసులో మెచ్చుకొంది. మామ – ఏందో పెద్దపనే సేస్తున్నాడనుకొంది. మొగున్నివూరిస్తూ బువ్వతినిపించింది. తానూ తినింది. చాపమీద పడుకొన్నారు. దుగ్గన్న ఏమో ఆలోచిస్తున్నాడు. మొగుడు చేసే పనేమిటో వివరంగా తెలుసుకోవాలనుంది వెంకటమ్మకు. ఇన్నాళ్లా విసుక్కొంటూ మాట్లాడుతావుండినానే – అడిగితే సరిగ్గా చెప్పుతాడా అని అనుకొని "మామా నాకు తెలియక అడుగుతాను. నువ్వు ఏంపనిమీద రాత్రిల్లు పోతుంటావు. పగలు కష్టం చేసి రాత్రి రెక్కలార్పుకోకుండా ఎక్కడెక్కన్నో పోతావు. మీటింగులవుతున్నాయని అంటావు. మీటింగుల్లో ఏమేమి చెపుతారో చెపుతావా? ఎప్పుడన్నా బుర్రకతల్లో పేదోళ్లు కష్టపడతావుండారని చెపుతారు. కొన్నికొన్ని పాటలు పాడతారు. పాటల్లో ఆలుమొగుడు సంసారం జరుపుకోలేక కొట్లాడుకొన్నట్లా పాడతారు. కష్టంగా వుంటే వుంటుంది. అట్లా ఆలుమొగలూ కొట్లాడుకొంటారా? ఉంటే తింటారు లేకపోతే పని సంపాయించుకొంటారు. కూలోళ్ళ ఇళ్ళల్లోనే కొట్లాడుకొంటారు. లేదా తాగుబోతు లిల్లుంటాయి. వాళ్లిళ్లల్లో కొట్లాడుకొంటారు. తాగుబోతులు అందరిళ్లల్లో వుంటారా? సరిపోనోళ్లు.

ఉన్నోళ్లు "మీరు సంపాయించేది మీ మొగుళ్ళకు తాగే దానికి సరిపోతుందని ఊరకూరకనే ప్రచారం చేస్తారు. ఎప్పుడో పండగలప్పుడు ఎట్లాటోళ్లా తాగుతారు. తాగితే తాగుతారు. ఎప్పుడూ తాగుతుంటారా? అందరినీ ఒక గాటికే కట్టేస్తారు. మంచీచెడ్డా లేకుండా వూరకే అంటుంటారు. ముఖ్యంగా పెద్దపెద్ద రైతులు మన సంగతి తెలియనోళ్లు మాట్లాడినా పరవాలేదు. మనవూర్లనే వుండి మనసంగతీ మన సంపాదన ఎంత – అనీ తెలుసుకొన్నోళ్ళే మాట్లాడుతారు" అని అనింది వెంకటమ్మ.

"నీకూ కొంతకు కొంత తెలుసునే. పరవాలేదు చెపితే అర్తమైతుందే. కూలోల్లంతా కట్టగట్టి వాళ్ళహక్కులకోసం పోరాడాలంట. కూళ్లు సరిగా యీకుంటే సమ్మె చేయాలంట. ఎంత పండినా మామూలు కూలే. వస్తువుల ధరలు ఎంత ఎక్కినా మామూలు కూలే ఇస్తామనే బూసాముల్తో పోరాడాలంట. బూసాములిళ్ళల్లో కూలోళ్ళను గురించి అనుకొంటారంట "కూలోళ్ళకు నేర్పిచ్చే వాళ్ళున్నారనీ – కూలోళ్లు సరిగా పనిచేయకుండా ఎక్కువ రాబట్టాలని చెప్పే వాళ్లున్నారనీ – పెట్టుబడి పెట్టి చేస్తే తెలుస్తా"దనీ ఏదేదో అనుకొంటుంటారంట. "నేర్పిచ్చేవాళ్ళూ యీ కూలోళ్ళను ఎప్పుడో ఒకప్పుడు సంపుతారు. కూటికి లేకుండా చేస్తారు" అని కూడా చెడ్డచెడ్డగా అనుకొంటుంటారంట యిదీ కూలోళ్ళకూ బూసాములకూ వచ్చిన వైరం. వాళ్ళపాటికి వాళ్లు దోపిడీ చేయాలనీ – మనపాటికి మనం సరైన కూలి రాబట్టాలనీ – యింతే. అందుకే పుట్లు పుట్లు పండించే బూసాములే కూళ్లు ఎక్కించకపోతే తాసిల్దారు ఎక్కిస్తాడా? తాసిల్దారు పన్నులెక్కిస్తాడు. చచ్చినట్లు బూసాములు పన్నులు కడతారు. ఆ విషయంలో పేద రైతుల్తో పాటీ కలిసిరారు. అక్కడ పేదరైతులకు దెబ్బ బూసాముల్తో అంటే బూసాములు ఆస్తులు పోకుండా ఆస్తిహక్కులు పోకుండా కాపాడుకుంటారు. పేద రైతులు కూలోల్లూ అప్పుడవసరం. ఎట్లనో ఒకట్ల వాళ్ళ సహాయం పొంది వాళ్ళ ఆస్తులను కాపాడుకొంటారు. పేదరైతులకూ – కూలోళ్ళకూ – మానవులకు తెలియకుండా అసూయల్ను పుట్టిస్తారు. బీదోళ్ళకు

బూములిస్తే పండించుకోలేరు. పెట్టుబడి వుండదు. పంటలు సరిగా పండవు. పరిగపంటల్లో ఏం గిట్టుకుంటాది అని ఏమేమో చెపుతారు. వొడ్డీలకు యిస్తారు. పేదరైతుల భూములు గుంజుకొంటారు. వాళ్ళను కూలోళ్లుగా మారుస్తారు అని మా సంగాల్లో వివరంగా చెపుతారు. నిజమేకదా. మనకు తెలిసి మనవూర్లో దాదాపు 10 కుటుంబాలోళ్లు – బూసాములకు మేలు గింజలు కొలిచికొలిచి కడాకు బూమి పోగొట్టుకొని మనతోపాటీ కూలికి వస్తున్నారాలేదా ఎంకీ – నువ్వే చెప్పు – యిట్లుంటే ఎట్లా. ఏదో ఒకటి చేయకపోతే ఎట్లా, మా సంగాల్లో ఎట్లరా యీ పద్ధతి పోగొట్టాలని మాట్లాడుకొంటాం. కూలి సంగాలు ఇప్పుడు వూరూరా వుండాయి. సంగంలో నేనూచేరినా, పనిచేస్తున్నాను. ఏమి ఎంకీ తప్పు చేస్తున్నానా” దుగ్గన్న వివరంగా చెప్పినాడు.

బూసాములెందుకుండారో కూలోళ్లు కూలోళ్లుగా ఎందుకైనారో తెలియచెపుతారు. యెన్నో జిత్తుల్తో ఎత్తులేసి ప్రభుత్వంలోకి బూస్వాములెట్లా యెక్కిపోతారు. అక్కడ కూచొని మొసలి కన్నీళ్ళు కారుస్తూ పేదరైతులకూ – కూలోళ్లకు కార్మికులకూ అందరికీ మేలు కలిగేటట్లు పథకాలు తయారు చేస్తున్నట్లు చెపుతారు. నమ్మించేందుకు ఊరూరా తిరుగుతా చెపుతా వుంటారు. మొన్న మొన్నటిదాకా బూసాముల్ని నమ్ముకొనే, ప్రభుత్వం ఏర్పాటు చేసుకొన్నారు. ప్రభుత్వంలో అందరూ బూస్వాములు, వాళ్లను మింగే పెద్దపెద్ద వ్యాపారస్తులూ వుండి వాళ్లకు చేతనైనంత దోపిడీ చేసినారు. చేయించినారు. యిట్లా ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకు అమెరికా అనే ఒక పెద్ద దోపిడీ చేసే, దోపిడీ చేయించే దేశం పెద్దగా సాయం చేస్తుందంట. అట్లా చేయకపోతే వాళ్ల దేశానికి లాభాలు రావంట. పెద్ద పెద్ద యుద్ధాలు యిరుగుపొరుగు దేశాల్లో జుట్లుకుముడి పెట్టి చేయిస్తారంట.

మనదేశం సంగతే యెత్తుకొందాం. బూములు మట్టసంగా సరిసమానంగా పంచితే యేమో – ఏంపోతుంది. పన్నులు కట్టుకొంటారు పండించుకొంటారు. ఒకరు యింకొకరికి కూలిచ్చేపని పోతుంది కదా. పెద్దోళ్ళు సంపాయించి పెట్టిన

బూమి దాన్ని మేమెట్ల వదులుకొంటాము అని అంటారు. పెద్దోళ్ళు సంపాయించిందే వాళ్ళు వదులుకోకపోతే – మనం చేతులారా చేసిన పనికి సరిపోయే కూలియిమ్మని మనుమడగలేమా – అది న్యాయం కాదా. కొన్నిదేశాల్లో స్వంతబూములూ స్వంతయిల్లూ లేనేలేవంట. మొత్తం భూమిని పండిస్తారంట. కావలసిన సౌకర్యాలన్నీ చేసుకొంటారంట. ఆదేశాల్లో మన కూలోళ్ల నాయకులు తిరిగి అన్నీ విచారించుకొని వచ్చి చెపుతా వుంటే – సంతోషంతో వళ్ళుబికి పోయిందే – ఎంకీ – అట్లుంటే ఎంత బాగుంటుంది నువ్వే చెప్పు" అని తడబడకుండా చెప్పినాడు దుగ్గన్న.

వెంకటమ్మకు అంతా వొకటొకటే అర్ధమవుతూ వున్నట్లుంది. మొన్న మీటింగని తప్పెట్లతో మనవాల్లంతా పోయింది అందుకేనా. ఆ మీటింగులో కలుసుకొన్నరనేనా మా అన్నగారూర్లో మనోళ్ల కొట్టాలు కాల్చింది. నాశనపోళ్ళు. యోగ్యత వుంటే సరైన కూలి ఇయ్యాల. లేకుంటే వూరుకోవాల. కొట్టాలు కాలుస్తే వూరకనే పనికి వస్తారా – అని ఆడోళ్ళూ పిల్లోళ్ళూ అందరూ ఆడిపోసుకొన్నారు అని వెంకటమ్మ ఆవేశంగా అనింది.

"అదొక పెద్ద బారతంలేయే. మనమూ మనతోపాటే వాళ్ళూ కూలీసంగాల నాయకూలూ ప్రభుత్వంవాల్లూ అందరూ కలసి వాల్లను ఆపదలో ఆదుకొన్నారు. ప్రభుత్వానికి బాగా తెలిసొచ్చింది. బూస్వాముల అగాయిత్యాలూ – ఆ వూర్లోనోకాదు దిన్నమూ పేపర్లలో చూస్తున్నాం – ఎక్కడో ఒకచోట ఇల్లకు అగ్గిపెట్టడం – కూలోల్లల్లో మిడిగా వుండేవాన్ని చంపడమో – ఆడోల్లను మానభంగం చేయడమో యిచ్చిన బాకీలు కట్టలేదని చితగ్గొట్టడం – ఒకటికాదులే ఎన్ని గోరాలు చేయచ్చునో అన్నీ చేసినారు. చేస్తున్నారు. బూస్వాములూ వాళ్లను కొమ్ముగాసే పార్టీలూ అన్ని సమయాల్లో కలిసి కవుసుకొంటున్నాయి.

ఎంకీ – ఏదో ఒకటి తేలిపోవాల్సిందే. వాళ్లు ఆడింది ఆట పాడింది పాటగా వుంది. ఎక్కడో ఒకసాట అడ్డు వేయకపోతే అందరం కూడా కూడూ గుడ్డాలేక ఎండల్లో బండలపైన ఎర్రచీమలు చచ్చినట్లు చావాల్సిందే.

“పెద్ద పెద్ద మీటింగులు పెట్టినపుడు నువ్వూ నీకు తెలిసిన ఆడోళ్లందరికీ నచ్చచెప్పి ఊరేగింపులకు పిలుచుకొని రావాల ఎంకీ యిది మనపని” అని ఆవేశంగా అన్నాడు.

“సరేలే మామా అంతా అర్థం కాకపోయినా మనకు ఎవరు సరిపోనోళ్లో తెలిసింది” అని అనింది వెంకటమ్మ.

బూస్వాములు పోవాల్సిందే – పెద్దపెద్ద బడా వ్యాపారులూ పోవాల్సిందే. ఏందిది ఎండకాలంలో మామూలుగా గుడిసెలు కాలిపోనన్నా పోతాయి. పెద్దోళ్ళ చేతుల్లోనన్నా పోతాయి. బతికేదే బరువైనప్పుడు కాలిపోయిన కొట్టాన్ని తిరిగే వేసుకోవాలంటే చిన్న సంగతా? బూములు పంచాల్సిందే కూలిపనీ నాలిపనీ పోవాల్సిందే. బడా వ్యాపారులు పోవాల్సిందే” అని ఆవేశంగా చెప్పిందే సెప్పుతూ వూగి పోయినాడు దుగ్గన్న.

“బద్రం మామా దొంగనాకొడుకులుంటారు. నిన్ను చూస్తే నాకేమో బయంగా వుంది. కొట్టాటల్లో ముందుంటావు” అని కొద్దిగా చలించింది వెంకటమ్మ.

“ఆస్తులున్నోళ్లు – యదపడాల. మనకేమీ – ఏమీ లేనోళ్లం, కాదంటే పిల్లలున్నారనే కదా. వాళ్లకేమి – యీడబడి ఆడబడి బతుకుతారు. నన్నుచూచీ – నేచేసిన పనులు చూచీ తిరిగీ హక్కులకోసం కొట్లాడే దానికి తయారువుతారు” అని అన్నాడు దుగ్గన్న ఆవేశంగా.

“ఎందుకైనా మంచిది నీతోడ్తనే వస్తా మామా – లేకుంటే బయంగా వుంటుంది” అని అనింది వెంకటమ్మ.

“ఎప్పుడంటే అప్పుడు పోతుంటాం. నువువద్దు. ఏం పరవాలేదులే – పెద్ద మీటంగులకూ వూరేగింపులకూ వస్తువులే” – అని అన్నాడు దుగ్గన్న.

చీకట్లో వెంకటమ్మ ఏమనుకొంటా వుందో – పక్కకు తిరిగి పండుకొంది.

కూలోల్ల పగ – కసీ – కుమ్మురాంలో పొగ లేసినట్లు లేస్తూ వుంది. వాళ్ళకోసం గట్టిచర్యలు తీసుకోకుంటే యింక కానేకాదు అని యీమధ్య ప్రభుత్వం

గుర్తించినా కూలోళ్ల పోరాటాల వివరాలు తెలియక విషయాలు తెలియక సన్నకారు రైతులూ చిన్న ఉద్యోగస్తులూ – యిప్పటికీ కూలోళ్ళ పక్క నిలబడకుండా వున్నారు. గింజలెక్కువ తాలు తక్కువా అని వాళ్ళకిప్పటికీ తెలియలా. దేశానికి కూలోళ్లు గట్టిగింజల్తో సమానం. ఉద్యమాల గాలీ బాగా పెద్దావుంది. తూర్పెత్తేందుకు జనమూ వున్నారు. గట్టిగింజలొకపక్కన తాలు ఒక పక్కన బాగా పడుతువున్నాయి. ఈ దేశం కల్లంలో కోలాహలంగా వుంది. గాలి తగ్గక తలికే తూర్పు పొయ్యాలని చేటలందించేవాళ్లు ఆలుపు లేకుండా అందిస్తూనే వున్నారు. సళ్ళు కొట్టేవాళ్ళు నుసీనూగూ – మీద పడుతున్నా పట్టుదలగా సళ్ళు కొడుతూనే వున్నారు. నెట్టుపీటల మీదవున్న గట్టి గింజల నాయకులు విరామమెరక్కుండా తూర్పెత్తుతూనే వున్నారు. యిదిరా సమయమనీ యిదే తుదిపోరాటమనీ నడిమి తరగతి తెలుసుకోనేదెట్లాబ్బా" అని అనుకొంటూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు దుగ్గన్న. ఎంత పొద్ద పోయిందో పాపం.



# కాటిగాడు

కాటిగాడు గొప్ప బలవంతుడు. తెలివైనవాడు. రైతు పనుల్లో ఆరితేరినోడు. చేన్లకు కట్టలు కట్టడం బాగా చేతనవుతుంది. చేలో గరికనట్టు తవ్వడం అంటే కాటిగానికి కొట్టినపిండి. నేలరాళ్ళు పెరకడం నేలమొద్దులు వెళ్లెయిడం నేర్పుగా చేస్తాడు. కట్టెలు కొట్టడంలో వైపూ వాటమూ తెలుసుకొన్నవాడు. కంబములావు ఎలమమాన్ను కూడా కుడిఎడమల వాటంగా గొడ్డలితో రెండేట్లువేసి మెట్టుకాలితోతన్ని ఇరుగ పొడుస్తాడు. బండికి సరిపోయినన్ని కట్టెలు గంటలో నరుకుతాడు. చీకి విడిపించుకొని బండికి పేర్చుకోవడమే ఆలస్యం. ఎంతో ఓర్పుగా మోట కష్టాలు కూడా చేసేవాడు. అవసాన కాలంలో చిల్లర దొంగతనాలకు మరిగినాడు.

చేత్తో కుట్టిన మడత సల్లాడం తొడుక్కొని, దట్టీకట్టి, వంటి పొరసెల్లా బుజాన వేసుకొని బిర్రుగా నడిచి పోయేటప్పుడు కాటిగాన్ని చూడాల. దొంగతనాలకు పోయినప్పుడు కారు పొట్టేలును దుప్పటిలో ముదరచుట్టుకొని వీపున కట్టుకొని పరుగెత్తగలడు. గొడ్డు, గొట్టెలను, కారుపోట్టేల్లను దూరపు వూర్లకు దొంగిలించుకొని పోయి రావడం – కోసి బాగాలు వేసి అమ్మడం – బండిరుసులూ – గుంటక నగలూ, పలుగులూ, కాడిమాన్లూ మొదలైన రైతు యారముట్లను దొంగిలించడం. వాటిని పోయినంతకూ అమ్మి వచ్చినదాంతో తానూ తన పెళ్లామూ యిద్దరు పిల్లోల్లూ బతికేవారు. ఎప్పుడన్నా దొంగతనము బయట పడితే సామాన్లు అమ్ముకొని తిని వుంటే దెబ్బలు తింటాడు లేదా దొంగిలించిన సొమ్మును వాపసు చేస్తాడు.

"నీకు చేతగాని పనేముందిరా కాటిగా – ఎందుకిల్లా మారిపోయినావు" అని అంటే "దొంగసొమ్మును నేను అమ్మితే ఎందుకుకొనాలయ్యా. అమ్మేందుకు పోతే అతి రహస్యంగా డబ్బు లిచ్చి యారముట్లను అట్టం మీద దాచుకొంటారు. దొంగపొట్టేలి మాంసం బాగా కొనితింటారు. అగ్గువ సరుకని ఎగబడికొని

తింటారు. అప్పుడప్పుడు ఉసితిరగనప్పుడు మాంసం డబ్బు ఎగ్గొట్టినోళ్ళూ వున్నారు. పచ్చికంకులు దాసప్పా అంటే – రాలిన మాత్రం గోవిందా అని వూరకుండేవాన్ని. దొంగసొమ్ములు కొన్నవాన్ని కొట్టలేదు. దొంగను కొట్టారు. కొంతమంది ఏరా కాటిగా యీనడమన వేటకు పోలేదా అరగలేదా – అనో ఎగతాళిగా మాట్లాడుతూనే – వచ్చిపోతూ వుండ్రా" అని అంటారు. కాటిగాడే అందరికీ అదవ చిక్కినోడు" అని విసుగ్గా అంటాడు.

కాటిగాడు ఎనభైఏళ్ళ మనిషి – దాదాపు యిరవై ఏళ్లుగా చిల్లర దొంగతనాలు చేసి అడపా దడపా పనులకు పోయి బతికినాడు. అంతకు ముందు దాదాపు యిరవైఏళ్లు నేర్పరిగా ముమ్మరంగా కష్టం చేసి బతికినాడు.

కాటిగాని పెళ్లాం రంపెతో సమానమైంది. ఆమె కూడా కాన్పులు లేనప్పుడు కాటిగానితో సమానంగా పని చేసింది. కాటిగాని సంతానం అందరూ బతికి వుండి వుంటే పద్దెనిమిది మంది సంతానంగా వుండి వుండేది. కాటిగాని పెళ్లాం ప్రతి ఏడాదికీ ఏన్నర్దానికీ తప్పకుండా తీర్థమాడేది. అదే కాటిగానికి విసుగు. సంతానమన్నా సరిగా వుందా అంటే జ్వరమో పులకరమో వచ్చి కొన్నాళ్లు బతికి చావడం – పాపం యిదీ వరుస. ఎట్లనో అన్ని గండాలు గడచి యిద్దరు మొగపిల్లలు బతికినారు. వాళ్ళు ఎట్ల బతికి బండలేసుకొన్నారో తెలియదు. గోడల కిందా కొమ్మలకిందా ఆడుకొంటూ మన్నూ మశానము తింటూ బతికినారు.

కాటిగాని జీవితంలో ఏదో పెద్ద విశేషం ఉంది బాగున్నోడు దొంగయినాడు. పాపం వాడూ వాడి పెళ్లామూ ఎన్ని విలయాలను ఎదుర్కొన్నారో, ఎన్ని అవమానాలకు గురి అయినారో జీవితంతో రాజీపడి ఎన్ని తిరగుళ్ళు పడినారో. చనిపోయేటప్పుడు ఎత్తు తెలియని పిల్లోల్లు తెచ్చిన కూలిగింజలు చాలక అరగొర తిండితో తీసుకొని తీసుకొని చచ్చినాడు.

కాటిగాడు ఎందుకిట్లయినాడు. వాడు ఎందుకు దొంగగా బతకాల్సి వచ్చింది? కూలిగింజలతో బతకవచ్చు కదా అని అనుకొంటువుండే వాన్ని మొదట్లో ఎప్పుడూ ఆ కొట్టం చూరు కింద కూర్చొని వుండేవాడు కాటిగాడు చావుదినాళ్లో.

చచ్చేముందు కాటిగాడు ఓ రోజు చూరుకింద మామూలుగా కూర్చొని వుండినాడు. అప్పటికే బాగాదసిలిపోయినాడు. చూపులు మాంద్యమైనాయి. వెంటనే గుర్తుపట్టలేడు.

"ఏరా కాటిగా బాగుండావా" అని అంటూనే; కనుక్కొని "రాబ్బా – యీ మద్యచూపులు ఆనవు. కనుక్కోలేనబ్బా. మాటని బట్టి గుర్తు పట్టాల్సిందే. అందుకే ఎక్కడా పోలేను. ఏదో పిల్లోల్లు యింతపడేస్తే తిని పడుంటాను. ఎప్పుడన్నా అట్లా వత్తామంటే కుదరలేదబ్బా. కాళ్లల్లో సతవలేదు" అని అన్నాడు. యింకేమి మాట్లాడుతాడు. పక్కనవున్న కుక్కి మంచంలో కూలబడినాను. కాటిగానికి కట్టె చేతికి వచ్చి చాల రోజులయింది.

కాటిగాడు గొంతుకూర్చొన్నవాడు సతికిల కూర్చొని గోడ కానిచ్చిన కట్టె పడుతుందేమోనని కిందపెట్టినాడు. ఉత్తకడుపు అంటుకొని వదులు వదులుగావున్న మడత సల్లాడాన్ని ఎగదోసుకొని, కప్పుకొనే పాత చింకి సెల్లాను వీపుపై ఒత్తుగా గోడకు ఆనించి తాను సౌకర్యంగా గోడకు ఆనుకోని కూర్చొని కొంచెంసేపు ఆలోచనలో మునిగినాడు. కాటిగాడు తన్ను గురించీ తన పిల్లోల్లను గురించీ ఏం చెపుతాడోనని బెదురుగా వున్నాను. నన్నుచూచి తనకత చెప్పాలనుకొన్నాడోయేమో "బాగా వినండబ్బా – నిజం చెప్పినా వింటారు అబద్ధం చెప్పినా వింటారు – నిజం మాట్లాడినా – నీతిగా బతకాలన్నా – నా బతుకులో పడలేదబ్బా – తప్పయితే మన్నించుకోండని" మొదలు పెట్టినాడు. కాటిగాని ముడుతల మొగం బిగుసుకొనింది....

"మా నాయనా అమ్మా బాగాబతికినోళ్ళు. వాళ్లకు ఎన్నో ఏళ్లకుగాని నేను పుట్టలేదు. చుట్టూ దేవలాలన్నీ తిరిగినారు. దేవతల్ను కొలిచినారు. పిల్లలపలం

లేదని దిగులుపడినారు. ఇన్ని గొర్రెపిల్లల పెట్టుకొని ఒకయ్యకు కూలికి పోకుండా బతికినారు. వారికి దినదినానికి పిల్లోళ్ళులేని దిగులు ఎక్కువయింది. కూటికి గుడ్డకు లోటులేదు. విన్నోళ్ళూ కన్నోళ్ళూ వాళ్లను గురించి బాగా చెప్తారు. మా అమ్మానేనెట్లా పుట్టిందీ చెప్పింది. ఎవరివరాన పుట్టిందీ చెప్పింది. మా అమ్మ పెద్ద కుంకుమ బొట్టుతో – ముక్కు పోగుతో – చేతుల్లో వెండి కడేలతో – పెద్ద ముత్తైదువుగా – పంచన ఏకులరాటం పెట్టుకొని ఏకులు వడికేది. నా కండ్లారా చూచినా. గొర్లదొడ్డి వూడ్చి – కాళ్ళూ మొగం కడుక్కొని సద్దితిని ఏకులు దిన్నమూ వడికేది. మాకు చాలినన్ని గుడ్డలుండేవి. మా అమ్మ! అమ్మ! ఎంతమంచిదో చెప్పలేమబ్బా! నన్ను కింద దించకుండా సాకింది. మా నాయనో! మంచి బలవంతుడు వడతిరిగిన కండల్తో. అడవిలో ఏ జంతువుతోనైనా తలపడి చంపగలవాడు. ఒకటి రెండుసార్లు కట్టే కంపాలేకుండా తలపడి ఒడుపుగా చిరుతపులి వెనుక కాళ్లు దొరికిచ్చుకొని నేలకేసి కొట్టినాడంట. మాకొండల్లో ఏదడికైనా ఏకన్నె రాళ్ల సెలకల్లోకైనా గొట్టెపిల్లల్ని ఏగదోలి బాగా మేపుకొని పిల్లపోకుండా మళ్లించుకొని దొడ్డికి వచ్చేవాడంట. ఆయన జీవితమంతా గొట్టెలగాసే బతికినాడు. రోగంవచ్చో – వానలో ముసురుగా చిక్కుకొనో – గొట్టెపిల్లలు చచ్చినాయే గానీ మెకంవాత పడలేదబ్బా. అట్లాటోడు మా నాయన. మా అమ్మ నార్సల్‌గట్టు బంగారుతో సమానమైంది. బందువులెందరొచ్చినా బువ్వపెట్టి సాగనంపేది. ఆమెకు ఒకేఒక్క దిగులు. ఒక్క నలుసు లేకపోయెనే అని.

ఆ కాలంలో కాటమయ్య కోనకు పిల్లల పలానికి పోయేవాళ్లంట. మాయమ్మా నాయన కాటంకొండకు పోవాలనుకొన్నారంట. గొట్టెపిల్లల్తో యాతన గట్టిగా పోవాలని అనుకొని వరుపులోన కూడా గడ్డివుండే కొండ కాబట్టి – మందతోనే పోతే బాగుంటుందని అనుకొన్నారంట. అదే పాటు పక్కింటోళ్లకు రెండు నెలలు రామని చెప్పి – మందతో కాటమయ్యను తలుచుకొంటూ పోయినారంట. కోనకు వారం వారం బక్తులు వస్తారు. బక్తులు ఎట్లా పూజలు చేస్తారో అట్లనే

మయమ్మా ఐదువారాలు పూజలు చేసిందంట. కాటమయ్య రాముని బక్తుడంట. కాటంకొండ పెద్దది. పేటుకింద నిలబడి యెగచూస్తే నెత్తిగుడ్డ నేల పడ్తాది. అంతయెత్తుందంట. కొండ సగానికి నరికినట్లుందంట అక్కడ. ఒక గుహలో కాటమయ జపము చేస్తూ వుంటాడంట.

ఆంజనేయసామి మందుల కొండెకత్తరాను ఆకాశంలో పోతూ – కోనలో రామనామం విని – ఆకాశమార్గన పోయేవాడు, అట్లనే కిందికి వూపుగాదిగి – ఒక కాలు కుడికాలు – ఒక పెద్ద బండమీద మోపినాడంట. అంతలోకే రాముడు ప్రమాదంలో వున్నాడనీ – మందులకొండ పొద్దుపొడవక ముందే తేవాలనీ – మళ్లీ అట్లనే యెగిరి పోయినాడంట. దిగిన వూపులో బండలో ఆంజనేయసామి కుడి పాదం లోతుగా దిగబడిందంట. ఆ అడుగులో యిప్పటికీ నీళ్లుంటాయంట. జానెడు లోతుకూడాలేని ఆంజనేయ సామి అడుగులో నీళ్ళు మంచినీళ్లు చెంబు ముంచుకొంటె చెంబుకుంటాయంట.

మా అమ్మ కాటంకోనలో వున్న ఐదువారాలూ మా నాయన ఆ కొండచుట్టూరా తిరుగుతూ గొఱ్ఱెపిల్లల మేపుకుంటూ వుండినాడంట. రాత్తిర్లు దగ్గరవూర్లో మందను ఒడిగించేవాడంట. కాటమయ్య మీద బారంవేసి – పూజలయిపోయినాక – మాయమ్మ మా నాయనా వూరితోవ పట్టినారంట. వూరికి వస్తూనే మా యమ్మకు నేను కడుపున పడినానంట. మా యమ్మ “మా కాటడు వరాన పుట్టినాడని” చెప్పుకొని మురిసిపోయేదంట. మా నాయనకు యెంత సంబరమో ప్రతి గొఱ్ఱెపిల్లనూ నా పేరుతోనే పిలిచేవాడంట. మాయమ్మ నన్ను కింద దింపకుండా సాకింది. నేనాడుకోనుపోతే నాతోనే వచ్చి నాతోనే ఆడుకొనేది. నన్నూ నా ఆటలూ మాటలూ చూచి విని ఆనందపడేది. వాళ్లకు ఎంతమురిపెమో నాకిప్పటికీ కండ్లకు కట్టినట్లుంది.

నేను అన్ని పనులూ మానాయన చచ్చిపోయినాకనే నేర్చుకొన్నాను. మా అమ్మ ముత్తైదుచావు చచ్చింది. అప్పటికి నాకు పదేళ్ళు. మా అమ్మ పోయినాక నాకు తిండి సరిగా అబ్బేదిగాదు. కవిలె బావులకాడ చిన్న చిన్న పనులు చేసి

సంగటి తినేవాన్ని, మా నాయన ముసిలోడైమందకు సరిగా పోలేకుండినాడు. ఏ పనీ చేయలేకపోతూ వుండినాడు. చేతగాక గొఱ్ఱెల్ని అమ్మేసినాడు. "మందను అమ్మినావే ఎట్లా అని ఎవరన్నా అడిగితే నా కాటడు కాయలేడు – అడవుల్లో పని – క్రూరజంతువుల్తో పని – ఇక మీదట వానికీపని వద్దు" అని అనేవాడు. వచ్చిన డబ్బుతో ఒక కుంట భూమి కొని నాకప్పగించి "నాయనా కాటడూ రైతుపని నేర్చుకో – వూరు చూపెట్టుకొని వుండు – నీకు లోటుండదులే – వరాన పుట్టినావు" అని పదేపదే చెప్పినాడు. పోగాలపు దూములో మా నాయన చచ్చిపోయినాడు. నన్ను ఒంటరిగా బతకమని యీ వూర్లో పారేసి పోయినాడు" అని ఆగినాడు.

కాటిగాని గొంతు బిగసకపోయింది. నీరెలుగుపడింది గొంతులో. పాపం అనిపించింది.

గొంతు సవరించుకొని "చూడబ్బా అప్పటికి నాకు పదహారేండ్లు. దిన్నమూ రైతుపనుల్లో యాల తప్పకుండా కూరుకొని పోయేవాన్ని. శ్రద్ధగా అన్ని పనులూ నేర్చుకొన్నాను. కూలి ఎంత యిచ్చినా సరే పని ముఖ్యం అని చేసేవాన్ని. అట్లా పదేండ్లు కష్టపడినా. రాత్రి పగలూ రైతుల ఇళ్లల్లోనే వుండేవాన్ని.

కొట్టమూ, ఒకకుంట చేనూ వుందనీ – పనీ పాటా బాగా వచ్చుననీ – మా బందువుల్లోనే ఒక పిల్లను నాకిచ్చి వాళ్లే ఖర్చు పెట్టుకొని పెండ్లి చేసినారు. యాడింతా వున్న కొట్టాన్ని సరిచేసుకొని నేనూ నా పెండ్లాము యీకొట్టంలోనే కాపురం పెట్టినాము. యిద్దరమూ రైతు పనులకు పోయేవాళ్లం చేన్ను – రైతుల్తో యిత్తించుకొనే వాన్ని. దాని మొగాన ఎరువు ఎంపలీ చల్లకుండా వుంటే ఏంపండుతాది. కొన్నేళ్లకు చేను బీడుగా మారింది. సేద్యాలు సరిగా కాకా – చెట్టూ పుట్టా పెరిగీ – తరంగాకుండా పోయింది. నాపైరూ దక్కకుండా పోయేది. ఉండీ లాభంలేదని రైతులకు అమ్మేసినాను. ఏమొస్తుంది ఎవరికీ కాబట్టని దానికి. ఒక యిరవై రూపాయలొచ్చింది. అదీ పోయింది. కొత్తకాపురంలో కొన్నాళ్లు సుకపడినాం అంతే ముసురు కొన్న మబ్బుల మాదిరీ కష్టాలు

మొదలైనాయి. కాన్పుల్లో నా పెండ్లాము నాతో పాటీ పనిలోకి వచ్చేది కాదు. ఏడాదికీ ఏన్నర్దానికి కాన్పు వస్తుంది. పుట్టిన ప్రతి పిల్లా పిల్లోడూ – దోగడ్తానో – నడుస్తానో, బాగా వుండినట్లుండి ఏదో ఒక దొంద వచ్చి చచ్చి పోయేవాడు. ఖర్చులు ఎక్కువయినాయి. నా పెండ్లాం కాన్పుల యాష్టతో పనులు సరిగా చేయలేకపోయేది. యాడాదిలో రెండు మూడు నెలలు పనిలోకి వచ్చేది. సంటిపిల్లనుగానీ – పిల్లోన్ని గానీ ఆడించుకొని కొట్టం చూపెట్టుకొని ఉండేందుకక్కాడ ఒకపిల్లో పిల్లోడో బతకలేదు. పుట్టెడు దుఃఖంలో అలమటించిపోయేది నా పెండ్లాం. ఎప్పటికప్పుడు ఓదార్చుకొంటూ – తాలచెప్పుకొంటూ నేను పనికి పోయేవాన్ని. ఇంట్లో ఒకొకసారి కూడుండేది కాదు. చెప్పలేనబ్బా 'థూ' పాడుబతుకు. నాకూ మానాయనకూ పోల్చుకొంటే సంబంధమేలేదు. గొఱ్ఱెల కాసేది తప్ప మానాయనకేపనీ రాదు. నాకు అన్ని పనులూ వచ్చినా గడిచేది కష్టమైంది. నేను గొఱ్ఱెల కాయడం మానాయనకు యిష్టంలేదు. అద్దుమానపు అడవుల్లో తిరగలేననీ – కష్టపడ లేననీ – వూరి పట్టున యింటి పట్టున సుఖంగా బతుకుతాడనీ అనుకొన్నాడు. ఆయన మాటెంబడే రైతు పనుల్లో కుదురుకొన్నా. ఈ పనిలో యిన్ని కష్టాలుంటాయని తెలియదు. ఇంత ప్రమాదం వుంటుందనీ తెలియదు. అతి తక్కువ కూళ్లకు పని చేయించుకొంటారు. చాలదంటే – అబ్బబ్బ తరం నుండీ యీకూలే యిచ్చేది అని అంటారు. లేదనకుండా ఏ ఇంటికాడికి పోయినా చిన్న చిన్న పనులు చేస్తే ఇంత బువ్వ పెడ్తారు. జరక్క ఆ పనులూ చేసినాను.

అబ్బా! ఇక్కడి నుండీ బాగా వినండి. తప్పుంటే మన్నించండి. ఒకరోజు ఆకలెక్కువయింది. చెవుల్లోకొచ్చింది పానం. జొన్నచేలు బాగున్నాయి. జొన్న పిసుకుళ్లు తిని నీళ్లు తాగాలనుకొన్నాను. చేను కోయంది చేలో అడుగు పెడ్తే తంతారని బయపడినా. అయినా జొన్న కంకులు విరిచి దుప్పట్లో మూటకట్టుకొని యింటికి తెచ్చుకొన్నాను. ఇంట్లో చేరిందాకా బెదరు పోలేదు. జొన్నకంకులు చూచిన పెండ్లాం చెడామడా తిట్టింది. "ఏంపని, కనుక్కుంటే రైతులు కొట్టనొస్తారు.

చేలో కంకులిరిసిన మోట్లు చూసి – పసిగడ్తారు. ఎవరో ఒకరు చెప్పనే చెప్తారు 'ఛూ' అని విసుక్కొంది. ఏం చేసేది. తినేందుకు ఏమీలేక తెచ్చినానని బతిమాలుకొంటే వూరుకొనింది. జొన్న పిసుకుళ్ల కంకుల్ని సగానికి చీల్చి పట్టలోపోసి నేనూ నా పెండ్లాము – ఎత్తిపట్టి కదిలిస్తూ – సంగటికేలికే తెడ్డు కట్టెతో బొంతురాలకుండా పిసుకుళ్ళ రాలగొట్టినాం. తిన్నాం నీళ్ళు తాగినాం. పానమొచ్చింది. పచ్చి గగ్గుల్ని ఏం చేయాల్నో దిక్కు తెలియక పొయిలో వేసి కాల్చి పారేసినాం. ఎట్లో ఆ దొంగతనము బయట పడలేదు. నిజంగా ఆ రాత్రి నిద్రపట్టలేదు. దొంగతనం కాకపోయినా దొంగతనమని అవమాన పరుస్తారు. కొట్తారు. ఎంతపని చేసినా తిండికి చాలదు. పని వుంటే కూలి వుంటుంది. లేకుంటే పనికొచ్చి చెల్లు పెడ్తానని గింజలు అప్పు తెచ్చుకోవాల. నొప్పీనొయ్యీ వచ్చినపుడు అడగ బట్టదు. ఎందుకింత తక్కువ కూల్లిస్తారో ఎవరూ చెప్పరు. "అనాది నుండీ యింతేరా" అని అంటారు. పని లేనప్పుడు యింకా కష్టం. మంచి అనిపిచ్చుకొని చెడ్డ అనిపించుకోవాలంటే మనసొప్పదు.

ఒకరోజు నేదర పిల్లోని పక్కలో వేసుకొని నాపెండ్లాము ఏడుస్తూ వుంది. ఒక పొద్దున లేచి గమనించినా. ఏమంటే ఏమంటుంది? సరిగా బువ్వలేదు. దిక్కు తెలియలా, నాకు లేకుంటే మానే. యిద్దరముండి యిద్దరే యిద్దరు పిల్లోల్లకు బువ్వ పెట్టలేకుండా వుండాము. "యాడన్నా నట్టు తొగేది ఒప్పుకో లేకుంటే కాలవకింద బూములుండే వూర్లకన్నా పదాం పదా" అని అనింది. కుములుకొని ఏడ్చింది. బతకలేం "పదాం అంటే పదాం" అని అనింది, కాటిగానికి కళ్లల్లో నీళ్లు మెదిలినాయి.

ఉన్న వూర్లో బతక లేకుంటే ఎక్కడో పరాయివూర్లో బతుకుతామా అని – అదేప్పోతా – పోయినాను. పులి వేటకు పోయినట్లు. సగరేత్తిరికాడ పక్క వూర్లో గొర్లమందకు పోయి – ఒదిగిన మందలో చప్పిడి కాకుండా మంచి కారు పొట్టేల్ని దుప్పటిలో మూటకట్టుకొని అదేప్పోతా సంతకు పోయి అమ్మినాను. ఐదు లూపాయలొచ్చింది. నేనెప్పుడూ వొక్కసారిగా ఐదు

చూడలేదు. అదే మొదటిసారి. అబ్బిళ్లు కోరికి సంతోషపడినాను. ఆ డబ్బుతో ఆ నెల సుఖంగా గడిచిపోయింది. పొద్దస్తమానం వంచిన నడుము ఎత్తకుండా గుద్దేలితో మోకాటిలోతు కీటు పెట్టి రేగడి పెళ్లల వూడపెరికి 'నట్టు' తొగితే దినానికి ముంతెడు గింజలు – లేదా రెండణాలు లెక్క యిస్తారు. నట్టు తొగడమంటే సన్నపని కాదు. మళ్లీ మొలకెత్తకుండా తొగాల లేకుంటే – మొలకనట్టు కూలి లేకుండా, వచ్చే ఏడాది వూరక తొగాల. నట్టును చంపాల అంతే, అప్పటి నుండి చిల్లర దొంగతనాలకు మరిగినా. అదీ నా సంసారానికి సరిపోయేమటుకే. నీకు చెప్పకేం చాలాసార్లు చావగొట్టినారు. చిల్లర దొంగతనాలు కాబట్టి కేసులు పెట్టలేదు. రణపెంకెల్తో పొట్లాటలూ జరిగినాయి. ఐనా దొంగతనాల్ను మానుకోలేదు. గొడ్డు గొట్టెల్నో , కారు పొట్టేళ్లనో తెచ్చుకోవడం అమ్ముకోవడం లేదా కోసి బాగాలేసి మాంసం అమ్ముకొని జీవించడం – ఏమీ దొరక్కపోతే రైతులయారముట్లు దొంగలించి అమ్మడం చేసినాను. వానకాలంలో జింకలను వేటాడేవాన్ని. దొంగ సామాన్లు కొనుక్కున్నవాళ్లు కొన్ని సందర్భాల్లో నన్ను కాపాడినారు.

ఎటోచ్చీ యిప్పుడు బయపడుతున్నానబ్బా. ఎందుకంటే పిల్లోల్లు నాయంత బలవంతులు కాదు. పొట్టేల్ని దుప్పటిలో కట్టుకొని రాలేరు. బండిని వొతికలదొబ్బి గాండ్లు వూడదీసి చప్పుడు కాకుండా బండిరుసును వూడబెరకలేరు. మానవులకు తెలియకుండా దూరపు వూర్లకుపోయి గుట్టుగా అమ్ముకొని రాలేరు. దూరపువూర్లకు పోయి తెచ్చి మనవూర్లో అమ్ముకోలేరు. సత్తాలేదు. వైవూవాటమూ తెలియదు. పాపం యీమద్యనే నా పెండ్లామూ చచ్చిపోయింది. కొన్నాళ్లు నా దొంగతనాన్ని కాదన్నా పిల్లోల్లు తానూ యింత తింటున్నామని సర్దుకొని పోయింది. కాటిగాని కళ్లల్లో తడి కన్పించింది. ఎగతోసుకొంటూ చెప్తుతున్నాడు "పాపం ఏం చేస్తుంది ఊంపెతో సమానమైందే కాలం గడసొద్దూ. కూలి బతుకు బతుకు కాదబ్బా. ఏదో ఒక పని చేసి యితరుల కన్నుగప్పి వడుపుకొంటే తప్ప బతకలేం. అదే నేను తెలుసుకొన్న సత్తెం అని ధీమాగా చెప్పినాడు కాటిగాడు.

అంతలోనే పిల్లోల్లు జ్ఞాపకం వచ్చినారో యేమో – “యీ పిచ్చినాయాండ్లు కూటికి సంపాదించుకొంటారా – నామాదిరిగానైనా బతుకుతారా” అని నొప్పిగా చెప్పినాడు.

“నీ మాదిరి నీపిల్లోల్లూ బతకాలని వుందా” అని అంటే “ఎట్లబ్బా నువ్వే చెప్పు కూలోడు కూలోడుగా బతకాలంటే అవుతుందా – ఆరు నెల్లు పనుంటే ఆరునెల్లు పనుండదు. వున్నరోజుల్లోనైనా కష్టానికి నాయంగా కూలి యిస్తారా అంటే యీరు. చూచి చూచి యీలేరు. ఎరుకల, యానాది, సుగాలి మొదలైన వాళ్ళంతా ఎందుకు కొండల్ను చూపెట్టుకొని, అడవి జంతువుల్తో పొట్లాడైనా అక్కడనే బతుకుతున్నారు. కష్టానికి తగిన కూలిస్తే వూర్లలోకి వస్తారు. ఎవరు చూచినా వూరక పని చేయించుకోవాలనే చూస్తారు. దొంగ సొమ్ములు అగ్గువగా కావాలనీ చూస్తారు. బీదోళ్ళకు కాలమాబ్బా ఇది? అయ్యో పాపమని అనేవాడేలేడే. మా నాయన కొండల్లో వుండి బాగా బతికినాడు. యిదబ్బా నాకు తెలిసింది. నీవేమన్నా అనుకో పిల్లోల్లు మీరనుకొన్నంత నీతిగా బతకలేరబ్బా” అని మొగం దించేసుకొన్నాడు. కాటిగాని కళ్ళలో మళ్ళీ నీళ్ళు మెదిలినాయి.

తే॥గీ॥ కావ్యముల విమర్శింపగ కావ్యములనె
అల్లి చూపెను వైసివి ఉల్లమలర
రంభ, మేనకన్ భువికి సంరంభమొప్ప
దించి పాత్రోచితత్వము తెలియ నిలిపె

– పి. సుబ్బరాయకవి

# రెడ్డొచ్చె మొదలెత్తుకో

దేవుడుంటే యిట్లెందుకుంటుంది. ఒక పిల్లది మూగిది. యింకొకపిల్లది చెవిటిది. పెళ్లాం చూస్తామా అంటే శక్తిలేనిది. ఊసుకాళ్లది. ఏ పనీ అలుపు లేకుండా చేయలేదు. చిన్నాపెద్దా కలసి ఆరుమంది పిల్లోల్లతో ఆస్తులు పస్తుల్తో ఆరిపోతావుంది. మొగుడున్నాడు. వానికీ వూరూలేదు పేరూలేదు. యిల్లూలేదు వాకిలీలేదు. ఏ గోడకిందనో ఏ చెట్టు కిందనో పడివుండాల. రోగిష్టి భార్యతో ఎత్తు తెలియని పిల్లోల్లతో బతుకుల్లో బండలేసుకోవాల. మామూలు మనిషి. వానికి మామూలు కూలిస్తారు. పని చేతకాదని సాకు పెట్టారు. మూగిదీ – చెవిటిది – ఆడపిల్లలు. పనికెదిగినారు కాబట్టి సరిపోయింది. వాళ్లింత తెస్తారు. వాళ్లేదిక్కు. వూరుకోకుండా పని చేస్తారు. ఎటొచ్చీ సేరు గింజలు తెస్తారు. పనిలేని దినాల్లో నాలిపని చేసి బువ్వ తెస్తారు. సెరిరెండు ముద్దలు సంగటి సంపాదిస్తారు. ఎవరెవరు ఎంత తింటారో ఎట్ల పంచుకొంటారో తెలియదు.

ఎవరిని చూచినా పని చూపిచ్చుమని సైగల్తో మూగిపిల్ల అడుగుతుంది. ఏమి చెప్పుతాడా అని వాళ్లనోటి దిక్కు చూస్తూ వుంటుంది చెవిటి పిల్ల. పెద్దోలిద్దరూ మాలోకంలో పడి దిక్కు తెలియనిస్థితిలో ఆలోచిస్తూ వుంటారు. చిన్న పిల్లోల్లు బిక్కుబిక్కున సూస్తూ ఏమైనా తెస్తారేమో – తెచ్చినారేమోనని అక్కగారిదిక్కు ఆశగా చూస్తుంటారు. వాళ్ళందరికీ మానాన్ని సరిగా కాపాడుకోవడానికి బట్టలు లేవు. అన్నీ అడక్కచ్చుకొన్న చింపిరి బట్టలే. వూర్లో వున్నప్పుడు ఆ కుటుంబాన్ని చూచిచా ఒకటి రెండు దఫాలు తోచిందివ్వడమూ జరిగింది. కుటుంబ పెద్ద గంగడు చేతనైనంతాపని చేస్తాడు. పేడా, కసువూ – పొట్టూ సొప్పా దంచేదీ యిసిరేది – ఏదో చిన్నచిన్న పనులు చేసేదికాక వరుపు సేద్యాలకూ – నీళ్ళకాడికీ – గడ్డి తీయను – పోతాడు. వానికి బతికేది చేతకాదు. మూగిపిల్లతో చెవిటి పిల్లతో – రోగిష్టి భార్యతో – ఇంకా నలుగురు చిన్న పిల్లోల్లతో ఎట్ల బతుకుతాడు అని అనుకొంటుండేవాన్ని. ఎండిన కట్టె. ఎప్పుడు పోతుందో అన్నట్లుంది వాని పెళ్లాం. నాకు జూడ పిల్లోళ్లు యినీ ఆమె

ఆ స్థితికి వచ్చిందోమో. వాళ్లు తెచ్చే తిండి తినలేక కుములుకొని అట్లా అనారోగ్యంపాలైందేమో! అప్పుడప్పుడు చిన్నపిల్లోల్లను చూచి ఏడ్చుకొంటూ వుంటుందంట – మొగుడే చెప్పినాడు. ఆ కుటుంబమంతా గోవిందరెడ్డింట్లో పనివున్నప్పుడంతా చేస్తావుంటారు. అతను ఎంత కూలిస్తే అంతే, గంగడు మాత్రం – ఆ యింట్లో గాడిపాటలూడ్చి పొట్టూ సొప్పా తెచ్చి – యిస్తూ వుంటాడు ప్రతి నిత్యం – ఎవరికైనా పనికి పోవాలన్నా ఆ పనులు విధిగాచేసి పోవాల్సిందే.

ఊడిపడినట్లు గంగడు వచ్చినాడు. అప్పుడేలేచి మొగం కడుక్కుంటున్నా "ఏరా గంగా బాగున్నావా"అని అన్నాను.

"మేదావున్నే బతుకుతాబ్బా. ఆవూర్లో బతకలేను" అనికంట నీరు పెట్టుకొన్నాడు. "చ – ఏడ్చేదెందుకురా కూర్చో అని మీ పిల్లోల్లూ పెళ్లామూ బాగున్నారా" అని అన్నాను.

"అందరం వచ్చినామబ్బా. రాత్రి రైల్లో టిక్కటు లేకుండా వచ్చినాము. పక్కన అరస్టేషన్‌లో దింపినారు. అక్కడి నుండి నడిచి వచ్చినానని" నేలకు తల వంచుకొని దిగులుగా గొంతు కూర్చొన్నాడు.

"ఏరీ వాళ్లెక్కడున్నారు. పిలుచుకొనిరాపో" అని తరిమినాను. నా మాటల్లో ఆదరించే ధోరణి కనపడిందెమో ఉత్సాహంగా పరిగెత్తినట్టుపోయినాడు. నాకూ దిక్కు తెలియలా టౌన్లో ఎట్లా యీ కుటుంబాన్ని ఆదుకొనేది. నాచేత నవుతుందా" అని ఆలోచిస్తున్నాను. తోటకాడికి పంపిస్తే – పంపి ఏం చేయాలా స్వంత సేద్యం లేదే. అక్కడా వొకయ్యకు పనికి పోవాల. ఉండూరు కాదు. వాన్నీ వాని కుటుంబాన్నీ పనికెవరు పిలుస్తారు. ఏమైన తోట వద్దకే పంపాలని అనుకొన్నాను. అంతలో అందరూ వచ్చినారు. నేను మొదట చూచింది వాని భార్యను ఏముందీ పాపం చిక్కిపోయింది. వట్టికట్టె. ప్రాణం వుంది అంతే. మూగిపిల్ల చెవిటిపిల్లా నన్ను చూచి నవ్వు ముఖాలు పెట్టినారు. చిన్నపిల్లోల్లు – మా యింట్లో వున్న కుర్చీలూ – మంచాలు – చూస్తున్నారు. టేబుల్‌మీదవున్న

గడియారాన్ని చూచి – అది వినిపించే టిక్‌టిక్ మనే శబ్దాన్ని వింటూ ఆశ్చర్యపోతున్నారు.

వెంటనే వాళ్లకు తిండి తీర్థాలు ఏర్పాటు చేసి – తోటకాడికి పొండనిచెప్పి – బస్సు చార్జీలు యిచ్చి – అక్కడున్న తోట గుత్తకు చేస్తూ వున్న సన్నకారురైతు రామిరెడ్డికి ఒక జాబు వ్రాసి పంపినాను. ఒక పెద్ద బరువు దించుకొన్నట్లయింది. షెడ్డులోనే వుండనిమ్మనీ, పనులు చూపించమనీ – జాబులోని సారాంశము – ఆ రోజంతా ఎట్ల బతుకుతారో పాపం. ఏదో ఒకసాకు పెట్టి సెడ్డులోంచి వెల్లగొట్టు తారేమో – పనులు సరిగా చూపరేమో – అని ఒకే ఆలోచన.

నాలుగు రోజులు తోటవద్ద వుండి, గంగడు వచ్చినాడు. "ఏరా సెడ్డులో వున్నారా – పనులు దొరుకుతా వున్నాయా – రామిరెడ్డికి జాబు ఇచ్చినావా – పరవాలేదా – అక్కడ వుండగలరా" అని అడిగినాను.

రామిరెడ్డి మంచోడబ్బా. రాత్రికి అన్నం పెట్టించినాడు. సెడ్డులోనే వుండరా తర్వాత చూస్తాం – మీయిళ్లల్లోనే కొట్టం చూస్తాంలేరా" అని చెప్పినాడబ్బా అని అన్నాడు గంగడు.

"ఏరా మన సెడ్డు బాగుందే – వానా గాలికి అదుకొంటుంది. అక్కన్నే వుండరా. వూర్లోకిపోతే ఇబ్బంది పడతావురా" అని అన్నాను.

"లేదులేబ్బా ఇల్లల్లోనే వుంటే మంచిది. ఒంటిగా సెడ్డులో వుండలేను. తోడుండరు. పైగా ఆడపిల్లోళ్లుండే పని. బావికాడా సెడ్డుకాడా – గుడ్డలుతుక్కోవడం – అంతా రోతబ్బా యిళ్లల్లోకి పోతే ఎంతరోతున్నా పరవాలేదు. ఎవరూ చూడరు. చూచినా అందరితోపాటీ మేమూ అని అనుకొంటారు" అని గంగడు చెప్పినాడు.

రామిరెడ్డి చెప్పితే పోతున్నావురా – వూర్లో మీయిళ్లలో సరిగా జరక్కపోతే యిబ్బంది. సెడ్డుమేలురా నీకు. భయం లేకుండా వుంటుంది. చుట్టూపట్టు తోటల్లో పనులు చేసుకోవచ్చు" అని అన్నాను.

"రామిరెడ్డితో మాట్లాడుకొంటాలేబ్బా" అని అంతలో తుంచేసినాడు.

"ఏరా ఏమన్నా పనిమీద వచ్చినావా అని – ఐదు రూపాయలు లెక్కా – కొన్ని పాతగుడ్డలూ యిచ్చి పంపినాను. గంగనికి కొంత వూరట గలిగిందేమో – ఉత్సాహంగానే వున్నాడు.

నెల తిరక్కతలికే – వాడింతకుముందున్న వూరి నుండీ ఒకడొచ్చినాడు. "మీ యింటిని కనుక్కోడానికి తిరిగి తిరిగి చచ్చినాన్నా" అని అన్నాడు.

"ఏం విషయం" అని అన్నాను.

"వాడుండాడే గంగడు మూగిపిల్ల నాయన నీవూ చూచినావు మావూర్లో వున్నపుడు – వాడేమైనా నీవద్దకు వచ్చినాడా" అని అన్నాడు.

"ఏమీ ఏమైనా విశేషమా" అని అన్నాను.

"విశేషమేముందీ – వూర్లో గోవిందరెడ్డి అన్నకు 500/– బాకీ అంట. రాత్రికి రాత్రే చెప్పకుండా చెయ్యకుండా వచ్చేసినాడు. యిక్కడచేరి నీపాదం పట్టితే సరిపోతుందని అనుకొన్నాడు. దొంగనాయాలు అని అన్నాడు. ఆగంతకుడు.

"అంతేనా యింకేమైనా వుందా" అని అన్నాను.

"అది జాలదూ బాకీకత చెప్పకుండా – తప్పించుకొని తిరిగితే మంచిదాన్నా నువే చెప్పు. బాకీ ఎట్లారావాల" అని అన్నాడు.

"పని పాటలు చేసి – వచ్చిన కూళ్లల్లో మిగిలించుకొని తీరుస్తాడు ఇప్పుడేమైందీ " అని అన్నాను.

"ఎట్లా తీరుస్తాడు – ఎదురుగా వుండి – అంటే ఆ వూర్లోనే వుండి వచ్చింది వచ్చినట్లు యిస్తావుంటే తీరుతాది. పారిపోయి వచ్చి యిక్కడ కూడబెట్టి తీరుస్తాడంటే ఎవరన్నా నమ్ముతారా – అయినా ఇట్లా విషయాలు మీకంతగా తెలియవులే – తెల్లనివన్నీ పాలూ – నల్లనివన్నీ నీళ్లూ – అని అనుకొనేవారు – మీకిట్లాటి విషయాల్లో లోతు తెలిదు"దని అన్నాడు. చిరుకోపాన్నీ ప్రదర్శించినాడు

ఆగంతకుడు.

"గోవిందరెడ్డి ఎందుకిచ్చినాడూ అంతమొత్తాన్ని. వాడెట్లా తీర్చుకొంటాడు. 500 వందలు జీతగాడైనా 500 వందల అప్పు తీర్చుకోవాలంటే – టౌనులో కష్టపడుతున్నాడే" అని అన్నాను.

"అయిదారేళ్ల కింద వందరూపాయలు ఇచ్చినాడంట. వొడ్డితో ఎక్కువే అయివుంటుందని" అన్నాడు.

'తీర్చలేనోనికి వొడ్డీకట్టుకుంటూపోతే ఎట్లప్పా" అని వెటకారంగా అన్నాను.

"అది మామూలేకదా. అవసరాని కందిచ్చినప్పుడు వొడ్డీలు యిస్తానని వొప్పుకొన్నాడు కదా. ఇచ్చినోని దేమితప్పు" అని అన్నాడు.

"శక్తి లేనోడు, ఎక్కడా తెచ్చుకోలేనివాడూ, "మీ యిష్టమప్పా" అని చెప్పివుంటాడు. అది వొప్పుకోవడం ఎట్లవుతుంది. ఇంతకూ ఇప్పుడు నన్నేం చేయమంటావు" అని అన్నాను. "ఏముందీ వాన్ని పంపించు. వూరు చేరుకొని ఎట్లో అప్పు తీర్చుకొంటాడు" అని అన్నాడు.

"నీ పిచ్చిగానీ వాడెట్లా తీర్చుకొంటాడు. కానిపని. వాడు చావకుండా కొన్నాళ్లుబతుకుతే గొప్పసంగతి. వాని పెళ్లాం మాత్రం తొందరగా చచ్చేట్లుంది. ఇంకానేదర పిల్లోల్లూ. వాళ్లు పెద్దోళ్లయి పని కెదిగితేనే – వాళ్లు తింటి తింటారు" అని అన్నాను.

"అయితే గోవిందరెడ్డి అన్నకు రావలసిన బాకీ 500/–లు పోయినట్లేనా" అని అన్నాడు.

"పోక వస్తుందనుకొన్నా వా – కాకపోతే వానితో ఉపరాగ పని చేయించుకోవచ్చు. త్వరగా చచ్చిపోయేట్లు చేస్తారు. డబ్బు మాత్రం రాదు" అని కచ్చితంగా అన్నాను. "ఏదో ఒకటి చూడన్నా. నీకు నిందవస్తుంది. యితర్లకు బాకీ ఎగ్గొట్టించి తన పనిలో పెట్టుకొన్నా"డని అంటారు. 'నాకు స్వంత సేద్యం లేదే నన్నెందుకు అట్లనుకొంటారు. అని అన్నాను. 'ఎందుకనుకోరు. ఎంతలేంది

తన తోటకాడ పెట్టుకొంటాడా, అందరం రైతులమే – చూచుకొని పోవాల. సన్నోళ్ళకు చనువిస్తే నెత్తికెక్కించుకొంటే ఎట్లా! గోవిందరెడ్డి అన్న మొత్తుకొంటున్నాడు నాలెక్క ఎట్లా అని ఏదో ఒక పరిష్కారం చెయ్యన్నా లేకుంటే పెద్ద రాగం పాడాల” అని కటువుగా మాట్లాడినాడు.

“ఏం పరిష్కారముంది, వాడు తీర్చలేడు. కాదంటే వాన్ని కొట్టచ్చు. తిట్టచ్చు. కుటుంబానికి అందరికీ బువ్వపెట్టితే తిట్టినా కొట్టినా పడుంటాడు కానీ. ఊరకే పనిచేయలేరు. అందులో తక్కువకూల్లల్లో. ఇది నా అభిప్రాయం – మీరే ఏదో పరిష్కారం ఆలోచించండ”ని అన్నాను. ‘నీ పనిలోకి వస్తుండాడు కదా నీవు సర్దు బాకీ తీర్చినట్టూ వుంటుంది నీ పనీ జరుగుతుం”దని అన్నాడు.

‘ముందే చెప్పినాను నాకు స్వంత సేద్యం లేదని. పాపం వాడు పనులు చేసుకొని బతికేందుకు మాత్రం ఏర్పాటు చేసినాను అంతే. వాని బాకీ నేనెందుకిచ్చుకోవాల. ఉపరాగా ఊళ్ళోల్లకు బాకీలు కట్తే నేనెట్లా బతకాల. అందులో వొడ్డీలకు వొడ్డీలబాబతు లెక్కలు” అని కటువుగానే మాట్లాడినాను. అతడు కొంతతగ్గి ‘ఏమోనబ్బా మీ యిష్టం మీ యిష్టం – గోవిందరెడ్డన్ననే పంపుతా ఆయనే మాట్లాడుకొంటాడు’ అని లేచిపోయినాడు.

‘‘ఏందిదంతా, వాన్ని పంపించేయరాదా అని మా ఆడోళ్ళు మందలించినట్లుగా అనింది.

“వాడెక్కడికిపోతాడు – ఆ వూర్లో జరక్క యీ వూరికి వచ్చినాడు. యీ వూర్లో జరక్కపోతే యింకోవూరికి పోతాడు. కడాకు అడుక్కొంటాడు. అదీ వాని బతుకు. నేనెట్లా పంపేది. మళ్ళీ ఆబోనులోకి. అయిదారేళ్ళ నుండీ ప్రతిపనీ చేయించుకొని, వొడ్డీకి వొడ్డీ కట్టి – వంద రూపాయలకు ఐదువందలు ఎగరాసినారంటే – వాడెక్కడ నుండీ తెచ్చి కట్టుతాడు. అందుకే దొంగతనంగా వున్న వూరిడిసి – టిక్కెట్టు లేకుండా యీ వూరు వచ్చినాడు. నావల్లకాదు. గోవిందరెడ్డి ఏమైనా చేయాలనుకొంటే బుద్ధి చెపుతాను” అని అన్నాను.

గోవిందరెడ్డి రానేవచ్చినాడు వారం తిరక్కతలికే. వాళ్లింట్లో పేడా కసవూతీసేవాళ్లు లేరనీ – పనిపాటలు కుంటుపడుతున్నాయనీ – అన్నీ తెలిసి అడివిలో పడుతున్నావే. వాన్ని పంపించు. నీవు గట్టిగా పట్టినావు. నీమాటే వింటాడు. వాన్ని ఎట్లయినా పిలుచు కొనిపోవాలని వచ్చినాను" అని అన్నాడు. "వాన్నే అడుగు నాబాకీ కట్టద్దులేరా అని అంటే పరవారుతా వస్తాడు. మనపనికి తరమయ్యేవాన్ని వత్తితే ఇంతే జరుగుతుంది" అని అన్నాను.

"ఉరువు యీకుండానా. ఏందన్నా అర్ధమన్నా యీకుంటే ఎట్లా నువే చెప్పు. అందుకే నీవు చెప్పి వొప్పించి పంపుతావని వచ్చినాను. మనమంతా అయిన పోయినోళ్లం యిట్లా గట్టిగా పట్టుకుంటే ఎట్లా. సన్నోళ్లను ఇరికించుకోకపోతే – అందులో దేశదిమ్మర్లతో పనులు ఎట్లా చేయించుకోవాల" అని నవ్వుతూ అన్నాడు. "పనికి మాలిన ఆలోచన్లతో వాన్నెందుకు చంపుతావు. నీనూఱ్రూపాయలూ ఏనాడో తీరిపోయి వుంటుంది. నీకు పని జరగాలంటే వాన్ని ఆదరంగా చూచుకో – అట్లయితేనే పంపుతా!" అని అన్నాను. "నీయిష్టం" అని అన్నాడు. "ఏమైనా వారం రోజుల్లో వచ్చేట్లు చేయన్నా" అని చార్జీలకు 20 రూపాయలిచ్చి – వాడు రాసిచ్చిన రు.500/–ల బాండు చేతిలో పెట్టి – తప్పక వచ్చేట్లు చూడన్నా – నీ దగ్గర చేరినాడు కాబట్టీ సరిపోయింది లేకుంటే – వాన్ని ఏమి చేసిందునో అని అన్నాడు.

"ఏమీ చేయద్దు యీవలసినంత కూలిచ్చి ఆదరంగా చూచుకో అంతే. లేకుంటే – అవస్థలు పడతావు. వాళ్లకూ సంఘాలున్నాయి. వాళ్లకూ దిక్కున్నారు. వాళ్లిప్పుడేమీ ఊరుకోరు. ఊరకలేరు" అని అన్నాను.

"ఎట్లనోలే అన్నా కాలం తప్పికందులు గుగ్గిళ్లవుతున్నాయి – ప్రతి జుట్టు మాసినోడు సంఘాల్లో చేరడమే. సంఘాలకు మీ అట్లా పనిలేనోళ్లు సాయంగా వుండనే వున్నారు. మాకు తెలియదా" అని గోవిందరెడ్డి పోయినాడు.

గంగడు – వారం పది రోజులకు మళ్లీ తోట వద్ద నుండీ వచ్చినాడు "ఏరా గంగా – గోవిందరెడ్డి వచ్చి వుండినాడు. ఏరా నీవు రాయించిన బాండు ఇచ్చి

20 రూ నీకు చార్జీలకిచ్చి పోయినాడురా. బాకీలేదంటలే పోతావా. ఎప్పుడు పోతావు అని అన్నాను.

"పోలేనబ్బా" రామిరెడ్డి మంచోడు. నాకొక పాతకొట్టం కొనిచ్చినాడు. నూటయాభైకే యిప్పించినాడు. నిన్ననే రిజిష్టరు కూడా చేయించేట్టు చేసినాడు. రామిరెడ్డికి 180/-లకు బాండు రాయించి నానాబ్బా. కొట్టం కొంప దొరికింది. తోటాదొడ్డీవున్న వూరు పనులుంటాయి. మీరు మంచిదంటే ఇక్కడే బతుకుతాబ్బా. మూగిపిల్లకు చెవిటిపిల్లకూ పెళ్లిళ్ళన్నా చేసి చచ్చిపోతానబ్బా, అందాక పాత కొట్టంలో తలదాచుకొంటాను" అని అన్నాడు.

"నీవుమల్లా ఇరుక్కున్నావుగదరా పనికిమాలినోళ్లు - ఏమైనా చేస్తారు ఎదుర్కొనే శక్తి వుండాలి. ఇక్కడివాళ్లతో తకరార్లువస్తే ఎట్లరా? గోవిందరెడ్డి కావలసినవాడు కాబట్టి విన్నాడు" అని అన్నాను.

"అట్లనాబ్బా! రామిరెడ్డి మంచోడనుకొంటినే" అని గొనుక్కొంటూ కూలబడిపోయినాడు గంగడు.

నాచిననాటి నేస్తము వినమ్రుడు వైసి.వి.రెడ్డి ప్రౌఢిమన్
తోచిన రీతిగాక సరితూచగ శక్యమె సాహితీలతన్
పూచిన పువ్వులట్లు వలపుల్ పచరించి తెలుంగు గడ్డపై
వీచిన దక్షిణానిలపు వీవన లాతని కావ్యసంపదల్

- గజ్జెల మల్లారెడ్డి

# ఐదురూపాయలు

"వానితో ఏం. వాన్ని అంతగా కొట్టకుంటే ఏం. యింతకూ వాడేం చేసినాడు. కాదంటే కష్టకాలాల్లో గింజలో లెక్కో అప్పు తీసుకొని వుంటాడు. అద్దైనా ఎక్కువ యిచ్చింటాడా. యీముండ మోపి యిచ్చింటే 5, 10 లెక్కో 10-15 సేర్ల గింజలో యిచ్చింటాడో లేదో. అంత సంబడానికి యింతగానా కొట్టేది....

అయినా యీవూరు వూరేకాదు. అందరూ పెద్దరెడ్లే. ఆస్తి కొంచెమూ అహంభావం ఎక్కువా. వాళ్లకు తెలియదు ఒకరు సెప్పితే వినరు. ఏమన్నా అంటే – "పోరాపోరా మహాతెలిసినోనివి" అని అంటారు. ఈ వూరు బాగుపడుతుందా? ఎట్లబ్బా యీవూరు బాగుపడేది. 'థూ' కొంపలో మానంగా మర్యాదగా బతకాలంటే కుదరనే కుదరదు. ఎక్కడన్నా పోయి బతుకుదామా అంటే కానేకాదు. ఏవూరికావూరు అగ్గిగుండంగా మండుతావుంది. టౌనుకు పోదామా అంటే – అక్కడ దిక్కులేని చావు. అక్కడ బతకాలంటే వాటగాడు గావాల. ఎక్కడ ఒరిగినా ఆఫీసర్ల పదును కత్తులు ఒరుసుకొంటాయి. తెలిసీ తెలియకుండా బతకాల. పెట్టుబడి పెద్దగా వుండాల. పెద్ద వ్యాపారముండాల. పెద్ద పెద్ద ఆఫీసర్లతో పరిచయాలుండాల. లేకుంటే కుక్కచావు....

ఈ అసూయలూ ద్వేషాలూ – రోషాలూ – లోభిగుణాలూ – దానికి తోడు అహంబావాలూ – ఎట్లపోతాయి. ఎప్పుడు పోతాయి" అని దిక్కు తెలియని స్థితిలో ఆలోచిస్తున్నాడు వాసుదేవరెడ్డి.

వాసుదేవరెడ్డికి బంధువర్గం దండిగా వుంది. అందరూ తన చుట్టూ వున్నట్లుంటారు. ఎవరికి సహాయం చేయకపోయినా చిక్కుల్లో పడతాడు. ఎవరికి ఏ సలహా యివ్వాలన్నా కనీసం వారం రోజులైనా ఆలోచించి యివ్వాల. కఠినమైన కావ్యానికి వ్యాఖ్యానమైనా చెప్పవచ్చుగానీ – కలిసి జీవించే కవల పిల్లల – హృదయోల్లాసాలను విడమరచి చెప్పలేం. అంతస్థుకు తగిన మర్యాదలేదు. అర్థంకాని బతుకులు. ఒకడు ఏదారి అంటే యింకొకడు గోదారి అంటాడు. వాసుదేవరెడ్డికి ఆలోచనల్లో – కొడిదొరకలేదు. "లచ్చిగాన్ని కొట్టింది

రు. 2/–లకే అని అంటారు. స్వల్పమొత్తానికే అంతగా కొట్టాల్నా – లెక్కరాకుంటే ఏమవుతుంది. ఎక్కడికి పోతాడు. వస్తుందిలే అని సోకోర్చుకోవచ్చునే – న్యాయం చెపుదామా అంటే – ఎవనిక్కావాల న్యాయం. జరిగేవాని పక్కనే వుంటుంది న్యాయం. బీదోళ్లు ఎవరి దగ్గర న్యాయం పొందుతారు. కోర్టులూ – కచ్చేరీలు – వాళ్లకు దూరం. పనిపోగొట్టుకొని తిండి లేకుండా కోర్టుకు పోలేరు. అంతా ఖర్చుతో కూడుకొన్నపని. అక్కడా ఆస్తిపరులదే పైచెయ్యిగా వుంటుంది. ఖర్చులు పెట్టుకొంటూ – అందరినీ మేపుకొంటూ సంవత్సరాల తరబడి వాయిదాలు వేయించుకొంటారు. విచారణే జరగనీరు. పేదోడు ఖర్చులకు తట్టుకోలేక ఆ వూరు విడిచిపెట్టి పోవాల. అంతే. న్యాయం పేదోని పక్కన వున్నా – అన్యాయంగా దిక్కు లేకుండా – దొంగతనంగా వూరు విడిచి – కాననిచోటికి కష్టపడి పోవాల్సిందే. లేకుంటే – అన్ని సర్వనాశనం చేస్తారు. ఇంతకూ సుకపడే రాతలేదు. బుర్ర వేడెక్కి పోయింది ఆలోచన్లతో – బీడీ ముట్టించుకొన్నాడు. ఎవరన్నా ఆదోవన వస్తారేమో అని చూస్తూ బీడీ తాగుతూ వసారలోంచి వచ్చి పంచటరుగు మీద కూర్చున్నాడు. పేడగంపెత్తుకొని పోతున్న గుర్రప్పను పిల్చినాడు వాసుదేవరెడ్డి.

"వస్తాలేబ్బా" అని పేడదిబ్బలో వేసి వచ్చినాడు గుర్రప్ప.

"గుర్రప్ప! లచ్చిగాన్ని కొట్టినారంటనే ఎందుకూ" నేనూర్లోలేను నిజం చెప్పరా" అని అన్నాడు.

"ఏముంది వాడు బాలిరెడ్డికి బాకీ అంట. పనికి పిలిస్తే రాలేదంట. అంతకు ముందే పిలిచినోళ్లకు పనికి పోకుంటే వాళ్లూ తంతారు. అని వేరేవాళ్ల పనికే పోయినాడు అని గుర్రప్ప అన్నాడు.

"ఎంతరా బాకీ – వూరకూరకనే కొట్తారు అని కొంచెం విసుగ్గా అన్నాడు.

"యాడిదబ్బా 5 రూపాయలు బాకీ వున్నాడంట" అని అన్నాడు గుర్రప్ప.

"రెండు రూపాయలే అని చెప్పినారే" అని అన్నాడు వాసుదేవరెడ్డి.

కానోళ్లు చెప్పింటారు. వాడే నాతో అన్నాడు, 5 రూపాయలు యివ్వాల అని. రెండు రూపాయలకే యిరగ్గట్టి కొట్టినాడనీ – బాలిరెడ్డిని పదిమందిలో – చూపించేందుకు  అని వుంటారు. ఎట్లయినా పేదోళ్లదే తప్పు. అప్పు తీసుకోవడమేల. దెబ్బలు తినడమేల" అని అంటూనే కొట్టడం తప్పు అన్న ధ్వని వచ్చేట్లు మాట్లాడినాడు గుర్రప్ప.

"అప్పు తీసుకొంటే – పనికి రాకుంటే – అంతగా కొట్టాల్నా. కళ్ల బెత్తుతో పని జరుపుకోవాల. యిప్పుడు పదిమంది నోళ్ళలో బాలిరెడ్డి నానుతా వుండాడు. ఏం పని" అని యీసడింపుగా అన్నాడు వాసుదేవరెడ్డి.

"గోడలకు చెవులుంటాయి. మాకెందుకీ రంపుల్లో యిరుక్కోడం. పేదోళ్లు ఏం మాట్లాడినా – అట్లన్నావంటనే – యిట్లన్నా వంటనే – అని నిలదీసి అడిగి మరీ కొట్తారు. నేపోతాబ్బా, మీకు తెలియందేముంది. మీరే న్యాయం విచారించుకోండి" అని గుర్రప్ప జారుకొన్నాడు.

"పాపం లచ్చిగాన్ని బాగా కొట్టినారు రోకలబడెతో. ఎప్పుడంటే అప్పుడు వాని దగ్గర లెక్క ఎక్కడుంటాది. పనికి యీపొద్దు రాకుంటే రేపు వస్తాడు – 'ఛ' పాడుపనులు – పనికిమాలినోళ్లు" అని అనుకొన్నాడు.

"లచ్చిగాడు కేసు పెట్టినాడు. డాక్టరు సర్టిపికెట్టు బాగానే యిచ్చినాడు. ఊరంతా అబగుబులుగా వుంది. పోలీసులు వూర్లోకి వస్తారు. విచారించుకొంటారు. నేరస్తుల్ను పట్టకపోతారు" అని వూరంతా అనుకొంటున్నారు.

బాలిరెడ్డి కొడుకు వచ్చి "మా నాయన రమ్మంటున్నాడని" వాసుదేవరెడ్డికి చెప్పినాడు.

పోకూడదని అనుకొంటూనే – పోకుంటే తీరదని "వస్తున్నా" అని చెప్పినాడు వాసుదేవరెడ్డి.

బాలిరెడ్డి యిల్లంతా కోలాహలంగా ఉంది. బలపరిచే బంధువులందరినీ సమావేశపరచినాడు. బంధువులంతా ఆ పనులో – అంత అక్కస పనికిరాదు

– సన్నోళ్లను అంతగా అక్కసగా కొట్టితే ఎట్టరా బుద్ధిలేని పని చేసినావు. అందరూ మనమలనే అంటున్నారు. లచ్చిగానితో రంపు, లచ్చిగాన్ని కొట్టడం సాకు పెట్టుకొని మన శత్రువులు మన గుంపు పుట మార్చాలని చూస్తున్నారు. ఆ తర్వాత యిది ఏ విధమైన రంపుల్లోకి దారి తీస్తుందో. అయినా మిడిమేలం పనికిరాదు. గామిడిగాడని నలుగురి నోళ్లల్లో నానడం తప్పితే ఎమన్నా పుణ్యమా పురుషార్థమా – రూపాయకూ అర్ధరూపాయకూ పియ్యతినే వాడని – కానోళ్లు అదే పనిగా వాగుతారు. బంధువుల్లో తలవంపులు – సరిసమానమైన వాళ్లతో – సరసమైనా విరసమైనా అని అంటున్నారు. ఊర్లో పార్టీ పడుతుంది. యిది దానికి ఎత్తుమానం అనీ అంటున్నారు.

బాలిరెడ్డి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. "లచ్చిగానికి దిక్కెవరో చూస్తాను. యిప్పుడు లచ్చిగాని కేసుతో పనేం. జరిగేది జరుగుతుంది. వానికి సాయపడే గంగిరెడ్డిగాని కతేందో తేలుతుంది. చేనికాడ – చెట్టు కాడ – ఎక్కడా వానితోరంపే. ఎంత ఒదుక్కొని పోవాలన్నా వానిది జాస్తి అయింది. కర్చు ఎంతయినా సరే – అని బాలిరెడ్డి రొప్పుతున్నాడు. వాసుదేవరెడ్డి అంతలో వచ్చినాడు – అతన్ని చూచి నువ్వే చెప్పుమామ వాడు లచ్చిగానికి సాయం పోవచ్చునా. నేను లెక్కిచ్చినా – రాబట్టుకొంటా – వాన్ని కొట్టుతాను చంపుతాను. ఎగదోసి వుసి కొల్పుతాడా. గంగిరెడ్డో నేనో – చావో బతుకో చూచుకొంటాం – మాకు వచ్చింది మీకు రాకుండా పోతుందా – వాడసాధ్యుడు. ఎక్కడెక్కడి బీళ్లల్లో మాన్లూవాడే కొట్టుకొంటాడు. చావిడి కనికొట్టిన దంతెలు వాడే బండ్ల మిద్దెకూ – వసారాకూ – వేసుకోలేదా. ఊరకుంటే వూరంతా మేస్తాడు. ఊరకుంటే వూరందర్నీ తిప్పలు పెడ్తాడు. ఎక్కడెక్కడి తకరాళ్లు వానికి కావాల – అందరికీ తంపులు పెట్టి – పెద్దమనిషిగా తిరుగుతున్నాడు" అని వూగుతూ చెప్పినాడు బాలిరెడ్డి.

"అయినా దీనికి పార్టీలెందుకురా" అని అన్నాడు మందలింపుగా వాసుదేవరెడ్డి.

"నీకు తెలియదులే – వాన్ని ఎదుర్కొనాల్సిందే. లచ్చిగాని కేసు నా స్వంతం.

మిగతా కేసులు వస్తాయి. మీరంతా వుండాల లేకుంటే మితిమీరి పోతాడు – మీరు రాకుంటే – నా స్వంతం నేను చూచుకొంటా – సస్తే సస్తాను బతికితే బతుకుతాను” అని అన్నాడు ఏమైనా సరే నన్నట్లు – బాలిరెడ్డి.

“తొందర పడాకురా” అని వాసుదేవరెడ్డి తాలచెప్పేందుకు ప్రయత్నించినాడు.

“రెడ్డీ కర్నాన్నీ లోబరుచుకొని – ఎన్ని పనులు చేసినాడో మీకు తెలియదా – బీదోళ్ళను ఎన్నిసార్లు కొట్టినాడో వూరందరికీ తెలుసు – వాడు కొట్టినపుడు నేను కేసు పెట్టినానా. వాని మాదిరి నీచమైన పనులు మనం చేస్తామా – పోనీలే అని వూరకుంటే నన్ను రచ్చకీడుస్తాడా! – నేను లచ్చిగాని కాళ్ళు పట్టుకోవాలనా – వాని వుద్దేశం, కేసు జరగనీ – ఎమవుతుందో చూస్తాం అని అన్నాడు బాలిరెడ్డి.

వాసుదేవరెడ్డి ఏమీ మాట్లాడకుండా కొంతసేపు వుండి “అందరితోపాటి నేనూ” అని అక్కడ నుండి పోయినాడు.

ఆ రాత్రికి అంతా కట్టుదిట్టంగా – గంగిరెడ్డికి ఎదురు పార్టీగా – కట్టమాట్లాడుకొని – తిరుగుబాటు గాకుండ వుండేందుకు బాండ్లు వ్రాసుకొన్నారు.

వాసుదేవరెడ్డి బాండు రాయించినాడు. ఆ రోజే ఏదో పని వుందని కడపకు పోయినాడు. వాసుదేవరెడ్డికిదంతా యిష్టలేదు. తానేమీ చేయలేడు. అందరితోపాటి కర్చులకు లెక్కలు పెట్టుకోవాల. భూస్వాముల కట్టలో – తానూ ఒకడు. తప్పించుకోలేడు. తనకూ ఆస్తిపాస్తులున్నాయి. వాటికి రక్షణ వుండదు. అందరితోపాటే ఏ పనికిమాలిన వాడైనా – వాసుదేవరెడ్డిని ముప్పుతిప్పలు పెట్టవచ్చు. వీలయితే యిరుపార్టీల వాళ్లూ వాసుదేవరెడ్డి ఆస్తులకు నష్టం కలుగచేస్తారు. వాటం తప్పితేకొట్టడం కూడా జరుగుతుంది. – అంతా దుర్మార్గుల మధ్య వున్నాడు. యింతకూ యీఆస్తి లేకపోతే – ఇదంతా లేదు కదా – న్యాయం కూడా చెప్పలేకుండా వున్నాను అని అనుకొన్నాడు. “విధిలేని మంచితనం – ఏంపని చేస్తుంది” అని కూడా అనుకొన్నాడు వాసుదేవరెడ్డి.

స్వంత ఖర్చులతో కడప – మద్రాసు తిరుక్కుంటూ వూరికి పోకుండా తప్పించుకొని తిరుగుతావున్నాడు. వూరికి పోయినా రాత్రి పూటల పోవడం – ముఖ్యమైన పనులు – పురమాయించడం – చేసి వస్తున్నాడు. యిదంతా కేసుల్లో తన్ను ఇరికిస్తారనే వుద్దేశంతోనే – తప్పించుకొంటున్నాడు వాసుదేవరెడ్డి.

పార్టీలు రెండుగా స్పష్టంగా ఏర్పడినాయి. ఇరుగుపొరుగు వూర్లకు ప్రాకింది యీ వార్త. తోటలకాడ దొడ్లకాడ – కళ్లాలకాడ – ఆ గుంపులోనూ యీ గుంపులోనూ వున్న కట్టెపట్టెవాళ్లు – మనపార్టీ తగ్గిపోతే ఎట్లా ఎళ్ళుకోమను సదరానికి తెలుస్తాది అని – పరస్పరం – తెలిసేట్లు బీరాలు పలుకుతున్నారు. కొన్ని కొన్ని చోట్ల పిడిగుద్దుల కొట్లాటలూ జరుగుతావున్నాయి. చిలికి చిలికి గాలివాన అవుతావుంది. పార్టీలో వాళ్ళు – రెండు గుంపుల వాళ్లూ ఎక్కడికి పోయినా – జట్లు జట్లుగా – మొల్లో బాకులతో పోతూ వున్నారు. యారముట్లూ, కావలసిన తుపాకులూ తెచ్చి పెట్టుకొన్నారు. ఎప్పుడైనా తలపడవచ్చునని పోలీసోల్లు – జామిన్ కేసులు బనాయించినారు. వాయిదాలకు తిరుగుతున్నారు. డబ్బులు ధారళంగా కర్చయితావున్నాయి. వూర్లో – ఏ యింటికాడ తకరారూ – ప్రధానంగా చర్చల్లోకి వస్తూ వుంది.

నెల తిరక్కతలికె వూరిలో కూనీలు పడినాయి. వాసుదేవరెడ్డికి దిక్కు తెలియలా – విధిలేక వూరికి వచ్చినాడు. బాలిరెడ్డి గుంపులోనే ఒకడు ఎందుకూ పనికిరానోడు కూనీ అయినాడు. మిద్దెలెక్కి తుపాకుల్తో కాల్చుకొన్నారు. కూనీలు జరిగిన్నాడు వూర్లో లేనోళ్లను తప్ప అందరినీ ముఖ్యమైనోళ్ళను – కేసులో యిరికించినారు. అంతా తెలుసుకొన్నాడు వాసుదేవరెడ్డి – ఏం చేస్తాడు. బాలిరెడ్డి యింటికి పోయినాడు.

“అయిందేదో అయింది. ఇప్పుడే మంచి అవకాశం. నేను చెప్పలా వాడు దుర్మార్గుడని – వూరంతా నాశనం చేయాలని చూచినాడు. ఆ దినం కాల్పుల్లో వూరంతా అట్టుడికినట్టుడికింది. కాల్పుల్లో – ఏమీ కాబట్టనోడు మన రామిరెడ్డి అన్న సేద్యగాడు గురప్ప చచ్చినాడు. వాన్నెందుకు కాల్చినారో తెలియదు.

ముండనాకొడుకులు మమ్మల కాల్చకూడదా – అందరం కట్టుదిట్టంగా వుండి వాన్ని గంగిరెడ్డిగాన్ని – నామరూపాలు లేకుండా చేయాల అని అన్నాడు బాలిరెడ్డి.

ఊరంతా పుండు మాదిరీ పాసిపోతావుంది. పార్టీలీడర్లు రక్షణగా మనుషుల్ను పెట్టుకొని తిరుగుతున్నారు. రెండు గుంపులూ న్యాయం కోసం పోరాడుతున్నారు. లచ్చిగానితో వచ్చిందంతా అని ఎక్కడ పడితే అక్కడ అనుకొంటున్నారు. లచ్చిగాడు ఊర్లోలేడు. పొరుగూరికి పనులకుపోతా – బతుకుతున్నాడు. ఎప్పుడైనా వాయిదాకు పోయివస్తుంటాడు. వానికేసు సంగతీ సందర్భాలు ఎవరికీ కాబట్టలేదు. గంగిరెడ్డికి కూనీకేసు వచ్చి మీద పడింది. సముద్రం యీదినట్టుంది. బాలిరెడ్డి గుంపువాళ్లు జాగ్రత్తగా – గంగిరెడ్డి గుంపును జైలుకు పంపాలని – కేసు విషయాలు చూచుకొంటున్నారు.

“గాడిదని చంపి గల్లుకు పోవడం దేనికిరా – చెప్తే వినరు. అనవసరంగా అక్కసలకు పోయి – కొంపకుచేటు తెచ్చుకొన్నారు. కేసు సరిగ్గా నడుస్తే కనీసం పదిమందికైనా యావజ్జీవ కారాగారం చెప్తారు. కొంపలు గునాదుల్తో కూడా లేసిపోతాయి. కూనీ కేసులంటే సన్నపనా, వకీళ్ళూ – పోలీసోళ్లు మేస్తారు. యింతకూ న్యాయం జరుగుతుందా జరగదు. కాల్చిండేది ఒకడే అయినా పదిమంది జైలుకు పోవాల. ఆడోళ్ళకూ పిల్లోళ్ళకూ దిక్కెవరు. భూములూ ఇళ్ళూ దిక్కులేకుండా పోతాయి. సేద్యం సరిగా జరగదు. అన్నీ యిబ్బందులే – చెప్తే వినరు. యిప్పుడైనా మించిపోలేదు – రాజీపడితే మనకు మేలు– జైలు తప్పుతుంది” అని గంగిరెడ్డి బంధువులు కొంతమంది గంగిరెడ్డికి చెప్పుతున్నారు. బాలిరెడ్డికీ – బాలిరెడ్డి బంధువులూ – రాజీపడమని చెపుతున్నారు. “పిల్లపిల్ల పర్యంతమూ యీరోషాలు పోవు – మనమై తెచ్చి పెట్టినట్లుంది. ఆడోళ్లకు పిల్లోల్లకూ కష్టం. లెక్కలు పోతాయి. ఎందుకు యీపీడ. వాల్లు జైలుకు పోతే మనకేమొస్తుంది. అందులో – ఏమీ తెలియనోళ్ళను – కాబట్ట నోళ్ళను కేసులో పెట్టినారు. వాళ్ళకు అక్కసలు వస్తాయి. – ఏమైనా రాజీపోతే మంచిది” అని.

రెండు గుంపుల్లోనూ – యువకులు – రాజీ మాటలు చెప్తేనే – మెడగరుసుకొంటున్నారు. వాళ్లు రాజీపోయేది యిష్టపడడం లేదు.

"యింతదూరం వచ్చినాం – వాళ్ళు నాశనం కావడమో – మేం నాశనం కావడమో – జరుగుతుంది జరగనీ" అని అంటున్నారు. రాజీకి వప్పుకోకుండా వున్న వాళ్లంతా – కేసుల్లో లేనోళ్లే – పార్టీకి కట్టెపట్టేవాళ్లు. అంతే – పార్టీ అన్నాక అందరి మాటలు వినాల – వినకుంటే కూడా చిక్కులు వస్తాయి. రాజీ ప్రయత్నాలు చెయ్యాలని – పార్టీ ముఖ్యులు అనుకోలేకపోతున్నారు. పనికి మాలిన న్యాయం ధర్మాలు అడ్డు వస్తున్నాయి. వూరి మేలుగోరి రాజీ పోవాలన్న భావమే – అందరి మనస్సుల్లోను మెదల్తూ వుంది. అందరికీ లెక్కలు పోతాయి – ఆస్తులు కరుగుతాయి.

పెద్దపెద్దవాళ్ళూ – యిరు పార్టీలకు సంబంధించిన రాజకీయ వాదులూ – బంధువులూ – పరిసర గ్రామ పెద్దలూ అందరూ – రాజీపోండని చెప్తుతున్నారు. ఎవరితో కదిపినా – యిప్పుడు సల్లుకుంటామా – పోతేపోతుంది. రెండేళ్ళ పైరు అని బాలిరెడ్డి గుంపులో కుఱ్ఱకారు రాజీకి ఒప్పుకోవడం లేదు.

ఇరు పార్టీల గుంపుల్లో కొన్ని కుటుంబాలు – ఒకరినొకరు బంధువులు – దగ్గర బంధువులు – ఆడవాళ్ల ద్వారా లోపల్లోపల రాజీ మాటలు జరుగుతున్నాయి. రాజీకి ఒప్పించేందుకు వాళ్లూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

కేసు బలం తగ్గకుండా బాలిరెడ్డి గుంపు తీవ్రంగా ప్రయత్నిస్తూ వుంది. కేసు తోసిపొయ్యేట్లు చేయవలసిన ప్రయత్నాలన్నీ – గంగిరెడ్డి గుంపువాళ్లూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. యథావిధిగా ఎక్కువ మోతాదులో లెక్కలు కర్చు అవుతున్నాయి. అడ్డపడినొన్నల్లా – ఆదరించి పంపాల్సివుంది. అందరినీ మేపాల. నైతికంగా బలపరిచేవాళ్ళనూ – మేపుకొంటూ రావాల. ఆయకాలు రాయించి అప్పులు తెచ్చుకోవలసిన పరిస్థితులు వస్తున్నాయి కొందరికి. "పార్టీ బాగొచ్చిపడెనే పాడుపీడ" అని అనుకొంటున్నారు కొందరు. పెద్ద మనుషులు – ప్రతినిత్యమూ – రాజీకి ప్రయత్నిస్తున్నారు. ప్రతివానినోట "ఆస్తులు పోతాయి – అడుక్కోవాల్సి వస్తుంది – రాజీపోతే మంచిది – మామాట వినండి" అని నొక్కుతున్నారు. కడాకు రాజీ కుదిరింది. 10 వేలు లెక్క బాలిరెడ్డి గుంపుకు యిచ్చేట్లుగా – ఉత్తరోత్తరా – తిరిగీ కొట్లాటలు రాకుండేందుకు – బాలిరెడ్డి

కూతుర్ని గంగిరెడ్డి మేనల్లునికి యిచ్చి వివాహం చేసేట్లుగా – కుదరపలుక్కొని – రాజీ జరిగింది. విశ్వ ప్రయత్నమైంది. రాజీ కుదిరించేందుకు, అందరు పెద్ద మనుషులూ తీవ్రంగా ప్రయత్నించినారు.

సాక్ష్యాలు తప్పుపలికేట్లు కట్టుదిట్టంగా మాటలు జరిగినాయి. న్యాయవాదులూ పోలీసువాళ్లూ – అందరు రాజీకి సహకరించినారు. వాళ్లదేం పోతుంది – వాళ్ళకు ముట్టాల్సింది ముట్టింది.

కూనీ అయిన గుర్రప్ప భార్యకు రూ. 3000/–లు లెక్క యిచ్చినారు. సాక్ష్యం తప్పుబలికిచ్చినారు. సంపాదించే మొగున్ని పోగొట్టుకొని ముష్టి మూడువేలు తీసుకొని శివుడా అని వూరు విడిచి పోయింది.

"పోనీలేబ్బా రాజీ కుదిరింది. యింకనన్న బాగుంటారు" అని అనుకొన్నాడు వాసుదేవరెడ్డి.

"లచ్చిగాని కేసేమయిందో ఎవరికీ తెలీదు".

విజ్ఞత యమ్మనూరు చినవెంకటరెడ్డి మరొక్క రూపమే
ప్రజ్ఞ మనోజ్ఞమై అతని పద్యములందనవద్య శైలిలో
ప్రాజ్ఞులు మేలుమేలనగ భాసిలుచుండును ఎప్పుడేనియున్
అజ్ఞులవజ్ఞసేయు దరహాస విభూషణ భూషితుండగున్

– గజ్జెల మల్లారెడ్డి

# బంగారు సొమ్ములు

సరోజ ఏడేళ్ళ పిల్లప్పటి నుండి పనిపాటల్లోకి దిగాల్సి వచ్చింది.

అమ్మా నాయన పేద కుటుంబీకులు. రెండు పాడెనుములూ రెండు గిత్తలూ వున్నాయి. ప్రొద్దున లేచినప్పటి నుండి పేడాకసువు ఊడ్చడం, పంచలకసవూడ్చడం సరోజుకు చీకటితో పని. పసల తోలకపోవడం సరోజకు తప్పనిసరి. ఊరిలో బడివుండినా బడికి పోలేదు. ఎనుముల తోలకపోవాల్సిందే. ప్రొద్దునే సంకటి తినడం పాడెనుముల మేపుకొని రావడం. మధ్యాహ్నం ఇంటికి వస్తూనే బువ్వ తినడం కొంచెం సేపు పండుకోవడం. సాయంత్రం యథాప్రకారం పేడాకసవులూ – పంచలకసవులూ ఊడ్చడం సరోజవిధిగా చేయాల్సిందే.

సరోజ చురుకైంది. అందమైంది. కడిగిన ముత్యం. ముతకగుడ్డల్లో కూడా ముద్దుగా వుంటుంది. ఏయీడుకా ముచ్చట. ఇరుగు పొరుగు వాళ్ళు పిల్లోల్లకు ముక్కులు చెవులూ కుట్టించు కొంటూంటే "నాకూ కుట్టించమ్మా" అని తల్లిని అడిగింది సరోజ.

తల్లి నాగమ్మకు భయమైంది. ముక్కుల్లోకి చెవుల్లోకి ఏమి పెట్టాల. అదీగాక అందరూ కుట్టించుకొంటారు. ముక్కుపుడకలూ చెవుల బుడ్డలూ బంగారువి అయితే బాగుంటుంది. నాగమ్మ తాహత్తుకు చింతాకంత బంగారు కొనేందుకు శక్తిలేదు. ఆమె జీవితంలో ఎన్నడో ఏళ్ళనాటి బెండుకమ్మలూ – మొగుడు కట్టిన తాళి బొట్టూ వున్నాయి. ఆ రెండు సొమ్ములూ రాగి మదుపు ఎక్కువగా కలిసిన తగ్గు బంగారువి. ఏమైనా హిందూ సంప్రదాయం. ముక్కుల్ను చెవుల్ను విధిగా అలంకరించుకోవాల. అలంకరణ అంతస్తుకొద్దీ చేసుకొంటారు.

నాగమ్మ చెవుల బెండుకమ్మల్ను చెడగొట్టి, ఒక చిన్న ముక్కుపుడకనూ రెండు చెవుల బుడ్డల్ను చేయిస్తే సరిపోతుందిలే అని నిర్ణయించుకొంది. అందరితోపాటికాక సరోజకు ముక్కు ఒక ప్రక్కన్నే కుట్టించింది. చెవులు సరేసరి రెండింటికి రెండు బంగారు బుడ్డలుండాల.

ముక్కుచెవులు కుట్టించిన వారం పదిరోజుల్లోనే – నాగమ్మ చెవులకు దంటు బెండ్లు పెట్టుకొని – తన బెండుకమ్మలు చెడగొట్టించి ఒక చిన్న ముక్కు పుడకనూ చెవులకు బుడ్డలూ చేయించింది.

సరోజకు తలకుపోసి ఉతికిన చేనేత పావడా కట్టించి చిన్న తొగరంచు చోళీ తొడిగింది. ముక్కు పుడకను తానే స్వయంగా పెట్టింది. చెవులకు బంగారు బుడ్డల్ను పెట్టింది. సరోజకంటే నాగమ్మే ఎక్కువ సంతోషపడింది. తనకు బోసిపోయిన చెవులున్నా తనబిడ్డకు అందరితోపాటి ముక్కుపుడక చెవుల బుడ్డల్ను చేయించ గలిగినందుకు పొంగిపోయింది. ఒకటికి పదిసార్లు తలనిమిరింది. చెమ్మగిల్లిన కన్నులతో ఒక తియ్యని ముద్దు పెట్టింది. సరోజ వుక్కిరి బిక్కిరయింది. ముక్కుకొనను వారకంటితో ఒకటి రెండుసార్లు చూచుకొంది. ఏదో కొత్తగా వుంది. అందరికంటే అందంగా అమిరినాయి. ఆ రెండు బంగారు సొమ్ములు.

"అందానికి బంగారు సొమ్ములెందుకంటారు – ఏంమాట – ఇప్పుడు మా సరోజ ఎంత బాగుందో" అని నాగమ్మ మురిసిపోయింది. "ఇంకా పెద్దదయితే ఎట్లబ్బా" అని వెంటనే భయపడింది. పోయినకాలమే మేలు – వచ్చే కాలాలు యింకా ఎట్ల మండిపోతాయో! – యీ పిల్లకు మంచి మొగున్ని చూడాల. ఎట్లాటోడు వస్తాడో – ఏమైనా సొమ్ములు పెట్టేవాన్ని చూచి యివ్వాల అని అనుకొంది నాగమ్మ.

నాగమ్మ మొగునికి ఏమీ కాబట్టదు. యింటికి వస్తానే – "అమ్మి బువ్వ తినిందా" అని తప్పక అడుగుతాడు. అంతే. సరోజ పెళ్లిని గురించి అతనికి ఆలోచనే లేదు. "గంతకు తగిన బొంత దొరక్కపోతాడా?" అని అనుకొంటాడేమో! నాగమ్మకు అట్లా కాదు. సరోజ చురుకైంది, అందమైంది – సుమారైనవాడే వస్తాడులే" అని ధీమా. నాగమ్మ ఆలోచనల్లో బతుకు తెరువుకు తగిన భూవసతి వుండి యిన్ని సొమ్ములు పెట్టి వూరకే చేసుకొని పోయేవాడు కావాల. ఆ మాత్రం వున్నవాళ్లు బంధువుల్లో కూడా – కట్నాలు అడుగుతారు. నాగమ్మ దగ్గర ఏముంది కట్నాలు, కానుకలూ యివ్వడానికి. ఒక్కగానొక్క సొత్తు

కూడా చేయించలేదు. నాగమ్మకు ఆ ఆలోచన వస్తానె కండ్లల్లో నీళ్లు మెదలుతాయి.

రోజులు గడుస్తున్నాయి. సరోజ పెరుగుతూ ఉంది. "ఆడపిల్లలు వెనక్కు తిరిగి చూసే లోపల ఎదిగి కూర్చుంటా"రని అంటారు. సరోజకు పైటలు వేసుకొనే వయసు వచ్చింది. కన్నుల్లో కాంతి వచ్చింది. కుచ్చెలపై పైట వేసుకొని వెనకా ముందూ తిరిగి చూచుకొనె గెలివివచ్చింది. చెవుల బుడ్డల్ను తడుముకొని చూచుకొంటుంది. ముక్కుపుడకను ఓరగా చూచుకొంటుంది. "ఒంటిరాయి మక్కుపుడకా – ఒంటిరాయి చెవుల కమ్మలూ ఉంటే బాగుంటుందని అనుకొంటుందేమో! అమ్మతో చెప్పాలని అనుకొంటుంది. చెప్పలేదు. తగ్గుబంగారం బుడ్డలే వున్నాయి చెవుల్లో.

నాగమ్మకూ సొమ్ములు చేయించాలని వుంది. చేయించలేదు. ఎట్లో కాళ్లకు వెండిగొలుసులు చేయించింది. దాంతో సరోజ ఇంతకు అంతయి పొంగిపోయింది. గుడ్డలు అందరితోపాటి వెలగలిగినవి లేవు. ఏమనుకొంటుందో – పనిపాటల్లో లీనమవుతుంది. గడ్డి తెస్తుంది. యింటికి పట్టే గింజలన్నీ దంచుతుంది. పాడెనుముల చూచుకొంటుంది. వంట పనులన్నీ చేస్తుంది. నాగమ్మకు పనిలేకుండా చేస్తుంది. ఏపనైనా శుభ్రంగా చేస్తుంది. ఇంటి పనులు దాదాపు అన్నీ నేర్చుకొంది. బొద్దుగా ముద్దుగా పెరుగుతూ వుంది.

నాగమ్మ గుండెల్లో గుబులుగా వుంది. "ఒకింటిదాన్ని చేయాల. సొత్తులు సొమందాలు లేవు. ఎవరు చేసుకొంటారు. చూచిచూచి కూలోనికీలేము. అందాన్ని చూచి ఆదరించేవారు ఎవరుంటారు. నలుగురిలో నగుబాట్లు కాకుండా పెళ్ళి చేయాల"ని ఎన్నెన్నోవూహలు నాగమ్మకు. "ఆడపిల్ల అదృష్టం కన్నోళ్లు ఎవరున్నారు. ఏమోదాని అదృష్టం కొద్దీ మంచిమొగుడే రావచ్చు" అని సరోజకు తలదువ్వినప్పుడల్లా అనుకొంటుంది. అమ్మి పెద్దదవుతూ వుంది అని ఒకటి రెండుసార్లు మొగునితో అనింది. ఆయనేం చేస్తాడు. ఆయనది మొండి ధైర్యం".

మనపాపకేం అన్ని పనులూ చేతనవుతాయి. బంగారుబొమ్మ. ఎవరైన కళ్ళకద్దుకొని చేసుకొని పోతారులే" అని అనుకొంటాడు. నాగమ్మకు వివరంగా ఏదీ చెప్పడు. చెప్పేతీరికాలేదు. కాడికి పోవడం పొలం పని చూచుకోవడము అంతే.

సరోజు పెళ్లీడుకు వచ్చింది. మళ్లీమళ్లీ చూడ బుద్ది అయేట్లుగా వుంది. "సరోజకే సొమ్ములుంటే ఎంత అందంగా వుంటుందో" అని యిరుగుపొరుగు అంటారు. "సొమ్ములు చేయించండి అమ్మియింకా బాగుంటుందని" మాటిమాటికి హెచ్చరిస్తుంటారు. ఆ మాటలు ఎత్తి పొడుపులు కావని నాగమ్మకు తెలుసు. నాగమ్మకు ఏడ్పు వచ్చినంత పనవుతుంది. అయినా ధైర్యంగా వచ్చేవాడు చేయిస్తాడులే – దానికి కావలసిన సొమ్ములే కరువవుతాయా" అని బింకంగా తేల పలుకుతుంది.

"దూరపు బంధువుల్లో సంబంధాలు దొరుకుతాయేమో" నని నాగమ్మ విచారిస్తూ వుంది. "చిన్న చదువుండి చిన్నవుద్యోగం వుండీ లేదా బతుకు తెరువుకు సరిపోయే కొంత భూవసతి వుండినా పరవాలేదు" అని అనుకొంటుంది. రాళ్లకమ్మలూ తాళిబొట్టుగొలుసూ ఒకతులముండేదైనా పెట్టి పెళ్లి చేసుకొనిపోతే చాలు" అని అనుకొంటుంది. ముఖ్యమైనవి ఈ రెండు సొత్తులతో సరిపెట్టుకొంటుంది.

సరోజ మనుసులో ఏముందో! ఏమీ అనుకోలేకుండా వుంది. సరోజకు అమ్మమాట వేదం. అమ్మనాయనలు సరోజను ఎంతగానో ప్రేమిస్తూన్నారు. ప్రేమగా పెంచి పెద్ద చేసినారు. సరోజకు కావలసినవి సమకూర్చి పెట్టగల శక్తీ స్థోమతా వాళ్లకు లేదు. వాళ్ళకు ఎన్నెన్నో ఆలోచనలు.

ఊడిపడినట్లు ఏదో పని మీద దూరపు బంధువు ఒక ముసిలోడు వాళ్లింటికి వచ్చినాడు. నాగమ్మ బాగా పరామర్శించింది. కాళ్ళకు నీళ్లిచ్చి కలిగినంతలో మర్యాద చేసింది. సరోజే ముసిలోనికి అన్నం వడ్డించింది. "తాతాతాతా" అని నోటార పిలిచి అడిగి అడిగి అన్నం పెట్టింది. అది చూచి ముసిలోడు

మురిసిపోయినాడు. “నాగమ్మా అమ్మిని చేసేకొనేవాడు అదృష్టవంతుడు. మీకిష్టమైతే నాతమ్ముని కొడుకున్నాడు. చేసుకొంటాం. సొమ్ములేమైన పెట్టగలరా” అని నేరుగానే నాగమ్మను అడిగినాడు. పిల్లోడు ఎంతో కొంత చదువుకొన్నాడు. వాని చదువు ఎంతో ఏం ఉద్యోగం వస్తుందో నాకు తెలియదు. పిల్లోడు బాగానే వున్నాడు. పిత్రార్జితం ఐదు ఎకరాలచేను మెట్టవుంది. వానికి తల్లీదండ్రీ లేరు. సదివితే తరమైతాడని నేనే ఏదో విధంగా సదివిస్తున్నాను” అని క్లుప్తంగా పిల్లోని సంగతి చెప్పినాడు. సరోజ నాయన – “మాకేముంది సొత్తులు పెట్టడానికి మీరు మంచిదంటే పిల్లనిస్తాం. కాలానికి మాకున్న ఎకరా పొలం మీదే అవుతుంది కదా యింతకంటే మావద్ద వసతి లేదని” కరాకండిగా చెప్పినాడు. నాగమ్మ మాత్రం “అప్పాయినా చేసి తాళిబొట్టుగొలుసూ కమ్మలూ చేయిస్తాం. కాలానికి మీకు శక్తి వచ్చినపుడు రెండుపురుల గొలుసు చేయంచండి చాలు” అని నచ్చచెప్పింది. “మీకు నచ్చిన పిల్లది. మీవానికి నచ్చక పోతుందా. పూర్వపు బంధుత్వాన్ని తిరిగి కలుపుకొందాం” అని ప్రాధేయపడింది.

ముసిలోడు ఆలోచనలో పడినాడు. “ఉన్నది ఉన్నట్లు చెపుతున్నారు. వాళ్ళది తప్పు లే”దన్నట్లు తల వూపినాడు. కట్టెచేతికి తీసుకొని “పోయొస్తా నాగమ్మా – వీలు చూచుకొని పిల్లోన్ని పిలుచుకొనివస్తాలే – దేవుడు ఎట్ల రాసింటే అట్లా జరుగుతాది. ఎవరికి తెలుసు” అని గడపదాటి పోయినాడు.

నాగమ్మకు ఎంతో సంతోషంగా వుంది. సరోజకు పెళ్లి అని మనసులోకి రాగానే. పిల్లోడు ఎట్లుంటాడో అని ఆలోచనలోపడింది.

అమ్మ తాళిబొట్టు గొలుసు ఎట్లా చేయిస్తుంది – అమ్మ మంచిది అని అనుకొంది సరోజ.

అనుకొన్నట్లే నెలతిరగకతలికే ముసిలోడు పిల్లోడు వచ్చినారు. ఊర్లోకూడా ఎవరికీ తెలియదు. నాగమ్మకూ తెలియదు. సరోజకు మంచి బట్టలైనా తెచ్చుకోలేదు. పిల్లను ఉన్నది ఉన్నట్లు పిల్లోడు చూచినాడు. ఏతతంగమూలేదు. మామూలు మర్యాదలే చేసినారు. నాగమ్మకు భయంభయంగా వుంది. ముందు

"తెలిపి వచ్చింటే బాగుండు" అని అనుకొంది. సరోజ కూడ పిల్లోన్ని ఉన్నఫలాన చూడాల్సివచ్చింది. అయినా సరోజకు ఏ ఆలోచనా లేదు. సరోజకు పిల్లోడు నచ్చినట్లేవుంది. నాగమ్మకూ పిల్లోడు నచ్చినాడు.

ముసిలోడు పిల్లోనితో "ఏరా అబ్బీ పిల్లదాన్ని చూచినావా – నాకు నచ్చిందిరా, పనిపాటలన్నీ చేస్తుంది, చురుకైంది. నెమ్మదైంది. నీయిష్టం చెప్పరా పెళ్లి ఏర్పాటు చేస్తాను. ఎవరి అదృష్టం ఎట్లుందో నాకు మాత్రం పిల్లది నచ్చిందిరా" అని అన్నాడు. "పిల్లది బాగుంది, నీయిష్టమే నాయిష్టం" అని చెప్పినాడు. ఉన్నంతలో సరోజ పెళ్లి జరిగింది. ఊరందరికీ ఆశ్చర్యమే. ఎవరికీ ముందుగా తెలియదు. అంతో యింతో సదువుకున్నోడంట. పిల్లోడూ బాగానే వున్నాడు. సరోజ అదృష్టవంతురాలే" అని అందరూ ఆశ్చర్యపోయినారు.

తాత్కాలికంగా యిరుగుపొరుగు వాళ్లది తాళిబొట్టు గొలుసు పెట్టింది నాగమ్మ. ముసిలోనితో "తొందరయ్యింది నిదానంగా చేయిస్తా" నని నమ్మకంగా చెప్పింది.

సరోజకు భర్త నచ్చినట్లే వుంది. తాళిబొట్టు గొలుసు సంగతి అంతగా పట్టించుకోలేదు. పెళ్లిలో ఏ గొడవలూ రాలేదు. రాళ్ల కమ్మలు మాత్రం సరోజకు చేయించింది నాగమ్మ. ''అదేచాలు'' అని తృప్తిపడింది సరోజ. కొన్నాళ్లు సరోజ తల్లిగారింటిలోనే వుండాల్సి వచ్చింది. భర్తసదువు అయిపోయిందాకా.

భర్త సదువు అయిపోయింది. చిన్న ఉద్యోగమూ వచ్చింది. సరోజకు సంతోషంగా వుంది. అమ్మను విడిచిపెట్టి పోవాల్నే అని బాధగానూ వుంది. భర్త లాలింపులకు పొంగిపోతూ వుంది.

సరోజను కాపురానికి పంపేటప్పుడు నాగమ్మ చాలాబాధపడింది. "పిల్లదానికి తాళిబొట్టుగొలుసు పెట్టలేక పోతినే" అని. కనీసం ఒక మంచి దాపుడు కోకైనా పెట్టకపోతినని ఏడ్చింది.

పిల్లోనికివన్నీ పట్టలేదు. సరోజ బాగుంది. చెప్పినట్లు వింటుంది. చేయమన్నపని చేస్తుంది. ఎంతచెప్పితే అంతగా మసలుకొంటుంది. సరోజ కాపురం బాగుంది. తన్ను చూచుకొంటూ తనచుట్టూ తిరిగే భర్తను చూచుకొంటూ మనసులో పొంగిపోతూంది. ఏమీ లేకున్నా సరోజ తృప్తిగా సంసారం చేసుకొంటూ వుంది.

"వాళ్లకేం పిల్లా పిల్లోడు సమరసంగా సంసారం చేసుకొని పోతున్నారనీ, రాళ్లకమ్మలూ తాళిబొట్టు తప్ప నగా నట్రా ఏమీలేదు పాపం" అని అందరూ మెచ్చుకొన్నారు. సరోజకు సొమ్ములుంటే బాగుంటుందని అనుకొంటుంది. రెండు పుర్లగొలుసు భర్త చేయించలేదు. పైగా "కాలానికి చేయించుకొందురులే" అని అన్నారే కానీ కరారు లేదు. నాగమ్మా శక్తివున్నప్పుడు తప్పక తాళిబొట్టు గొలుసు చేయిస్తానని కూడ పలికిందేకానీ చేయించేందుకు నిజంగా శక్తిలేదు. తల్లిని ఏమని నిందిస్తుంది. అమ్మ అంటే సరోజకు ఎక్కడలేని గౌరవం. తనకు బువ్వపెట్టింది. నీళ్లుపోసింది. ఉన్నంతలో గుడ్డలు కట్టించింది ప్రతి క్షణం తన్ను కంట వత్తివేసుకొని కాపాడింది. ఏమైనా ఎవరూ ఏమీ అనుకోకుండా పోయినారని సంపారం కొత్తల్లో ఒకటిరెండు సార్లు అనుకొంది. సొమ్ములు లేకపోయినా భర్త లాలన గొప్పది అదే పదివేలని సరోజ సరిపెట్టుకొంది. సొమ్ముల విషయం ఎప్పుడూ భర్తతో అనలేదు. అమ్మను కూడా అడగలేదు. సంతోషంగా సంసారంలో పడిపోయింది. తిండికీ గుడ్డకూ లోటు లేకుండా జరుగుతూంది.

సరోజకు ఒక ఆడపిల్ల పుట్టింది. నాగమ్మ సరోజకు పురుడు పోసింది. అయ్యో రాత నీకు నా మాదిరినే తొలిసంతానం ఆడపిల్ల అని నాగమ్మ నొప్పిపడింది. నాగమ్మ తపన మళ్లీ మొదలైంది. "ఈ పిల్లకూ సొమ్ములు కావాల. సరోజకే సొమ్ములులేవు ఈ పిల్ల కెక్కడి నుండి తేవాలనీ". సరోజ నాగమ్మలు ఎవరూ ఏమీ యీ విషయాలు మాట్లాడుకోరు. పిల్లదాని అందం చూచుకొంటూ మురిసిపోతుంటారు. వరసగా యిద్దరు మగపిల్లవాళ్ళు పుట్టినారు. సరోజ

ఎంతగానో సంతోషపడింది. ముగ్గురు పిల్లలు అందంగా వున్నారు. భర్తకు పిల్లలకు ఎట్ల అయినా సదువు చెప్పించాలని దీక్ష మొదలైంది. అతనికి తెలుసు సదువుంటే సుఖంగా బతుకుతారని. చిన్న ఉద్యోగమైనా బువ్వకు లోటుండదు. అజ్ఞానంగా లేకుండా విజ్ఞానంగా బతికేందుకు వీలుంటుందని అనుకొన్నాడు. ఆ మాటే పదేపదే సరోజకూ చెప్పుతాడు. సరోజ కూడా చిన్ననాటి జీవితానికి ఇప్పటి జీవితానికి ఏదో ఒక తేడా ఉన్నట్లు గమనించి ఉద్యోగాలొచ్చేట్లు పిల్లలను చదివించాలని తీర్మానించుకొంది. నాకు లేకపోయినా నా పిల్లోల్లకు సదువు రావాలనుకొంది. ఆడపిల్ల విషయం ఎక్కువగా ఆలోచిస్తుంది. నాకు లేకున్నా పిల్లదానికి సొమ్ములుండాలనుకొంటుంది. "ఏం లాభం ఎట్లా చేయించలేం. సదువుంటే చాల్లే" అని తృప్తిపడుతుంది. భర్తతో పిల్లదానికేమైనా సొమ్ములకు జీతంలో మిగిలించాలని హెచ్చరిస్తుంది. అంతా తన ఆరాటమేగాని జరిగేపని కాదని వెంటనే తెలుసుకొంటుంది. చాలీచాలని జీతాల్లో ఏమి మిగిలిస్తాడు. "దాని కాలం వచ్చినప్పుడు అన్నీ వస్తాయిలే భయపడకు" అని ధైర్యం చెప్పుతాడు భర్త. ఏమీ లేకున్నా మనం టౌన్‌లో వున్నాం కాబట్టి మనపిల్లోల్లకు తప్పక సదువు వస్తుంది. ఏదో చిన్న చిన్న ఉద్యోగాలొస్తాయి. ఒకరిని ఆశించకుండా బతుకుతారులే అని అంటాడు. "సదువుకు మించిన సొమ్ములుండాయా" అని గప్పాలు కొట్టుతాడు. సరోజకూ ఒక్కొక్కప్పుడు అదీ నిజమే ననిపిస్తుంది. ఇరుగుపొరుగు పిల్లలచూచి పిల్లదానికి సొమ్ము ఒక్కటైనా వుండాలని అనిపిస్తుంది. పండగలూ పబ్బాలు వచ్చినపుడు మరీ కష్టంగా భావిస్తుంది. భర్తకు శక్తికి మించిన పనులు చేయాలని వుంటుంది. కానీ చేయలేడు. ఎట్లా ఎక్కువ సంపాదిస్తాడు. గొట్టెతోక జీతం. పెరగదు తరగదు. ఉన్నదాంట్లోనే సర్దుకొంటూ పిల్లోల్లను మాత్రం దీక్షగా చదివించినారు. ఆర్థికంగా వారి కుటుంబంలో అభివృద్ధి లేదు. జీవితంతో రాజీపడి సరోజను చూచుకొంటూ పిల్లల అభివృద్ధినీ చూచుకొంటూ సంసారాన్ని యీడుస్తు ధైర్యంగా ముందుకు పోవడమే అతని ధ్యేయమైంది. సదువులు చెప్పించేదే వాళ్ల ప్రథమ కర్తవ్యంగా ఇద్దరూ అనుకొన్నారు. వారిమద్య ఏ భేదాభిప్రాయాలు లేవు. యీ విషయంలోనేకాదు ఏ విషయంలో కూడా.

పిల్లది పెళ్ళీడుకొచ్చింది బి.ఏ., చదివింది. మొగపిల్లలూ బాగా వృద్ధికొస్తారని బరోసా దొరికిందేమో పిల్లదానికి ఒక మంచి సంబంధం కుదిరింది. భూములు అమ్మి ముఖ్యంగా కావలసిన సొమ్ములు చేయించి సరోజ బిడ్డకు పెళ్లి చేసింది. పెళ్లినాడు సరోజ ఎంత సబంరపడిందో! అల్లుడూ ఆడబిడ్డను చూచి సరోజ పొంగిపోయింది. నేననుకొన్నట్లు నా బిడ్డకు సొమ్ములు పెట్టగలిగినానని మనసులోనే వేయి దేవుళ్ళకు మొక్కుకుంది. నాగమ్మ మనవరాలి పెళ్లి చూచింది. ఆనందంలో ఉక్కిరిబిక్కిరయింది. సరోజను సరోజ కాపురాన్ని సంసారంలో ఆమె ప్రయోజకత్వాన్ని చూచి నాగమ్మ ముసలిప్రాణం మురిసిపోయింది.

మొగపిల్లల చదువులూ అయిపోయినాయి. చిన్న చిన్న ఉద్యోగాలూ సంపాదించుకొన్నారు. సరోజ భర్త వాళ్లకు సంబంధాలు చూచి పెళ్లిళ్లు చేసినాడు. అతడు అదృష్టవంతుడు పిల్లోల్లను బాగ చదివించుకొన్నాడు అని అందరూ ఎంతో మెచ్చుకొన్నారు. సరోజ ఎంతగానో సంతోషించింది. ఈ మధ్యే అమ్మపోయిన దిగులు కొంత కుంగదీసింది. నాయనా పోయినాడు. సరోజ కిప్పుడు అమ్మ నాయనలేరు. భర్త పిల్లోల్లు బాగుండాలని కోరుకొంటుంది. వాళ్లకేమొచ్చినా భయపడుతుంది. నీకేమమ్మా ఆడపిల్లా అల్లుడూ బాగున్నారు కొడుకులూ కోడంద్రూ బాగున్నారు. కావలసినంత బంగారుతో నీవు కోరుకొన్నట్లు వచ్చినారు అని ఎవరైనా అంటే ఎంతో తృప్తితో నిట్టూరుస్తుంది. సరోజకేలోటూలేదు. అంతా బాగానే వుంది.

తాళిబొట్టు గొలుసులేదు, ఎవరు చేయిస్తారు. అమ్మలేదు. భర్తకు చేతకాదు. ఇద్దరూ వృద్ధాప్యంలోకి జారుకొంటున్నారు. పిల్లోల్లడబ్బుల్తో చేయించుకోవడానికి యిద్దరికీ యిష్టం లేదు. ఏమైనా సరోజకు మంచి ఓర్పు. ఆ గుణమే ఆమెకు విలువైన సొమ్ము.


అందరికీ ఆమె అంటే గొప్ప గౌరవం.

గుణాల్నే సొమ్ములుగా మార్చుకొని బతికింది సరోజ.



పురుషోత్తమరెడ్డి వివాహ సందర్భముగా

# వై.సి.వి. రెడ్డి కుమారులు కోడలు



తులసి ప్రతాప్‌రెడ్డి



ప్రభాకరరెడ్డి ఉమామహేశ్వరి



పురుషోత్తమరెడ్డి పద్మావతి

# జేజేలు

నటరాజ వరశిరస్తట పతద్ధుతిని వోలె
చటుల కార్ముక ముక్త శరపరంపర వోలె
ప్రాభాత జనిత సంపత్సమీరము వోలె
కండ చక్కెర పానకము వోలె - మధురసం
గతివోలె రుచిరమై కదలినది మీ కవిత

చెలువొంది సుధను ముంచితివేమో కలమూ
నీరాజనములివ్వ నిల్చెపో జనమూ

సెలకన్నె సోగకన్నుల వెన్నెలలు గాయ
మేనా వధూటి నెమ్మేన పుల్కలు పూయ
దక్షిణానిల వచోద్ధతి పేరణము సేయ
రంభాంఘ్రి యుగళ మర్మరపుటందెలు మ్రోయ
వైజయంతీ ప్రభాపటలి దిక్కుల డాయ

పారిజాత లతాంత పరిమళ శ్రీలూ
నింపితివి వై.సీ.వి. నీకు జేజేలూ

**- మలసాని చంద్రశేఖర్‌రెడ్డి**